www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 7 మే 2025
సంపుటి :06 సంచిక : 337 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని కలిసి సరస్వతి పుష్కరాలకు ఆహ్వానించిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ. సీఎంతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విష్ణునాథ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం అందించిన మంత్రి కొండా సురేఖ .
హైదరాబాద్ వెలుతురు మే 06:



## కాంగ్రెస్ ఖేల్ ఖతం... దుకాణ్ బంద్

- సీఎం వ్యాఖ్యలే నిదర్శనం
- ఇక రైతుల హామీలన్నీ గాలికొదిలేసినట్లే
- వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇక ఇయ్యరు
- నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇక రాదు
- ఆ కాంట్రాక్ట్ తో ఉన్న సమస్యను పరిష్కరించుకోవాలని కేంద్రం చెప్పింది నిజం కాదా?
- ఆ సమస్యను పరిష్కరిస్తే 6 లేన్ జాతీయ రహదారిగా విస్తరిస్తామని 2022లోనే చెప్పలేదా?
- ఇదిగో...ఆధారం
- నిన్న కోమటిరెడ్డికి కూడా గడ్కరీ ఇదే విషయాన్ని చెప్పారు
- అయినా లేఖల పేరుతో కేంద్రంపై బురద చల్లడం ఎంత వరకు కరెక్ట్?
- ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ డ్రామాలాడుతున్నారు
- సీఎం వ్యాఖ్యలపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పందించాల్సిందే

ఎల్లారెడ్డిపేటలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్..

ఎల్లారెడ్డి పేట వెలుతురు మే 06:
రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, పైసా అప్పు కూడా పుట్టడం లేదని, ఢిల్లీకి పోతే చెప్పులెత్తుకుపోతారేమనని దొంగలాగా చూస్తూ అపాయిట్ మెంట్ కూడా ఇవ్వడం లేదంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇక అమలు చేయలేనని సీఎం తేల్చేశారు. ఇక వృద్ధులకు రూ.4 వేల ఫించన్ ఇక ఇయ్యరు. మహిళలకు నెలనెలా రూ.2500లు, తులం బంగారం ఒట్టిమాటేనని తేలింది. నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఇయ్యనట్లే. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇయ్యరని తేల్చేసినట్లే. రైతులకిచ్చిన హామీలను గాలికొదిలేసినట్లే"అని వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి



- లక్షలాదిగా వచ్చే భక్తులకు సకల ఏర్పాట్లు చేయాలి
- రవాణా, శానిటరీ, భద్రతా, వైద్యం, ప్రచార చర్యలు పక్కాగా ఉండాలి
- గతంలో సమ్మక్క - సారక్క ఇతర దైవ కార్యాల అనుభవాలతో ఏర్పాట్లు చేయాలి
- చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు రావొద్దు
- పెండింగ్ ఇంజనీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- అధికార యంత్రాంగానికి రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబులు ఆదేశం
- రివ్యూ మీటింగులో పాల్గొన్న సీఎస్, డీజీపీ, ఎండోమెంట్ ప్రిన్స్ పల్ సెక్రటరీ

హైదరాబాద్ వెలుతురు మే 06:
భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే "అంతర్వాహిని" సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. మంగళవారం మంత్రి సురేఖ ఆధ్వర్యంలో కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల రివ్యూ మీటింగ్ హైదరాబాద్ సెక్రటేరియట్ లోని ఎండోమెంట్ మంత్రి కార్యాలయంలో జరిగింది. అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ స్నానానికి లక్షలాది భక్తులు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా



వస్తారని తెలిపారు. సరస్వతీ నది పుష్కరాలు బృహస్పతి మిథున రాశి ( మిథునరాశి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కు సూటి మనిషి

- అప్పులు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉంది
- ఉద్యోగుల రిటైర్మెంట్ ఎందుకు పెంచారో తెలియదా?
- కాళేశ్వరం కోసం లక్షకోట్లు ఎందుకు పెట్టారో తెలియదా
- కెటిఆర్ వ్యాఖ్యలపై మీడియా చిట్‌చాట్‌లో శ్రీధర్ బాబు

గత ప్రభుత్వం నిర్వాకంపైనే సీఎం మాట్లాడారు

హైదరాబాద్,మే6( వెలుతురు):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిముక్కు సూటి మనిషి అని.. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల ఇబ్బంది పడుతున్నామని గుర్తు చేశారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలు,అప్పులు, అరాచకాలు ప్రజలకు తెలియాల్సి ఉందని అందుకు సిఎం అలా మాట్లాడి ఉంటారని అన్నారు. మీడియాతో మంత్రి చీట్‌చాట్ నిర్వహించారు. బీజేపీ వాళు దిగి పోండి అంటున్నారు.. బీజేపీ కేంద్రంలో పాలన చేతకాకపోతే దిగమను. పెహల్గం వైఫల్యంకి దిగిపో అనాలా.. బీజేపీ ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా..? మోడీ



## ఆర్టీసీ సమ్మె వాయిదా

- ముగ్గురు ఐఎఎస్‌లతో కమిటీ
- మంత్రి పొన్నంతో చర్చల అనంతరం జెఎసి వెల్లడి



హైదరాబాద్,మే6( వెలుతురు):
తెలంగాణలో ఆర్టీసి సమ్మె వాయిదా పడింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో జరిపిన చర్చలు సఫలం కావడంతో ఆర్టీసి కార్మిక సంఘాల నేతలు సమ్మెను వాయిదా వేస్తున్నట్లు– ప్రకటించారు. రేపటి నుంచి రాష్ట్రంలో సమ్మె చేయనున్నట్లు–

## అప్పు పుట్టడం లేదని సీఎం రేవంత్ మాట్లాడటం వెనుక అంతర్యం ఏంటి ?

- ఉద్యోగుల మీదకు ప్రజలను ఉసికోల్పుతున్నారు
- ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఆరు గ్యారంటీలను ఎగవేసే కుట్ర చేస్తున్నారు
- సంక్షేమ పథకాలు ఎత్తేసేందుకు ప్రజలను ప్రిపేర్ చేస్తున్నారు
- రైతు భరోసా అందకపోవడంతో రైతులు అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకుంటున్నారు
- తెలంగాణ ఆర్థిక పరిస్థితి గాడి తప్పింది
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



హైదరాబాద్ వెలుతురు మే 06:
1. ఇచ్చిన హామీలను ఎత్తివేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు... అందుకే రాష్ట్రం దివాళా తీసిందని పదే పదే మాట్లాడుతున్నారు.
రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసింది ...అప్పులు పెరుగుతున్నట్టుగా ఆదాయం పెరగడం లేదు ... నన్ను కోసినా సరే పైసల్లేవు ...బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వంపై సమరమే అని ఉద్యోగులంటున్నారు ... ఉద్యోగుల సమరం 98 శాతం ఉన్న ప్రజల మీదా? జీతాలు, పెన్షన్లు ఇచ్చే ప్రజల పట్ల ఉద్యోగులకు బాధ్యత లేదా? ఉద్యోగులు కొత్త డిమాండ్లతో దీక్షలకు దిగితే ఆర్థిక వ్యవస్థ కుప్ప కూలుతుంది ఉచిత కరెంటు, వృద్ధాప్య పెన్షన్ల వంటి ఏ పథకాలు ఆపాలో చెప్పండి పెట్రోల్, ఉప్పులు, పప్పులు ధరలు పెంచుదామా? ప్రజలపై యుద్ధం చేసి బాగుపడ్డ వారెవరూ లేరు ఆర్థిక వ్యవస్థను నాశనం చేసినోడు ఫామ్ హౌసులో ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎకరం భూమిని అమ్మలేదు అప్పు కోసం వెళ్తే బ్యాంకులు దొంగల్లా చూస్తున్నాయి రాజకీయ పార్టీలు ఉద్యోగ సంఘాలను రెచ్చగొడుతున్నాయి ... రాజకీయ పార్టీల చేతుల్లో ఉద్యోగులు పావులుగా మారొద్దు ... ఉన్న ఆదాయానికి మించి ఉద్యోగులకు పైసాఇవ్వలేను అంటూ నిన్న (2025 మే 05) సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం వెనక ఏదో పెద్ద ఆలోచనే ఉన్నట్టు కనిపిస్తోంది. ఇచ్చిన హామీలను ఎత్తివేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు.
2. రాష్ట్రానికి భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రే ఇపుడు ఉద్యోగులను, ప్రజలను భయపెడుతున్నారు!
ముఖ్యమంత్రి అంటే ప్రజల సమస్యలను పరిష్కరించేలా భరోసా కల్పించాల్సిన రాష్ట్ర అధినేత. కానీ సీఎం రేవంత్ రెడ్డిగారు ప్రజలకు భరోసా కల్పించడం మాటేమో కానీ, రాష్ట్ర ఆర్థికంగా

9 లో..




## పహల్గామ్ దాడి.. మోడీకి ముందే తెలుసు

- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సంచలన వ్యాఖ్యలు
- ఖర్గే వ్యాఖ్యలపై మండపడ్డ బిజెపి నేతలు



న్యూఢిల్లీ,మే6( వెలుతురు):
పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సంచలన వ్యాఖ్యలు చేశారు. హహల్గాం ఉగ్రదాడి ఘటనకు మూడు రోజులకు ముందే ఇంటెలిజెన్స్ సమాచారం అందడటంతో

## ఓబులాపురం మైనింగ్ కేసులో తుదితీర్పు

- గాలి జనార్ధన్ రెడ్డి తదితరులకు ఏడేళ్ల జైలు
- ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించిన కోర్టు
- మాజీమంత్రి సబితను నిర్దోషిగా ప్రకటించిన కోర్టు

హైదరాబాద్,మే 6( వెలుతురు):
ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్,



(మొదటి పేజీ తరువాయి..)

## ఆర్టీసీ సమ్మె వాయిదా

కార్మిక సంఘాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్చలకు పిలుపునివ్వడంతో మంగళవారం తమ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో కార్మిక సంఘాల నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సమ్మె ఆలోచన విరమించుకోవాలని కార్మిక సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. సమ్మెకు వెళ్లి ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని కోరారు. ఇప్పుడిప్పుడే సంస్థ కోలుకుంటుందని.. సమ్మె చేస్తే నష్టం జరుగు తుందని చెప్పారు. కార్మికుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్తామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని మంత్రి చెప్పడంతో తాత్కాలికంగా సమ్మెను వాయిదా వేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు వెల్లడించారు. నేటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జేఏసీ నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్, నవీన్ మిత్తల్ ఉంటారు. కమిటీ– ఉద్యోగ సంఘాలతో చర్చించి వారంలోగా పరిష్కారం చూపాలని సర్కార్ ఆదేశాలిచ్చింది. తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ జేఏసీ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో వెంటనే ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులకు బహిరంగ లేఖ రాసింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా పుంజుకుంటు–న్న ఆర్టీసీని సమ్మె ద్వారా దెబ్బతీయవద్దని కోరింది. అలా కాకుండా మొండిగా సమ్మెకు దిగితే మాత్రం కఠిన చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. ఎస్మా చట్టం ప్రకారం ఆర్టీసీలో సమ్మెలు చేయడం నిషేధం. ఇదిలా ఉంటే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఉద్యోగులతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో ఉద్యోగ సంఘాలు సమ్మెను వాయిదా వేసుకున్నాయి. ఆర్టీసీ జేఏసీ నేతలు సమ్మె వాయిదా వేస్తున్నట్లు– సచివాలయం మీడియా పాయింట్ వద్ద వెల్లడించారు. ప్రభుత్వంతో సుధీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని ప్రకటించారు. పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావులతో అనేక అంశాలపై చర్చించినట్లు– పేర్కొన్నారు. ఆర్టీసీ యూనియన్ లపై ఆంక్షల తొలగింపు, అన్ని కేటగిరీల్లో ఖాళీ భర్తీ, గుర్తింపు ఎన్నికల నిర్వహణ, కారుణ్య నియామకాలు , ఉద్యోగ భద్రతపై సర్క్యులర్, నేరుగా ఆర్టీసీకే ఎలక్ట్రిక్ బస్సులు, 2025 నుంచి రి–టైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ చెల్లింపులు, 2017లో రిటైర్ అయిన వారికి వేతన సవరణ ప్రకారం బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు– తెలిపారు. అలాగే 2019 లో సమ్మె కాలంలో ఉద్యోగులపై వేసిన పోలీస్ కేసులను మాఫీ, ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం చేయాలని కోరినట్లు– వెల్లడించారు. తమ అని డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని పేర్కొన్నారు.

## పహల్గామ్ దాడి.. మోడీకి ముందే తెలుసు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని అన్నారు. జార్ఖండ్‌లోని రాంచీలో మంగళవారంనాడు జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. ఇంటెలిజెన్స్ వైఫల్యం ఉంది. ప్రభుత్వం కూడా దీనిని అంగీకరించింది. ఇంటెలిజెన్స్ పటిష్టం చేసుకుంటామని వాళ్లే చెప్పారు. అయితే దాడికి మూడు రోజుల ముందే ప్రధానికి నిఘా సమాచారం అందినట్టు నాకు తెలిసింది. దాంతోనే ఆయన జమ్మూకశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఈ విషయాన్ని వార్తా పత్రికల్లో కూడా చూశాను. దీనిపై ప్రధాని సమాధానం చెప్పాలని అన్నారు. ఏదేమైనా పహల్గాం దాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై ఎటువంటి చర్య తీసుకున్నా ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందని అన్నారు. రాంచీ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ మాటలు మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడికి సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన విమర్శలపై భాజపా తీవ్రంగా స్పందించింది. భద్రతా బలగాల స్థయిర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేసింది. కాంగ్రెస్ చేసిన ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని భాజపా అధికార ప్రతినిధి తుహిన్ సిన్హా మీడియాతో అన్నారు. ఉగ్రవాదంపై పోరు నిర్ణయాత్మక దశకు చేరుకున్న సమయంలో ప్రధాని మోదీ, కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని మరో నేత ప్రశ్నించారు. పాకిస్థాన్‌పై దాడి విషయంలో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా మేం మద్దతు ఇస్తామని చెప్తూనే.. మరోవైపు దేశాన్ని బలహీన పరిచే ప్రయత్నం చేస్తున్నారు. పహల్గాం ఘటన విషయంలో ప్రధానిపై విమర్శలు చేయడం దురదృష్టకరమని భాజపా సీనియర్ నేత రవిశంకర్ మండిపడ్డారు. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దీనిపై విమర్శలు చేయడంపై కాంగ్రెస్ తీరును బిజెపి ఎండగట్టింది

## ఓబులాపురం మైనింగ్ కేసులో తుదితీర్పు

గనులశాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనులశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. గాలి జనార్దన్ రెడ్డితో సహా నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రస్తుతం గాలి జనార్దన్ రెడ్డి కర్ణాటకలోని గంగావతి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఓబులాపురం మైనింగ్ కేసులో ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష ఖరారు కావడంతో ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉంది. 'కల్యాణ రాజ్య ప్రగతి పక్ష' అనే పొలిటికల్ పార్టీని స్థాపించి 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో గాలి జనార్దన్ రెడ్డి గంగావతి నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీలో చేరిపోయారు. అయితే.. సీబీఐ కోర్టు వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానాల్లో సవాల్ చేసే అవకాశం కూడా ఉంది. ఇకపోతే ఓఎంసీ కేసులో గాలి జనార్దన్ రెడ్డి ఇప్పటికే కొంత కాలం జైలు జీవితం గడిపిన సంగతి తెలిసిందే. ఓబులాపురం మైనింగ్ కేసులో విచారణ దాదాపు 13 ఏళ్లకు పైగానే సాగింది. 3,,400 డాక్యుమెంట్లను పరిశీలించి, 219 మంది సాక్ష్యులను విచారించి.. కర్ణాటక ఫారెస్ట్ ల్యాండ్స్‌లో గాలి బ్రదర్స్ మైనింగ్ తవ్వకాల వల్ల 884.13 కోట్ల రూపాయలను రాష్ట్రం నష్టపోయిందనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి సీబీఐ కోర్టు తుది తీర్పు వెల్లడించడం గమనార్హం. 2007 జూన్ 18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో ఛార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది ఛార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. అనంతపురంలోని ఓబుళాపురంలో గనుల కేటాయింపు, తవ్వకాలకు సంబంధించి అత్యాధునిక పరికరాలతో సీబీఐ ఆధారాలు సేకరించింది. అక్రమంగా తవ్వకాలు, రవాణా, ఎగుమతులు, విక్రయాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు– సీబీఐ గుర్తించింది. ఏపీ, కర్ణాటక సరిహద్దుల్లో పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. దీనిపై పూర్తి ఆధారాలు, సాక్ష్యాల సేకరణతో 2014లో తుది ఛార్జిషీట్ దాఖలైంది. విదేశాలకు అక్రమంగా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఎగుమతి చేశారని, అక్రమ బినామీ లావాదేవీలు జరిగినట్లు– గుర్తించామని సీబీఐ ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసులో విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందగా.. ఏ6 శ్రీలక్ష్మిని 2022లో ఈ కేసు నుంచి తెలంగాణ హైకోర్టు డిశ్చార్జి చేసింది. మొత్తంగా ఈ కేసునుంచి మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఊరట దక్కడంతో ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ ఖేల్ ఖతం... దుకాణ్ బంద్..

(మొదటి పేజీ తరువాయి..)

- మహిళలకు నెలనెలా రూ.2500లు, తులం బంగారం ఒట్టిమాటేనని తేలింది
- విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇగ ఇయ్యరని తేల్చేశారు
- మోసాల కాంగ్రెస్ ను వదిలిపెట్టబోం
- రేపటి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తాం
- "సంవిధాన్" చేత పట్టి రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలేమైనయ్
- రాహుల్ సమాధానం చెప్పి తీరాల్సిందే...
- రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ వన్నీ ఝూటా మాటలే...
- నాగుపాములెక్క వంకర టింకరగా రోడ్డును నిర్మించింది కాంగ్రెస్సే
- కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయించింది కాంగ్రెస్సే
- 2035 వరకు కాంట్రాక్టర్ తో అగ్రిమెంట్ చేయించుకున్నది కాంగ్రెస్సే

ఇగ తెలంగాణలో కాంగ్రెస్ ఖేల్ ఖతం... దుకాణం బంద్ అయినట్లేనని అన్నారు. సంవిధాన్ పుస్తకం పట్టుకుని తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని గతంలో హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ ఇప్పుడెం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సీఎం వ్యాఖ్యలపై మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో భయం పట్టుకుందన్నారు. ఇచ్చిన మాట తప్పి చేతులెత్తేసిన కాంగ్రెస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజలతో కలిసి రేపటి నుండి మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుని తీరుతామని చెప్పారు.
మంగళవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థానిక ప్రెస్ క్లబ్ ను సందర్శించారు. స్థానిక విలేకరులతో కొద్దిసేపు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే.....
తెలంగాణ రాష్ట్రమనే కుటుంబానికి పెద్దగా ఉండాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాతో ఏం కాదు. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నా. రాష్ట్రం దివాళా తీసింది. అని మాట్లాడటం సిగ్గు చేటు. ఇప్పటికే కాంగ్రెస్ పట్ల ప్రజలకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నరు. నిన్న సీఎం మాటలతో కాంగ్రెస్ పనైపోయింది. ఖేల్ ఖతం దుకాణ్ బంద్.
సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా మా భవిష్యత్తు ఏమిటనే భయంతో ఉన్నరు. ఇంటికి ఏదైనా సమస్య వస్తే ఇంటి పెద్ద కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ సమస్యను అధిగమించేందుకు యత్నిస్తరు. కానీ రాష్ట్రానికి పెద్దగా ఉన్న ముఖ్యమంత్రి అందుకు భిన్నంగా మాట్లాడి రాష్ట్రం పరువు తీసిండు. దేశం ముందు తలదించుకునేలా చేసిండు. యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం నిన్న పూర్తిగా మంట కలిపారు. 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ఇంతకంటే అవమానం మరొకటి లేనేలేదు.
ఢిల్లీకి పోతే అపాయిట్ మెంట్ కూడా ఇస్తలేరని చెప్పడం పచ్చి అబద్దం. ప్రధానమంత్రిని చాలా సార్లు కలిశారు. కేంద్ర మంత్రులను ఎప్పుడంటే అప్పుడు కలుస్తూనే ఉన్నడు. అయినా ఏం మాట్లాడుతున్నరు. "వీడొస్తే చెప్పులు కూడా ఎత్తుకుపోతరేమోననే భయంతో దగ్గరికి కూడా రానీయడం లేదు."అని అంటున్నడు. ఈ చెప్పులెత్తకపోవడమేంది? ఈ చెప్పులెత్తకపోవడమేంది? నాకైతే అర్థం కాలే. కాంగ్రెస్ లో అట్లనే చేస్తరేమో. ఆ పార్టీ సంస్కృతి అదేనేమో. 2023 డిసెంబర్ లో, 2024 జులైలో, 2025 ఫిబ్రవరిలో కూడా రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్రమోదీని కలిశారు. కేంద్ర మంత్రులైతే లెక్కేలేదు. నిన్న కూడా గడ్కరీ గారు కలిశారు. అయినా అపాయిట్ మెంట్ ఇయ్యడం లేదు. చెప్పులు ఎత్తకపోయేవాడిలా చూస్తున్నరనడం సిగ్గు చేటు.
సీఎం వ్యాఖ్యలను పరిశీలిస్తే.... ఆయన పూర్తిగా చేతులెత్తేశారు. హామీలను అమలు చేయలేం. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేం. ఇచ్చిన హామీలను అమలు చేయలేమని చెప్పిండు... ఇగ ప్రజలే ఆలోచించాలి. ఎన్నికలకు ముందు ఇదే రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పిండు. అయినా వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ ఇచ్చిండు. ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నడు. హామీలను అమలు చేస్తామని బాండ్ పేపర్ కూడా రాసిచ్చారు. కానీ సీఎం సీటెక్కంగనే చేతులెత్తేసిండు. ఇగ మీ ఖర్మ అని చేతులెత్తిసిండు. ఓట్లేసి గెలిపించినందుకు మీ తీట మీది అని అంటున్నడు. ఇకపై రైతులకిచ్చిన హామీలను అమలు చేయడు. వృద్దులకు రూ.4 వేల ఫించన్ ఇయ్యడు. మహిళలకు రూ.2500లు ఇయ్యరు. తులం బంగారం ఇయ్యరు.
మాట తప్పిన కాంగ్రెస్ ను ఇగ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మాట ఇచ్చి తప్పినందుకు ఆ పార్టీ సంగతి తేలుస్తాం. ఏం ఆశించి ఎన్నికలప్పుడు హామీలను అమలు చేస్తామన్నరు. వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తామని ఎందుకు బాండ్ పేపర్ రాసిచ్చారు? ఇప్పుడెందుకు చేతులెత్తేశారో కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ రాక్షసత్వం బయటపడింది. సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు చేతులెత్తేశారో సమాధానం చెప్పి తీరాల్సిందే. అప్పటిదాకా కాంగ్రెస్ ను వదిలిపెట్టబోం. రేపటి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తాం. ప్రజలతో కలిసి అడ్డుకుని తీరుతాం. ఏమైనా మాట్లాడితే కేంద్రం ఏమీ చేయలేదంటరు. ఇచ్చేదంతా కేంద్రమే. అభివృద్ధి జరుగుతున్నదంతా కేంద్ర నిధులతోనే. రోడ్ల కోసమే 1.2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. రైల్వేల కోసం 32 వేల కోట్లు ఖర్చు చేసినం. వడ్ల కొనుగోలు కోసం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసినం. 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లు ఇచ్చినం. కేంద్ర మంత్రులను కలిసి కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు బాగా సాయం చేస్తుందని పొగుడుతారు. బయటకు వచ్చినంక నయాపైసా ఇయ్యడం లేదని రెండు నాల్కల ధోరణితో మాట్లాడతారు.
కాంగ్రెస్ పార్టీ నేతలు ఎంతటి దుర్మార్గులంటే... చేసిన తప్పులన్నీ చేసేస్తారు. పాపాలన్నీ చేస్తారు....అవన్నీ బయటకొస్తున్నయని తెలిసే సరికి ఎదుటి వాళ్ల మీద రుద్ది బయటపడాలనుకుంటరు. నిన్న ఓ మంత్రి రాజీవ్ రహదారిని 6 లేన్ చేయాలని కేంద్రానికి లేఖ రాస్తడు. ఇదేం పద్దతి? అరే.. రాజీవ్ రహదారిని నిర్మించింది నాటి కాంగ్రెస్ పార్టీయే. ఆ కాంట్రాక్టర్ తో కలిసి కమీషన్లు కక్కుర్తి పడి రోడ్డును అడ్డదిడ్డంగా నిర్మించింది కాంగ్రెస్సే. భారీ ఎత్తున కమీషన్లు దండుకుంది కాంగ్రెస్సే.... అట్లాంటి పార్టీ నేతలు ఇయాళ ఏమంటున్నరు? రాజీవ్ రహదారిని 8 (ఎయిట్) లేన్ రోడ్డుగా మార్చండి... కేంద్రం పట్టించుకోవడం లేదని నిందలేస్తున్నరు. ఇంతకంటే సిగ్గు చేటు ఇంకొకటి ఉందా? 2036 దాకా ఆ కాంట్రాక్ట్ కొనసాగేలా ఒప్పందం చేసుకుందే కాంగ్రెస్ పార్టీ. అయినా సరే... తెలంగాణ ప్రజలపై మోదీ ప్రభుత్వానికి ఉన్న అభిమానంతో రాజీవ్ రహదారిని 6 లేన్ జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్రం సిద్ధమైంది. ఇప్పుడే కాదు. 2022లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి కూడా ఇదే మాట చెప్పింది. ఇదిగో ఆధారం(3.6.2022న కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వు కాపీని చూపిస్తూ....). "హైదరాబాద్ నుండి కరీంనగర్ మీదుగా మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారినికి 6 లేన్ జాతీయ రహదారిగా విస్తరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ కాంట్రాక్టర్ తో చేసుకున్న ఒప్పందం దృష్ట్యా ఆ సమస్యను పరిష్కరించుకోండి. ఆ కాంట్రాక్టర్ కు ఇవ్వాల్సిన డబ్బులను సెటిల్ చేసుకోండి. అవసరమైతే గ్రీన్ ఫీల్డ్ అలైన్ మెంట్ కింద లేదా జాతీయ రహదారిగానైనా విస్తరిస్తాం" అని చాలా స్పష్టంగా పేర్కొంది. ఆ కాపీలను కూడా మీకు పంపిస్తా... చెక్ చేసుకోండి.
ఇదే కాదు... తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికే 10 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసినం. రాబోయే 2 ఏళ్లలో రోడ్లు, మౌలిక సదుపాయాల కోసమే మరో 2 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైనం. కలిసి పనిచేసేందుకు మేమెప్పుడూ సిద్ధమే. ఇకనైనా కేంద్రంపై బురద చల్లడం మానుకొని ప్రజల బాధలను అర్థం చేసుకుని సమస్యను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టాలని సూచిస్తున్నా...

# కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి


)లోకి ప్రవేశించినప్పటి నుండి 12 రోజుల పాటు ఆచరిస్తారని, ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన పుష్కరాలు తెలంగాణ స్వరాష్ట్రంగా ఏర్పడిన తరువాత వచ్చాయని అన్నారు. 2025 మే 14న రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించే సమయంలో పుష్కరకాలం ప్రారంభమవుతాయని, అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని చెప్పారు. మరుసటి రోజు సూర్యోదయం నుంచి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల ప్రారంభించారు. సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు, యాత్రికులకు సంబంధించిన వివరాలు తెలిపేందుకు వాటిని ప్రా రంభించినట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. 'సరస్వతీ పుష్కరాలు' పండుగకు స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతం గా చేపట్టినట్టు ఇరువురు మంత్రులు తెలిపారు. కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్ లో ఉన్నాయని... అవి కూడా పుష్కరాలు ప్రారంభం అయ్యేలోగా అయిపోతాయని అధికారులకు మంత్రులు నివేదించారు. ఈ పుష్కరాలు విజయవంతం నిర్వహించేందుకు తమ ప్రభుత్వం చాలా క్రీయాశీలకంగా పని చేస్తుందన్నారు. సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కల్యాణం, భద్రాచలం కల్యాణం మాదిరి ఈ పుష్కరాలు కూడా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని తాము సంకల్పిస్తున్నట్టు చెప్పారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. చలువ పందిళ్లు, టెంట్‌లు, శాశ్వత మరుగుదొడ్ల ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు వివరించారు. కాళేశ్వరంకు సంబంధించిన వివరాలన్నీ ఆయా వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఆర్టీసీ బస్సులను అవసరానికి అనుగుణంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం చేకూరినట్టు మంత్రి కొండా తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నట్టు మంత్రి కొండా సురేఖ చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ సూచించారు. 'ఉత్తరాన ప్రయాగ వద్ద, దక్షిణ భారతంలో కేవలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో మాత్రమే సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుందని మంత్రి కొండా తెలిపారు. పవిత్ర సరస్వతీ పుష్కర స్నానం చేసిన వారికి సమస్త పాపములు తొలగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వాసిస్తారని ఆమె తెలిపారు.

పీఠాధిపతులో పవిత్ర పుష్కర స్నానం

సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామిలు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్ అండ్ బీ ప్రిన్స్ పల్ సెక్రటరీ వికాస్ రాజ్, సెర్ఫ్ సీఈఓ దివ్యా దేవరాజన్, ఎండోమెంట్ కమిషనర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఇతర శాఖల ఉన్నతాధికారులు, ఆలయ ఈఓ మహేశ్, ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కు సూటి మనిషి

విదేశాలకు పోతే.. లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఒకరిద్దరు బెదిరించినట్టు– మాట్లాడారు .. దానికి హార్ట్ అయ్యి ఉంటారన్నారు. హెలికాప్టర్ ప్రభుత్వం అద్దెకు తీసుకుందని.. మంత్రులు జిల్లాలు తిరిగితే... కార్ల కంటే హెలికాప్టర్ ఖర్చు తక్కువన్నారు. ఇప్పుడున్న హెలికాప్టర్ గత ప్రభుత్వం హయంలోనే అద్దెకు తీసుకున్నారని,వాళ్లు తిరగకుండా రెంట్ కట్టారని చెప్పారు... తాము వాడుతున్నట్లు– వెల్లడించారు. సీఎం ఆవేదనతో మాట్లాడటానికి గల కారణాన్ని మంత్రి శ్రీధర్ బాబు చెప్పుకొచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆలోచించి సీఎం మాట్లాడారు. చిన్నాభిన్నం చేసిన ఆర్థిక విధానం చూసి ఆవేదనతో మాట్లాడారు. నేను ఇచ్చిన మాట ప్రకారం అన్ని పనులు చేయాలి ... డబ్బులు లేవనే ఆవేదన సీఎంలో ఉంది. బీఆర్ఎస్ వాళ్లకు పేగు బంధం ఉంటే... జీతాలే సరిగా వేయలేదు. వాళ్లకు ప్రేమ ఉన్నట్టా..? మేం రాగానే డీఏ ఇచ్చాం. వాళ్ళలాగా మేము వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. కేటీఆర్.. ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణలో రాజకీయాలు ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులు, అందాల పోటీలపై మంత్రి శ్రీధర్ బాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చలకు దారితీస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని పేర్కొన్నారు. ఆయన విషయాలను ఉన్నది ఉన్నట్టుగా చెప్తారని, అందువల్ల ఆయనపై అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ ఆర్థిక తప్పిదాలను సరిచేస్తున్నామని సీఎం చెప్పడం, రాష్ట్రానికి అవసరమైన మార్పులు తీసుకురావడంలో ఆయన తీవ్రంగా కృషి చేస్తున్నారని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వంపై మంత్రి శ్రీధర్ బాబు విమర్శలు చేస్తూ, ఈ పార్టీకి పాలించే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఏ వ్యవస్థను కూడా హ్యాండిల్ చేయని బీజేపీకి పాలించే అర్హత ఎక్కడిదన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాల్సి వస్తుందని బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉద్యోగుల పదవి విరమణ వయస్సు పెంచారని గుర్తు చేశారు. మాకు ప్రభుత్వాన్ని నడిపే సత్తా ఉందో లేదో ప్రజలకి తెలుసని ఆయన అన్నారు. ఇది, ప్రభుత్వానికి ఉన్న బాధ్యతలను, ఉద్యోగుల సంక్షేమాన్ని గుర్తు చేస్తుందన్నారు. అందాల పోటీల గురించి మాట్లాడుతూ ఇవి అందానికి సంబంధించినవి కాదన్నారు. వ్యక్తిత్వానికి సంబంధించినవని మంత్రి చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరుతెచ్చే అందాల పోటీలను గౌరవంగా భావించడం, రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతను ప్రదర్శించడంలో సహాయపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కవిత మాట్లాడిన అంశాలపై కూడా మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, ఆమె బీఆర్ఎస్ స్ట్రాటజీ ప్రకారమే మాట్లాడుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలెప్పుడూ మాకు ప్రత్యర్థులేనని, కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం చేయడం లేదంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. దీంతోపాటు– స్మితా సబర్వాల్ పై మాకు ఎలాంటి కక్ష్య లేదన్నారు. మాకు అయినా, అధికారులకు అయినా కొన్ని నిబంధనలు ఉంటాయన్నారు. అందాల పోటీల ఖర్చుకు, ఉద్యోగస్థుల సమస్యకు ఏంటి సంబంధమని ప్రశ్నించారు. తెలంగాణ గురించి అనేక మందికి తెలియజేయాలనేదే సీఎం ఉద్దేశమని, ఈ క్రమంలో అందా పోటీల గురించి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీయించింది కేసీఆర్ అని.. దాని నుంచి బయట పడేసే పని మేము చేస్తున్నామని శ్రీధర్ బాబు అన్నారు. సెక్రటేరియట్ హోం ఐతే.. వాళ్ళు ఉండేది ఫార్మ్ హౌసా..? ఉద్యోగస్తులు మా



సోదరులు.. మా మిత్రులే. ఆలస్యం అయినా.. అన్ని సమస్యలు పరిష్కారం చేస్తాం. తెలంగాణ లోనే కాదు..దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. అయినా.. వనరులు పెంచి.. నిధులు తెచ్చే పనిలో ఉన్నాం. లక్ష కోట్లు తెచ్చి కాళేశ్వరంలోనే పెట్టారు కేసీఆర్. అప్పులు.. చెప్పకపోతే ప్రజలకు తెలియాలి కదా.మేము యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆలోచనతో ఉన్నామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మావోయిస్టుల ఎన్‌కౌంటర్లపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. మావోయిస్టులతో మా కుటుంబానికి అన్యాయం జరిగింది. కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దనేది మా ఆలోచన. శాంతి చర్చలు కోరడం తప్పు కాదు. మా ప్రభుత్వమే గతంలో మావోయిస్టుల తో చర్చ చేసిందని గుర్తు చేశారు.

# సీఎస్ రామకృష్ణరావుకి మంత్రి సురేఖ అభినందనలు

- రాష్ట్ర పురోగతికి మీ అపార అనుభవం అవసరమని వ్యాఖ్య




**హైదరాబాద్ వెలుతురు మే 06:**
తెలంగాణ నూతన సీఎస్ గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ రామకృష్ణరావుకి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. ఆయన సీఎస్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను సెక్రటేరియట్ లోని ఆమె ఛాంబర్ లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయన్ను సన్మానించి... సురేఖ, సీఎస్ రామకృష్ణరావుకి కంగ్రాట్స్ తెలిపారు. అనంతరం మినిస్టర్ సురేఖ మాట్లాడుతూ... రాష్ట్ర పరిపాలన విభాగంలో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సీఎస్ రామకృష్ణరావుకి ఉన్న అపార అనుభవం ప్రస్తుతం రాష్ట్ర పురోగతి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాలు ముందుకు వెళుతాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. త్వరలో తమ ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం సరస్వతీ నది పుష్కరాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణరావు కృషి చేయాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకి రామకృష్ణరావు ధన్యవాదాలు తెలిపారు.

# నగరంలో మరోమారు హైడ్రా దాడులు

- గచ్చిబౌలీ సంధ్యాకన్వెన్షన్‌లో కూల్చివేతలు
- మైలార్‌దేవ్ పల్లిలోనూ ఆక్రమణల తొలగింపు



**హైదరాబాద్,మే6( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో హైడ్రా మరోసారి భారీగా కూల్చివేతలను చేపట్టింది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకొని మినీ హాల్, ఫుడ్ కోర్ట్‌తో పాటు– అనేక అనుమతులు లేని నిర్మాణాలను తొలగించారు. ఉదయం నుంచే మూడు భారీ బుల్డోజర్ల సహాయంతో కూల్చివేతల ప్రక్రియ ప్రారంభమైంది. పోలీసులు ఘటనా స్థలంలో బందోబస్తును ఏర్పాటు చేసి, ఎవరికీ లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. ఈ కూల్చివేతలు ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ– లేఅవుట్ పరిధిలో నిర్వహించబడ్డాయి. సంబంధిత లేఅవుట్‌కు ప్రభుత్వ అనుమతులు లేకుండానే రోడ్లు, పార్కులు వంటి ఉమ్మడి భూములపై ఆక్రమణలు జరిగాయని తెలుస్తోంది. రోడ్లను ఆక్రమించి నిర్మించిన గదులు, రెస్టారెంట్లు–, ఫుడ్ కోర్టులు వంటి కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా పలువురు ప్లాట్ యజమానులు తమ స్థలాలు కనబడకుండా అక్రమ నిర్మాణాలు చేసినట్టు– ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నిర్మించిన వంటగదులు, రెస్ట్‌రూములు, మినీ హాల్ వంటి నిర్మాణాలన్నీ హైడ్రా అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. అంతే కాకుండా, జీ ప్లస్ 2 అంతస్థుల్లో నిర్మించిన మూడు ఐరన్ షెడ్లు కూడా తొలగించబడ్డాయి. అదనంగా లేఅవుట్‌ను ఆక్రమించి వేసిన రేకుల ఫెన్సింగ్‌ను కూడా అధికారులు తొలగించారు. నగర శ్రేయస్సు కోసం, భవిష్యత్తులో ఇటువంటి అక్రమ నిర్మాణాలకు తావు లేకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటు–న్నట్లు– అధికారులు పేర్కొన్నారు. శాసనానుగుణంగా మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే రాజేంద్రనగర్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లిలో కూడా కూల్చివేతలు చేపట్టింది . స్థానిక ఇందిరా గాంధీ సొసైటీలో ఆక్రమణలను తొలగించారు హైడ్రా అధికారులు. రోడ్డును ఆక్రమించి ప్రహరీగోడ నిర్మించటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని హైడ్రకు ఫిర్యాదు చేశారు స్థానికులు. స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు అధికారులు. ఈ క్రమంలో హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు.ప్రహరీగోడ నిర్మించిన స్థలం తమదే అంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు ఆక్రమణదారులు. దీంతో ఘటనాస్థలం దగ్గర ఉద్రిక్తత నెలకొంది.

## ప్రభుత్వ ఆసుపత్రులలో అందించే వైద్య సేవలపై

# ప్రజలకు భరోసా కల్పించాలి

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలను బలోపేతం చేయాలి
- రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి, ఐపీ, సర్జరీలను పెంచడమే లక్ష్యంగా దశలవారీగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలి .
- వైద్య సేవల రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలో మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి
- ఉన్నత స్థాయి సమీక్ష లో మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్యశాఖ అధికారులకు దిశా నిర్దేశం



**హైదరాబాద్ వెలుతురు మే 06:**
ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం, విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యం తో ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐరాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ గారి అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష లో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ పై శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా పవర్ పాయింట్ ద్వారా చేపట్టే అంశాలను వివరించారు. రాష్ట్రంలోని 202 ప్రభుత్వ ఆసుపత్రులలో (31 GGHs, 9 స్పెషాలిటీ ఆసుపత్రులు (హైద్రాబాద్), వరంగల్ లోని 4 ఆసుపత్రులు ), తెలంగాణ వైద్య విధాన పరిషత్ లోనీ 100 పడకల పైన ఉన్న ఆస్పత్రుల (40) ను దశలవారీగా బ్రాండింగ్ చేయాలని మంత్రి వైద్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి, ఐపీ, సర్జరీలను పెంచడంతోపాటు, సామాన్యులకు ప్రభుత్వ ఆసుపత్రులలో నాణ్యమైన , మెరుగైన వైద్య సేవలు అందిస్తారని భరోసా కల్పించడమే లక్ష్యం గా ఈ బ్రాండింగ్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజల అవసరాలకు అనుగుణంగా బెడ్ ల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, ఎక్విప్మెంట్ (CT, MRI) లను సమకూర్చడం, బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న బ్రాండింగ్ కార్యక్రమంలో భాగంగా NMC నిబంధనలకు అనుగుణంగా ఫైర్ సేఫ్టీ , ఎలక్ట్రికల్ సేఫ్టీ, డ్యూటీ రూమ్, సీసీటీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీ అవుట్ పోస్టుల ఏర్పాటు, రెడ్ అలారం సిస్టం లను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పనలో భాగంగా IP , OP విభాగాలకు వచ్చే పేషెంట్లకు టాయిలెట్ బ్లాక్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఆస్పత్రిలో స్ట్రక్చరల్ రిపేర్లు, వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేక కౌంటర్లు, సైనేజ్ బోర్డులు, అంతర్గత రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో క్యాంటీన్, మంచినీటి సౌకర్యం, పేషంటు వెంట వచ్చే అటెండర్ల సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు . ఆసుపత్రులలో ప్రత్యేకంగా రిసెప్షన్ను, కామన్ ఏరియా, బయో మెడికల్ వేస్టేజీ , ల్యాండ్ స్కేపింగ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో పరిపాలన విభాగాన్ని ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రుల కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల ను తీర్చిదిద్దాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు ను పరిశీలించి వచ్చిన వైద్యశాఖ అధికారులు ఆయా రాష్ట్రాలలో ఆసుపత్రుల పనితీరు నివేదికను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి వివరించారు. తెలంగాణలో వైద్య సేవలు దేశంలో వివిధ రాష్ట్రాల కు ఆదర్శంగా నిలిచేలా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఎక్విప్మెంట్ లను ఆసుపత్రులకు సమకూర్చి వైద్య సేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి అమలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు వెల్లడించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, TGMSIDC MD ఫణీంద్ర రెడ్డి, DME డా. నరేంద్ర కుమార్, TVVP కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, Spl Officer DME డా. విమల థామస్, Tgmsidc CE దేవేందర్ లు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ అభివృద్ధి గాలి బుడగ

- అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి చేశారు
- నాటి ఆర్టీసీ సమ్మెతో ఎంతమంది చనిపోయారు
- కెసిఆర్ నిర్వాకం వల్ల నెలకు 6వేల కోట్లు వడ్డీ కడుతున్నాం
- కెటిఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా తిప్పికొట్టిన సీతక్క, చామల



**హైదరాబాద్,మే 6( వెలుతురు):**
గత ప్రభుత్వం కొన్ని వర్గాలకే కొమ్ముకాసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని మంత్రి సీతక్క విమర్శించారు. కేసీఆర్ అప్పు.. తెలంగాణ భవిష్యత్తుకు ముప్పుగా దాపురించిందన్నారు. కేసీఆర్ నిర్వాకం వల్ల నెలకు 6 వేల కోట్ల ప్రజాధనాన్ని అప్పుల చెల్లింపుల కోసం మళ్లించాల్సి వస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క , ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వీరు మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై అనవసర వ్యాఖ్యలతో కేటీఆర్ తన అసహనాన్ని ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. సత్తా ఉన్న నాయకుడు కేసీఆర్ అయితే.. పత్తా లేకుండా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. సత్తా ఉంటే అసెంబ్లీకి వచ్చి సత్తా నిరూపించుకోవాలని హితవుపలికారు. ఉద్యోగుల పోరాటాన్ని వాడుకున్న చరిత్ర బీఆర్ఎస్‌దని అంటూ మండిపడ్డారు. 40 మంది ఆర్టీసీ కార్మికుల ఉసురు తీసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నాయకుల ఇంటి తలుపులు పగుల గొట్టింది ఎవరు కేటీఆర్ అని నిలదీశారు. ఎందరో ఉద్యమకారులను అవమానపరిచి బయటకు పంపిన చరిత్ర గులాబీ పార్టీదని మండిపడ్డారు. అప్పులు, అమ్మకాలు తప్ప బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఒక గాలి బుడగ అని ఎన్నికల్లో ప్రజలే తేల్చారన్నారు. బీఆర్ఎస్ అప్పుల మూలంగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. అయినా ఎక్కడా సంక్షేమానికి లోటు లేకుండా చూస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కేటీఆర్‌కు మైండ్ దొబ్బిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కూడా మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి సీఎం మాట్లాడారని.. కేటీఆర్‌కు మెడ, కాళ్ల నొప్పులు దెబ్బకే పోయాయంటూ ఎద్దేవా చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. సమ్మె చేయొద్దు.. రాష్ట్రం బాగు చేసుకుందాం అని సీఎం చెప్పారని.. గతం లో 52 రోజులు సమ్మె చేస్తే.. కేసీఆర్ ఒక్క రోజు బయటికి రాలేదని గుర్తు చేశారు. సమ్మె చేస్తున్న వారిని నానా బూతులు ఆ నాడు తిట్టిండని తెలిపారు. రేవంత్ లా సౌమ్యంగా ఎప్పుడు చెప్పలేదన్నారు. ఆ రోజుల్లో సమ్మె చేస్తే ఉద్యోగ సంఘాల్లో శ్రీనివాస్ గౌడ్‌ను ఎమ్మెల్యే చేశారన్నారు. ఉద్యోగ సంఘం నేతలను మాట్లాడకుండా చేశారని మండిపడ్డారు. మిగులు రాష్ట్రాన్ని ఇస్తే 8 లక్షల కోట్ల అప్పులు చేశారన్నారు. వాస్తవ పరిస్థితులు చెప్పే ప్రయత్నం సీఎం చేశారని చెప్పుకొచ్చారు. ఎన్నడూ కేటీఆర్ ఊరికే లేరని.. ప్రతీరోజు తప్పుడు ప్రచారమే చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో బిల్లులు రావడం లేదని.. అవన్నీ ఆ నాడు కేసీఆర్ పెట్టి పోయారన్నారు. మిగులు రాష్ట్రం ఇస్తే అప్పుల రాష్ట్రం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దోచుకున్నదే కాకుండా.. మళ్ళీ వచ్చే వాళ్లు పరిపాలన చేయకుండా చేశారన్నారు. 'తెలంగాణ ప్రజలకు లెక్కలు తెలీవని అనుకుంటు–న్నావా కేటీ–ఆర్... మీ హయాంలో ఒకటో తారీకు జీతాలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా. లక్ష 50 వేల కోట్లు– అప్పు కట్టాము. మిస్ వరల్డ్‌కు ఖర్చు రూ.250 కోట్లు– కాదు.. రూ.27 కోట్లే. కేటీ–ఆర్.. దోపిడీలో భాగస్వామి. తప్పుడు లెక్కలు చెప్పడం భావ్యం కాదు. మీరు దోచుకున్నంత దేశంలో ఎవరూ దోచుకోలేదు. కేటీ–ఆర్‌కు సిగ్గు శరం లేదు. కాళేశ్వరంలో ఓ అధికారి జైలుకి వెళ్ళాడు. మీరు చెప్తేనే కరెక్ట్ అనేది దుర్మార్గపు ఆలోచన. నీ పగటి కలలు నెరవేరవు. రేపటికి రేపు సీఎం కుర్చీలో కేటీఆర్ కూర్చోలేడు' అంటూ వ్యాఖ్యలు చేశారు. దళితులకు మూడు ఎకరాలు ఎందుకు ఇవ్వలేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగో లేకున్నా సీఎం 21 వేల కోట్ల రుణమాఫీ చేసిండు. రుణమాఫీ చేసినందుకు రాహుల్ క్షమాపణ చెప్పాలా. మేనిఫెస్టో గురించి మాట్లాడే హక్కు కేటీఆర్‌కు లేదు. ఆర్టీసీ సమ్మె 52 రోజులు జరిగితే ఎందుకు మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఇల్లు వద్ద పార్కింగ్ లేక ఇబ్బంది పడుతున్నారు. కేటీఆర్ చెప్పిన 2000 ఎకరాలు తీసుకురావాలి. ఆ 2000 ఎకరాలు బయటపెట్టాలి. పిట్ట కథలు చెబుతుండు. చెల్లెను బయటకు పంపాలి.. బావను పడుకోబెట్టాలి అని చూస్తుండు. సీఎం ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తుండు. కేసీఆర్ చెప్పిందే చెప్పి వన్ మ్యాన్ షో చేసిండు. దెబ్బ తాకి మెదడు దొబ్బిన కేటీఆర్ మాటలు నమ్మొద్దని ఎంపీ చామల కిరణ్ స్పష్టం చేశారు.

# రేవంత్ రెడ్డివి దివాళాకోరు రాజకీయం

- సిఎం అనుభవ రాహిత్యం బయటపడుతోంది
- కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్,మే6( వెలుతురు):**
తెలంగాణ రాజకీయ వేడి మరోసారి పెరిగింది. సిఎం రేవంత్ వ్యాఖ్యలపై దుమారం రేగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యక్తిగత దూషణలు, విమర్శలు వచ్చినా సహించామని, కానీ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తట్టుకోలేక ఈ ప్రెస్‌మీట్ ఏర్పాటు– చేయాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సాధనలో విద్యార్థులు, ఉద్యోగ సంఘాల నాయకులు పార్టీలకతీతంగా పాల్గొన్నా వాస్తవాన్ని గుర్తుచేస్తూ, అలాంటి నేతలపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు ఆయన పాలనాపరమైన అనుభవ లేకపోయినదాని సూచనగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రజలను మోసం చేసే అబద్ధాలుగా తేలిపోయాయని, తాము ఎప్పటి నుంచో ఢిల్లీ పార్టీలను నమ్మరాదని చెబుతున్నామని, రేవంత్ రెడ్డి మాటలు దివాలా కోరి వానిలా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ అధికారం ఉన్నప్పటికీ, పలు హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేటీ–ఆర్ ప్రకారం, ఉద్యమ సమయంలో ఉద్యోగ సంఘాలు, ముఖ్యంగా కవిక్షలు కీలకంగా కదం తొక్కాయి. వారి పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని



తెలిపారు. రాష్ట్రం ఏర్పడ్డ వెంటనే ఉద్యమ నేతలకు గౌరవంగా ఉన్నత జీతాలు కల్పించామన్నారు. రేవంత్ రెడ్డి ఉద్యమంలో భాగం కాలేదని, ఉద్యమ ద్రోహిగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అప్పు మొత్తం 4.15 లక్షల కోట్లకే పరిమితమని, ప్రభుత్వం నుండి విరమించిన సమయంలో ఆదాయం నెలకు 18 వేల కోట్లు– ఉందని వివరించారు. ఇప్పుడూ అదే ఆదాయం వస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించలేకపోతోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు శ్వేతపత్రాలు విడుదల చేస్తూ అప్పు లెక్కల్ని గందరగోళంగా మార్చుతున్నారని, ఒకసారి 6 లక్షల కోట్లు–, తర్వాత 8.29 లక్షల కోట్లు– అన్నారు అంటూ లెక్కల్లో అస్పష్టత ఉన్నదని చెప్పారు. రైతుబంధు, విద్యుత్ సరఫరా, నీటి కొరత వంటి అంశాల్లో కేసీఆర్ హయాంలో స్థిరత ఉందని, ఇప్పుడు అన్ని రంగాల్లో సంక్షోభం నెలకొంది. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేశారని విమర్శలు గుప్పించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు వారినే ప్రజల ముందుకు విలన్లుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని కేటీ–ఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టిన కేసీఆర్ పాలన తరువాత ఇప్పుడు విపరీత పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజలు ఈ పరిస్థితిని గమనిస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.


# సంపాదకీయం..

## అష్టదిగ్బంధనతో పాక్ ఉక్కిరిబిక్కిరి !

యుద్దమంటే నేరుగా పోరాటమొక్కటే కాదు...శతృవును అష్టదిగ్బంధనం చేసి కదలకుండా చేయడం కూడా యుద్ధంలో ఓ భాగమే. పాక్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. అది నిద్రలేని రాత్రులు గడుపుతోంది. ప్రపంచ దేశాలు నమ్మలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నిజంగానే యుద్ధం జరిగితే దాని పక్కన నిలబడానికి ఒక్కదేశం కూడా రాకపోవచ్చు. ఇప్పటికే అనేక రకాలుగా భారత్ పాక్‌ను ముప్పుతిప్పలు పెడుతోంది. పహల్గామ్ దాడి జరిగి పక్షం రోజులు పూర్తయ్యాయి. ఇంకా ఎప్పుడు దాడి చేస్తారని కొందరు అధికారంలో ఉన్న బిజెపిని నిలదీసే ప్రయత్నంలో ఉన్నారు. ఇలాంటి వారు యుద్ధతంత్రం గురించి తెలుసుకుంటే మంచిది. సామ,భేద, దాన, దండోపాయాలు అన్నవి యుద్ధంలో బాగా వాడే పదాలు. మొదటి మూడు విఫలమైన తరవాతనే నాలుగోది అయిన దండోపాయం చేపట్టాలి. రావణుడు యుద్దానికి సై అన్న తరుణం లోనూ అతడి పట్టపుమహిషి మండోదరి అడ్డుపడి సామ,భేద,దాన,దండోపాయల గురించి వివరిస్తుంది. రాముడిని మచ్చిక చేసుకుని బతిమాలి, బామాలి, క్షమించమని వేడుకొమ్మని అంటుంది. చేసిన తప్పును సరిదిద్దుకోమని హెచ్చరిస్తుంది. కానీ రావణుడు ఇవన్నీ మరచి యుద్ధంచేసి పారజితుడు అయ్యాడు. పాక్ కూడా ఉగ్రవాదం ఎగదోసే ప్రయత్నం నుంచి బయటపడి, తన ఉనికిని గుర్తించాలి. భారత్ నుంచి విడిద్ద ముక్కనని గుర్తించాలి. అలా జ్ఞానోదయం కావాలి. అప్పుడే పాక్ ప్రపంచదేశాల్లో మనగలుగుతుంది. కానీ అలా చేయలేక ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ తమదేశ ప్రజలను మభ్య పెడుతూ వస్తోంది. ఇప్పుడు పాపం పండింది. ఇంతకాలం ఒక లెక్క..ఇప్పుడో లెక్క. పహల్గామ్ దాడి తరవాత ఇప్పుడు భారత్ విసిరిన ఉచ్చులో పడి గిలగిల కొట్టుకుంటోంది. మోడీ కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సాగుతున్నారు. ఇప్పటికే పాక్ యుద్ధభయంతో సైన్యాన్ని మోహరించింది. ఉగ్రవాద శిబిరాలను ఖాళీ చేయించింది. గగనతలంపై ఆంక్షలు విధిచడంతో పాక్ ముప్పు తిప్పలు పడుతోంది. అసలే పాక్ ఆర్థిక వ్యవస్థ అంతంతమాత్రంగా సాగుతున్న వేళ..పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడంతో నానా ఇక్కట్లు పడుతోంది. మరోవైపు సింధుజలాల రాకను అడ్డుకుంది. దీంతో నీటి కోసం తపిస్తున్నారు. అలాగే పివోకెపై దాడి చేస్తారన్న భయంతో అక్కడ బలగాలను మోహరించారు. ఇకపోతే ఐక్యరాజ్యసమితలో కూడా తాజాగా పాక్‌కు చుక్కెదురయ్యింది. అంతర్జాతీయంగా కూడా భారత్ బలమైన మద్దతును కూడా గట్టింది. ఇవన్నీ కూడా పాక్‌ను దెబ్బతీస్తున్న ఘటనలుగానే చూడాలి. యుద్ధంలో ఇదొక భాగంగా చూడాలి. ఇలా చేయడం వల్ల అసలు యుద్ధంలో పాక్ అడుగు వేయలేని దుస్థితికి చేరుకుంది. పహల్గాంలో ఉగ్రదాడి ప్రతి భారతీయుని హృదయాన్ని తీవ్రంగా గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందినవారైనా,ఏ భాష మాట్లాడేవారైనా ఆ ఉగ్రదాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు. ప్రతి భారతీయుని రక్తం మరిగిపోతోంది. పాక్‌ను తుదముట్టించా లని ప్రతి ఒక్క భారతీయముడు కోరుకుంటున్నాడు. నిజానికి 370 ఆర్టికల్ రద్దు తరవాత కశ్మీర్‌లో మళ్లీ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. పాఠశాలలు, కళాశాలలు కళకళలాడుతున్నాయి. విద్యావాతావరణం మళ్లీ చిగురించింది. నిర్మాణ రంగ కార్యకలాపాలు, అభివృద్ధి కార్యకలాపలు గతంలో ఎప్పుడూ లేని విధంగా వేగం పుంజుకున్నాయి. ప్రజాస్వామ్యం అక్కడ వికిసిస్తోంది. యువత స్వయం ఉపాధితో మళ్లీ శక్తిమంత మవుతోంది. పర్యాటకులు వెల్లువెత్తుతున్నారు. ప్రజల ఆదాయాలు గణనీయంగా పెరుగు తున్నాయి. యువత ఉపాధికి కొత్త అవకాశాలను సృష్టించడం జరుగుతోంది. అయితే పహల్గామ్ ఉగ్రవాద దాడితో పర్యాటకుల వెల్లువ నిలిచిపోయింది. సామాన్య కశ్మీరీల ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లింది. పహల్గాంలో ఉగ్రవాద దాడి చోటుచేసుకున్న వెనువెంటనే ఆసేతు హిమాచలం అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. మోదీ ప్రభుత్వం ఎటువంటి చర్య చేపట్టినా తాము సంపూర్ణంగా మద్దతునిస్తామని రాజకీయ పక్షాలు స్పష్టంగా ప్రకటించాయి. ఉగ్రదాడి ఘటన జరిగినప్పుడు సౌదీ అరేబియాలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అధికారిక పర్యటనను మధ్యలోనే ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చారు. ఉగ్రదాడికి ఇంతకింత మూల్యం చెల్లించుకోక తప్పదని పాక్‌ను కఠినంగా హెచ్చరించారు. ఈ క్రమంలో తీసుకున్న చర్యల వల్లనే ఇప్పుడు పాక్ ఏకాకి అయ్యింది. దానికి ఇప్పుడు చైనా కూడా బహిరంగంగా మద్దతు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది. అందుకే పహల్గాం ఘటనపై తక్షణమే ప్రతీకార చర్యలు చేపట్టాలనే డిమాండ్లు దేశవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. మెరుపుదాడులకు పాల్పడే విమానాలను పాక్ సైనిక దళాలు ముందుగానే పసిగట్టి అడ్డుకుంటాయని సైనిక నిపుణులు గట్టిగానే చెబుతున్నారు. అటువంటి దాడుల ఫలితాలు ఆశించినవిగా ఉండకపోవచ్చని కూడా నిపుణులు అంటున్నారు. భారత్ సైనిక పాటవ ఆధిక్యత దృష్ట్యా సర్జికల్ స్ట్రయిక్స్ కన్నా ఇతరత్రా ప్రత్యామ్నాయాలు ఉన్నాయని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈసారి దెబ్బకొడితే మళ్లీ పాక్ కోలుకోకుండా చేయాల్సి ఉంది. ఎందుకంటే గతంలో నెహ్రూ, ఇందిరల హయాంలో చేసిన తప్పుల వల్ల పివోకె అలాగే ఉండిపోయింది. పాక్ జుట్టు మన చేతిలో చిక్కినా వదిలి పెట్టాం. ఇలాంటి అనుభవాలన్నీ ఇప్పుడు మోడీ ప్రభుత్వం తప్పకుండా గణిస్తోంది. అందుకే సామ,భేద, దాన, దండోపాయాలపై కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. అమెరికా, రష్యాలు సైతం మద్దతుగా ఉన్నాయి. గల్ఫ్ దేశాలు కూడా పాక్‌ను నమ్మేస్థితిలో లేవు. పహల్గాం దాడులకు ప్రతీకారంగా ఎప్పుడు ఎలా ఎలాంటి చర్య తీసుకోవాలనే విషయమై సైనిక దళాలకు ప్రధానమంత్రి సంపూర్ణ స్వేచ్ఛనిచ్చినట్టు ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతీయ భద్రతపై అత్యున్నత నిర్ణయాలు తీసుకునేది ప్రధానమంత్రి మాత్రమే. ఆ నిర్ణయాలను అమలుపరిచేది సైనిక దళాలు. పహల్గాంపై భారత్ ప్రతిస్పందన.. కశ్మీర్‌లో అల్లకల్లోలం సృష్టిస్తున్న శత్రు వర్గాలను అణచి వేయడం వంటివన్నీ ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనకా యుద్ధ తంత్రం దాగివుంది. అందుకే ప్రతి చర్యా పాక్‌ను కట్టడి చేసేలా ఉంటున్నాయి. భయంతో చస్తున్న పాక్ నేతలు అనవసర ప్రేలాపనలు పేలుతున్నారు. ఇదంతా అక్కడి ప్రజలకు కూడా తెలుసు. అందుకే అక్కడి పాలకులపై వ్యతిరేకత వస్తోంది తప్ప..భారత్‌పై పాక్ ప్రజల్ల ద్వేషం కానరావడం లేదు. ఉగ్రవాదాన్ని ఎగదోసే విధానం సరికాదని, పాక్ ప్రశాంతంగా ఉండాలి వారుకోరుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలు యుద్ధనీతిలో భాగంగా అనుసరిస్తున్నవిగా గుర్తించాలి. అలాగే మరిన్ని కఠిన చర్యలకు కూడా భారత్ సిద్దంగానే ఉందని కూడా గుర్తించాలి.

# ప్రపంచ మానవతావాదం పట్ల ఠాగూర్ విశ్వదృష్టి

*రవీంద్రనాథ్ ఠాగూర్ భారతదేశం గర్వించదగిన కవి, తత్వవేత్త, సంగీతకారుడు, విద్యావేత్త. 1913లో నోబెల్ బహుమతి పొందిన తొలి ఆసియా రచయితగా ఆయన నిలిచారు. ఆయన రచనలు ప్రేమ, స్వేచ్ఛ, మానవతా విలువలు, ప్రకృతి, మరియు ఆధ్యాత్మికతపై దృష్టి సారించాయి. ఠాగూర్ ప్రసిద్ధి పొందిన "చిత్తం యథా భయశూన్యం" అనే కవితలో, భయరహిత మనస్సు, స్వేచ్ఛా జ్ఞానం, మరియు విభజనలేని ప్రపంచం కోసం ఆయన ఆకాంక్షను వ్యక్తీకరించారు. ఈ కవిత భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది.*



ఆయన ప్రసిద్ధ సూక్తులు:
"ప్రేమ అనేది కేవలం భావోద్వేగం కాదుబీ అది సృష్టిలోని అంతిమ సత్యం." "సూర్యుడు మాయమైపోయినందుకు మీరు ఏడుస్తే, మీ కన్నీళ్లు నక్షత్రాలను చూడకుండా చేస్తాయి." "మీరు నీటిని చూస్తూ కూర్చొని ఉంటే, సముద్రాన్ని దాటి వెళ్లలేరు." ఠాగూర్ విద్యలో నూతనతను ప్రోత్సహించారు. విశ్వభారతివిశ్వవిద్యాలయాన్ని స్థాపించి, విద్యార్థులకు స్వేచ్ఛ, సృజనాత్మకత, మరియు ప్రకృతితో అనుబంధం కలిగిన విద్యను అందించారు. ఆయన "ఏకలా చలో రే" అనే పాట ద్వారా, ఒంటరిగా అయినా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందేశం వ్యక్తిగత మరియు సామాజిక మార్పులకు ప్రేరణగా నిలుస్తుంది. ఠాగూర్ సందేశం మానవతా విలువలు, ప్రేమ, మరియు స్వేచ్ఛపై ఆధారపడింది. ఆయన రచనలు మరియు ఆలోచనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ప్రేరేపిస్తున్నాయి. ఇకరవీంద్రనాథ్ ఠాగూర్.1861 మే 7న బెంగాల్ లోని కోల్కతా నగరంలో, కల్చరల్‌గా గొప్పగా పేరుగాంచిన ఠాగూర్ కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూర్ బ్రహ్మో సమాజ నాయకుడు కాగా, కుటుంబం మొత్తంగా సాహిత్యం, కళలు,సంగీతంవంటిరంగాలలోగొప్పపేరుసంపాదించింది.రవీంద్రనాథ్ చిన్ననాటి నుండే కళల పట్ల, సాహిత్యం పట్ల ఆకర్షణ కలిగి ఉండేవారు. సాంప్రదాయ విద్యా వ్యవస్థకు భిన్నంగా ఆయన వ్యక్తిగతంగా నేర్చుకుంటూ రచనల ప్రపంచంలోకి అడుగుపెట్టారు.ఠాగూర్ కేవలం కవిగా కాదు, నవలా రచయితగా, గేయ రచయితగా, నాటకకర్తగా కూడా ప్రసిద్ధి చెందారు. ఆయన రచించిన "గీతాంజలి" (Gitanjali) అనే కవితా సంపుటికి 1913లో నోబెల్ బహుమతి లభించింది. ఇది ఒక భారతీయుడు గెలుచుకున్న తొలి నోబెల్ బహుమతి.
"గీతాంజలి"లోని భావోద్వేగాలు, భక్తి, జీవన పరమార్థం వంటి అంశాలు ప్రపంచానికి భారతీయ ఆధ్యాత్మికతను పరిచయం చేశాయి.ఠాగూర్ నేరుగా రాజకీయనేతగా వ్యవహరించకపోయినా, స్వాతంత్ర ఉద్యమాన్ని సాంకేతికంగా, సాంస్కృతికంగా ప్రోత్సహించారు. ఆయనకు మహాత్మా గాంధీజీతో స్నేహబంధం ఉండేది. గాంధీని "మహాత్మా" అని మొదటగా పిలిచినవాడిగా ఠాగూర్ ప్రసిద్ధి పొందారు.ఠాగూర్ జాతీయతను విస్తృతంగా భావించారు. ఆయన భావంలో జాతీయత అనేది కేవలం భూభాగం మీద ఆధారపడింది కాదు. అది మానవీయత, నైతికత, సంస్కృతికి బంధించబడింది. బెంగాల్‌ను హిందూ-ముస్లిం ఆధారంగా విడగొట్టే బ్రిటీష్ నిర్ణయానికి ఠాగూర్ తీవ్రంగా వ్యతిరేకించారు. "రక్త-యాత్రలు", "రాఖీ బంధన్" వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఐక్యత పెంచే ప్రయత్నం చేశారు. హిందూ, ముస్లింలు కలిసి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.1919లో జలియన్ వాలాబాగ్ హత్యాకాండ అనంతరం ఠాగూర్ బ్రిటీష్ రాజు ఇచ్చిన "నైట్" బిరుదును తిరస్కరించారు. ఇది దేశవ్యాప్తంగా బ్రిటీష్ పాలనపై వ్యతిరేకతకు చిహ్నంగా నిలిచింది. ఆయన తన నిరసనను ఒక పత్రంగా రాజుకు పంపారు, అది బ్రిటీష్ పాలనను ప్రశ్నించే బలమైన సంచలనం సృష్టించింది. ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్ విశ్వభారతి విశ్వవిద్యాలయం (Visva-Bharati University) ఒక స్వతంత్ర విద్యా భావనకు ప్రతీక. ఇక్కడ విద్యార్థుల భావాన్ని, ఆలోచనను, సృజనాత్మకతను ప్రోత్సహించే విధంగా విద్యా పద్ధతులు రూపుదిద్దుకున్నాయి. ఇది భవిష్యత్‌లో స్వాతంత్ర భావనకు ఒక బీజం వేసింది.ఠాగూర్ రచనలు ప్రజల్లో జాతీయత, గౌరవం, స్వేచ్ఛ పట్ల అవగాహన పెంచాయి. ఆయన రచనలు భారతీయులకు స్ఫూర్తినిచ్చే సాధనంగా మారాయి. "జనగణమన" అనే గీతం భారత జాతీయ గీతంగా గుర్తింపు పొందింది. ఇది దేశాన్ని ఒకతాటిపై నిలబెట్టేభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఠాగూర్, గాంధీ ఇద్దరూ భావాల పరంగా భిన్నమైనా, పరస్పర గౌరవాన్ని కలిగి ఉండేవారు. ఇద్దరూ బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా పనిచేశారు. ఠాగూర్ గాంధీని ఆదరిస్తూ ఆయన ఆచరణకు మానవీయతను జోడించారు.
ఠాగూర్ గాంధీజీకి "మహాత్మా" అని పేరు పెట్టారు. అదే సమయంలో ఆయన స్వతంత్ర ఉద్యమంలో హింస లేకుండా మార్గాన్ని ప్రాధాన్యతనిచ్చారు.ఠాగూర్ మతసామరస్యాన్ని విశ్వసించేవారు. ఆయన రచనలలో మతం వల్ల కలిగే చీలికను విమర్శించారు. "గోరా", "ఘరే బైరే" వంటి నవలల్లో మత, సామాజిక సమస్యలను అధ్యయనాత్మకంగా ఆవిష్కరించారు.ఠాగూర్ ప్రపంచానికి భారతీయ తాత్వికతను పరిచయం చేశారు. జపాన్, అమెరికా, చైనా, యూరప్ దేశాలలో ఆయన ఉపన్యాసాలు, రచనలు ప్రజాదరణ పొందాయి. ఆయనే తొలి భారతీయుడు గౌరవప్రదమైన అంతర్జాతీయ వేదికలపై భారత స్వతంత్రతపై మాట్లాడినవారు.
రవీంద్రనాథ్ ఠాగూర్ 1941 ఆగస్టు 7న కన్నుమూశారు. కాని ఆయన భావజాలం, రచనలు భారతదేశానికి స్ఫూర్తిగా నిలిచాయి. భారత స్వాతంత్ర ఉద్యమంలో ఆయన పాత్ర ప్రత్యక్షంగా కాకపోయినా, ప్రజల మనసుల్లో దేశభక్తిని బలపరిచే విధంగా సాగింది.
రవీంద్రనాథ్ ఠాగూర్ జీవితాన్ని పరిశీలించినపుడు, ఆయన స్వాతంత్ర్య యోధుడు కాదు అనే అభిప్రాయం తలెత్తవచ్చు. కానీ ఆయన భావాలద్వారా, రచనల ద్వారా, విద్యా సంస్కరణల ద్వారా ఆయన భారత స్వాతంత్ర ఉద్యమానికి అందించిన మద్దతు అపూర్వమైనది. ఠాగూర్ దేశాన్ని ప్రేమించడమే కాదు, ప్రపంచ మానవాళిని సోదరులుగా చూడాలని నమ్మారు. శాంతి, స్నేహం, అంతర్జాతీయ సమగ్రత కోసం ఆయన పాటల ద్వారా సందేశాలు పంపారు.ఠాగూర్ విద్యార్థులకు నైతిక విలువలు, సత్యం, మానవతా ధర్మం వంటి అంశాలను బోధించారు. యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యం. ఠాగూర్ జీవితం, రచనలు, సేవలు భారతదేశ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.



మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ
రాష్ట్ర అధ్యక్షుడు

# అందాల పోటీలపై విమర్శలు

## కొట్టి పారేసిన మంత్రి జూపల్లి




**హైదరాబాద్,మే6( వెలుతురు):**
హైదరాబాద్ వేదికగా అందాల పోటీలకు రంగం సిద్ధం అయ్యింది. ప్రపంచంలో ఉన్న సుందరీమణులు అంతా హైదరాబాద్ చేరుకుంటున్నారు. తెలంగాణ ఖ్యాతిని విస్తృత పరిచేందుకు ఈ అవకాశాన్ని ప్రభుత్వం బాగాను ఉపయోగించుకుంటోంది. నిజానికి ఇదొక మార్కెట్. ఇక్కడ అతివల అందాన్ని ప్రదర్శించడమన్నది ఒక కళగానేచూడాలి. దీనిపై కొందరు విమర్శలు చేస్తున్నా, తెలంగాణకు మాత్రం ప్రయోజనకారిగానే ఉంటుందని భావించాలి. ఓ పక్క వడ్లు అమ్మేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. సిఎం రేవంత్ మాత్రం అందాల పోటీలపై దృష్టి పెట్టారని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీ పట్ల ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ఇకపోతే అందాల పోటీలు అతివలను కించపరిచే వని, వారిని తక్కువ చేసి చూపేవిగా ఉంటాయని సిపిఐ నేత నారాయణ అభిప్రాయపడ్డారు. ఇది కూడా నిజం కాదు. ఈ పోటీల వల్ల తెలంగాణ టూరిజం వెలుగులోకి వస్తుంది. మన వస్తువులకు ప్రపంచ మార్కెట్‌లో విలువ పెరుగుతుంది. మరో రకంగా వ్యాపార కార్యకలాపాలు ఊపందుకుంటాయి. అదనంగా మన ఖజానాకు ఆదాయం కూడా వస్తుందనడంలో సందేహం లేదు. టూరిజం ప్రమోషన్, పెట్టుబడుల ఆకర్షణ కోసమే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ పర్యాటకాన్ని ప్రపంచానికి చూపిస్తామన్నారు. మిస్ వరల్డ్ పోటీలపై కొందరు రాజకీయ కోణంలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మిస్ వరల్డ్ పోటీలు ఏ కోణంలో చూస్తే అలా కనిపిస్తాయని.. ఈ ఈవెంట్‌కు వందల కోట్లు ఖర్చుపెట్టడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.5 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఖర్చు చేసే రూ.5 కోట్లు- కూడా తిరిగి ప్రభుత్వానికి వస్తాయని తెలిపారు.అలాగే తాము ఫార్ములా ఈ రేసును కూడా తప్పు పట్టలేదన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేసిన కోట్ల రూపాయల చెల్లింపులను తప్పు పట్టామని స్పష్టం చేశారు. మమ్మల్ని విమర్శించడమే బీఆర్‌ఎస్ పని అంటూ మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావుకు రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్లలో పంటలు ఎండినా రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తాము పరిహారం ఇచ్చామని వెల్లడించారు. బీఆర్‌ఎస్ హయాంలో తరుగు పేరిట రైతులను దళారులు దోచుకున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ చేసే విమర్శల్లో పసలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# మనసుకవి ఆచార్య ఆత్రేయ

- **నేడు జయంతి సందర్భంగా నివాళి**

**విజయవాడ,మే6( వెలుతురు):**
ఆచార్య ఆత్రేయ తెలుగు వారికి సుపరిచతమైన సినీ కవి. ఆయన ఎన్నో అందమైన పాటలను, విరహగీతాలను రచించి మెప్పుపొందారు. ఆత్రేయుడు అంటే చంద్రుడు అని కూడా అర్థం. మబ్బుల చాటున చందమామ దోబూచులాడినట్లు ఆత్రేయ రాసిన కొన్ని సినిమా పాటల వెనుక ఆయన అంతర్యాన్ని, అనుభవాన్ని, అన్వేషణలు కలబోసి ఉంటాయి. సినిమా పాటల్లో తేలికైన పదాలతో ఎంత బరువైన భావాలనైనా పలికించిన ఆత్రేయను సినీ వేమన అనొచ్చు. అలాగే జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాను చవిచూసిన ఆత్రేయను 'అపర శ్రీనాథుడు' అని కూడా అనొచ్చు. ఆత్రేయ తనకు ఎదురైన అనుభవాలను పాటల్లో పొదిగి, తన గుండె బరువును దించుకున్నట్లుగా కూడా కొందరు



పెద్దలుచెబుతారు. మనసుకవిగా ముద్ర వేసుకున్న ఆచార్య ఆత్రేయ పూర్తి పేరు 'కిళాంబి వేంకట నరసింహాచార్యులు'. పేరులో ఆచార్యని, గోత్రంలోని ఆత్రేయను తీసుకొని 'ఆచార్య ఆత్రేయ' అని పెట్టుకున్నారాయన. 1921 మే 7, నెల్లూరు జిల్లా, సూళ్లూరుపేట మండలం, మంగళంపాడు గ్రామంలో సీతమ్మ, కృష్ణమాచార్యులకు జన్మించారు. భక్తిరస ప్రధానంగానూ ఆత్రేయ కలం అద్భుతాలు సృష్టించింది. శేషశైలావాస శ్రీవెంకటేశా అంటూ ఆయన శ్రీనివాసుడికి జోలపాడిన విధం మరిచిపోలేనిది. శ్రీ వెంకటేశ్వర మహత్యం చిత్రంలోని ఈ పాట అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ.. విన్న వెంటనే శ్రీవారి చెంతకు పట్టుకెళ్లిపోతుంది. మనసు గతి ఇంతే మనిషి బతుకు ఇంతే మనసున్న మనిషికీ సుఖము లేదంతే అంటూ ఆయన కలం నుంచి ఎన్నో ఆణిముత్యాలు జాలువారాయి. తక్కువ మాటలతో ఎక్కువ భావాలను పలికించడంలో ఆత్రేయ దిట్ట. ఆయన పాటలు తెలుగు సినిమాను కొత్త పుంతలు తొక్కించాయి. ప్రేక్షకుడ్ని సినిమాలో మమేకమయ్యేలా చేయడంలో ఆయనకాయనే సాటి.1989, సెప్టెంబర్ 13.. ఎందరో సినీ అభిమానులను విషాదంలో ముంచుతూ ఈ లోకాన్ని విడిచివెళ్లారు ఆత్రేయ. మనసుతో ఆయన పలికించిన భావాలకు ఆచార్యత్వం వహించారు. కనుకనే ఆచార్య ఆత్రేయ అయ్యారు. ఆయన కలం మూగపోయినా పాటలు ఆగవు. ఆ పాటలు ఆగినా అందులోని రాగాలకు అంతం లేదు. వాటిలో పలికించిన భావాలకు మరణం లేదు. ఆత్రేయ ఆగని మనోభావాల ఉధృతికి చెరగని ముద్రలాంటి వారు. ఇందులో అనుమానం లేదు.

## జే. బి. ఎం. రాష్ట్ర కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పునీత్ ని అభినందించిన బండి రమేష్...



**కూకట్ పల్లి మే 6 వెలుతురు:**
జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఇటీవల జేబీఎం "చిల్డ్రన్స్ క్యాంప్–2025"తెలంగాణ రాష్ట్ర సంస్థలో జరిగిన చిన్నారుల ఎన్నికలలో వైస్ ప్రెసిడెంట్ గా కూకట్పల్లి నియోజకవర్గం నుంచి గెలుపొందిన పునీత్ ని కాంగ్రెస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బండి రమేష్ మంగళవారం అభినందించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్ బాల్ మంచ్ ఆధ్వర్యంలో పిల్లలకు రాజ్యాంగం లక్ష్యాలు, ఆశయాలు–స్ఫూర్తి మీద అవగాహన కల్పిస్తూ అలాగే ఎప్పటికప్పుడు 'తిత్లి యూనిట్లను' ఏర్పాటు చేస్తూ పిల్లల లక్ష్యాలను సరదాగా, ఆహ్లాదకరంగా చేరుకోవడంలో సహాయపడుతూ ఉంటుందన్నారు. అనంతరం తితిలి యూనిట్ సభ్యులను చిన్నారులు రమేష్ కలిశారు. అనంతరం సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ పిల్లలను బాగా ప్రోత్సహిస్తూ, వారికి మార్గ నిర్దేశం చేస్తూ, మంచి అలవాట్లను అలవాటు చేసుకుని భవిష్యత్తులో పిల్లలు తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తూ ఆయన ముందుకు సాగాలని సూచించారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా..

- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు..



**కూకట్ పల్లి మే 6 వెలుతురు:**
డివిజన్ లోని మౌలిక సదుపాల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోని కమల ప్రసన్న నగర్ కాలనీలో జిహెచ్ఎంసి, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులతో కలిసి మంగళవారం ఆమె పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కమల ప్రసన్న నగర్ 12,13 రోడ్ లలో సివరేజ్ లైన్ లో చిన్నవిగా ఉండడంతో తరచుగా వారానికి ఒకసారి మురుగునీరు రోడ్డుపైకి రావడం మ్యాన్ హోల్స్ శుభ్రం చేయడం జరుగుతున్నందున నూతన వన్ ఫీట్ లైను వేయాల్సి ఉందని కావున మంజూరు చేయించి వీలైనంత తొందరగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని అన్నారు. అలాగే సిమెంట్ రోడ్డు మంజూరు చేయడం జరిగిందని కాంట్రాక్టర్ తో మాట్లాడి వీలైనంత తొందరగా ప్రజలకు ఇబ్బంది లేకుండా వేయించాలని జిహెచ్ఎంసి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్, ఎస్ బి మేనేజర్ ప్రియాంక జిహెచ్ఎంసి నిఖిల్, కాలనీ అధ్యక్షులు శేఖర్, రాఘవులు, ఆంజనేయులు, రాజు, శ్రీశైలం గౌడ్, రాము, తిరుపతి, బండప్ప తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయం

- పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ...



**కూకట్ పల్లి మే 6 వెలుతురు:**
శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయమని పిఏసి చైర్మన్ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయి నగర్, మొగులమ్మ బస్తీ, పీజేఆర్ నగర్, దత్తాత్రేయ నగర్,శంషిగుడా ఇంద్రహిల్స్, హెచ్ఎంటి శాతవాహన నగర్, జయ నగర్ కాలనీలలో రూ. 2 కోట్ల 48 లక్షల 70 వేల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణము పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని అన్నారు. సీసీ రోడ్లు అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని, అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దొంగల బీభత్సం తస్మాత్ జాగ్రత్త రామన్నపేట లక్ష్మి వైన్స్ లో డబ్బులు మాయం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 6**



ఏమనగా పిర్యాదు అయిన చిట్యాల గ్రామానికి చెందినా కోనేటి ఎల్లయ్య S/o రాములు గత సంవత్సరం నుండి రామన్నపేట లో బస్ స్టాండ్ దగ్గర ఉన్న లక్ష్మి వైన్స్ ను నడుపుతున్నాడు. తేది 05.05.2025 రోజు రాత్రి 10.00 గంటల సమయం లో క్యాస్ కౌంటర్ లో రెండు రోజులుగా అమ్మిన మద్యం డబ్బులను పెట్టి తాళ్ళం వేసి ఇంటికి వెళ్ళిపోగా మరసటి రోజు తేది 06.05.2025 రోజు ఉదయం అందజ 10.00 గంటల సమయం లో వైన్ షాపు ఓపెన్ చేసి చూడగా ఆ మొత్తం అమౌంట్ కనబడ లేదు. కౌంటర్ వెనుక వైపు ఉన్న రూం లోకి వెళ్లి చూడగా, ఆ రూం యొక్క వెంటి లేటర్ ను పగులగొట్టి ఉన్నది ఎవరో గుర్తు తెలియని, వ్యక్తి వైన్ షాపు లోకి వచ్చి క్యాష్ కౌంటర్ లో ఉన్న డబ్బులను తీసుకోని తీసుకోని వెళ్లి పోయినారు. అని పిర్యాదు రాగ కేసు నమూదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నానని ఎస్సై మల్లయ్య రామన్నపేట ఒక ప్రకటనలో తెలిపినారు. క్యాష్ కౌంటర్ లో ఉన్న డబ్బుల వివరాలు తెలియవలిసి ఉన్నది.

# సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో ఆవేదనని వాస్తవ పరిస్థితిని ఉద్యోగ సంఘాలు, తెలంగాణ ప్రజలు గ్రహించాలి

- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం."




**కూకట్ పల్లి మే 6 వెలుతురు:**
సీఎం రేవంత్ రెడ్డి మాటల్లో ఆవేదనని వాస్తవ పరిస్థితిని ఉద్యోగ సంఘాలు, తెలంగాణ ప్రజలు గ్రహించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. మంగళవారం గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిదులు డా. సత్యం శ్రీరంగం, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎప్పటికప్పుడు కుట్రలు పన్నుతూ అప్పుడు విద్యార్థులను రెచ్చగొట్టారు.. తరువాత రైతులను రెచ్చగొట్టారు..పనిచేయకుండా ఐఏఎస్ లను రెచ్చగొట్టారు..కొత్తగా ఇప్పుడు ఆర్టీసీ కార్మికులను..ఉద్యోగ సంఘాలను రెచ్చగొట్టి ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటించేలా పావులు కదుపుతున్నారని అన్నారు. ఒకవైపు ఆర్టీసీ స్ట్రైక్ చేయడానికి ప్రభుత్వానికి నోటీస్ లు ఇచ్చారు. అదే సమయంలో ఉద్యోగ సంఘాలు తాము స్ట్రైక్ కు వెళతాం అని ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. నేడు వాళ్ళతో చర్చలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ప్రభుత్యం ఆర్థిక సంక్షోభంలో ఉందని వచ్చే ఆదాయం జీతాలకు పథకాలకు సరిపోవడం లేదు బయట అప్పు పుట్టడం లేదు..వాస్తవాలు లెక్కలు.. ఆదాయం ముందు పెట్టీ మీరే నిర్ణయించండి..నేను ఏ పథకం ఆపాలి..మీరే చెప్పండి..మీరు ఉద్యమం చేయాలి అనుకొంటే అది ప్రజలమీదనే అని తేల్చి చెప్పాడు.. గతం లో కెసిఆర్ ప్రభుత్వంలో మాట్లాడే దైర్యం ఎన్నడు ఉద్యోగ సంఘాలు చేయలేదని పేర్కొన్నారు. కెసిఆర్ చెప్పిన ప్రతిదానికి తల ఊపడం తప్ప మరో ఆప్షన్ ఉండేది కాదు..జీతాలు 15 తారీకు ఇచ్చిన అడిగే ధైర్యం లేదు..ఒక విధంగా చెప్పాలి అంటే ఉద్యోగస్తుల ను కెసిఆర్ గౌరవంగా ఎన్నడు చూడలేదని ఉద్యోగ సంఘాల నేతల తోకలు కత్తిరించి..వాళ్ళ జుట్టు గుప్పెట్లో పెట్టుకున్నాడని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు సమ్మెచేసి ఎంతో మంది కి నెలల తరబడి జీతాలు లేక మరణిస్తే కూడా కెసిఆర్ పట్టించుకోలేదని అన్నారు. ఆర్టీసీ మేఘ కృష్ణారెడ్డి కి కట్ట పెట్టడానికి అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయని ఎలక్ట్రిక్ బస్ ల కొనుగోళ్లు జరిగిపోయాయి..ఉద్యోగస్తులు బలవంతం చేసి వాలంటరీ రిటైర్మెంట్ కు బలవంతం చేశారు. ఉద్యోగస్తులకు ఎవరూ ఊహించని జీతాలు వస్తూనే ఉన్నాయి.. కానీ ఇంకా అసంతృప్తి ఎందుకు..? ప్రభుత్వం ఉదాసీనం గా ఉండటమే తప్పా..?మీకు జీతాలు కష్టం గా ఉన్నా 1వ తారీకు ఇవ్వడం ప్రభుత్వ తప్పా..?వాస్తవాలు తెలుసుకోకుండా మీ పోరాటం ఎవరి మీద చేస్తారు..?అసలు మీరు చేస్తున్న ఉద్యోగానికి మీరూ న్యాయం చేస్తున్నారేమో గుండె మీద చేయు వేసుకొని చెప్పాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉంటే ఏంటి? వచ్చే వాడు చూసుకుంటాడు? వచ్చే వాడు అనుభవిస్తాడు అని బాధ్యత లేకుండా వ్యవహరించి ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్ కంటే ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు చెప్పి సహకరించమని కోరడం మంచి పరిణామం అని అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికులతో చర్చలు చేసినప్పుడు వాస్తవాలు బయట పడ్డాయి..గత ప్రభుత్వంలో సమ్మె చేస్తే ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఆ ప్రభుత్వం ఎన్ని బాధలు పెట్టింది అన్ని విషయాలు వాళ్ళ దృష్టికి తేగా వాస్తవాలు తెలుసుకొని కేటీఆర్ డ్రామాలు అర్థం చేసుకొన్న కార్మికులు సమ్మె విరమించారు. రేవంత్ రెడ్డిని దూషించిన తీరు..రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులను చివరికి, బావమర్ది..ఇయ్యంకుడు నీ కూడా వదల లేదు..పదేపదే దొంగ అని రేవంత్ రెడ్డిని అనడం ద్వారా తాను సంతోష పడుతూ పిచ్చి జోక్స్ తో ప్రక్క వారిని నవ్విస్తూ తన స్థాయి దిగజార్చుకొని ఒక జోకర్ హావభావాలు లతో రేవంత్ రెడ్డి సీఎం పదవికి పనికిరాడు అని చెప్పే ప్రయత్నం చేశాడు. డిల్లీ కి 42 సార్లు వెళ్ళడం తోనే ఖజానా ఖాళీ అయ్యిందని చెప్పడం పెద్ద జోక్.. కెసిఆర్ ఫాం హౌస్ లో పడుకొని పాలన చేస్తే పోలీస్..సచివాలయ సిబ్బంది ప్రతి రోజు ఫాం హౌజ్ కు వెళ్ళడం.. కెసిఆర్ కోసం కిలోమీటర్ ల కొద్ది పోలీస్ సెక్యూరిటీ కి ఎన్ని వందల కోట్లు ఖర్చు చేశాడో కేటీర్ కు తెలియకపోవడం విచిత్రం. కెసిఆర్ పనికి మాలిన పాలనకు జనం చీకొడితే అధికారం దూరమవుతే ఇంకా సిగ్గులేకుండా మీడియా ముందు తప్పుడు లెక్కలు తప్పుడు మాటలతో రేవంత్ రెడ్డి వారిమీద బురద చల్లడం తో ప్రజలు చీదరించుకొన్నారు.కేటీఆర్ చేసిన తప్పుడు ఆరోపణల కు వెంటనే బుద్ధి చెప్పాలన్నారు.

## ప్రభుత్వ అధినేత మాటలు ఆక్షేపనీయం

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 6**



గత ప్రభుత్వం కంటే ఎక్కువ పథకాలను అమలు పరుస్తామని, సంక్షేమమే మా ఎజెండా అని, పేదలను కోటీశ్వరులు చేయడమే మా లక్ష్యమని, అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వ అధినేత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న జరిగిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో జరిగిన పోలీస్ అవార్డు కార్యక్రమంలో మాట్లాడిన అంశాలు ఆయన అసహనాన్ని, అసమర్థతను ప్రతిబింబిస్తూ, ఒక దశలో ప్రభుత్వాన్ని నడపలేని అనే ఆలోచనకు వచ్చినట్లు ఆ వాక్యాలు ఆక్షేపని యంగా ఉన్నాయి. ప్రభుత్వ పెద్ద సమాజానికి దిక్సూచిగా ఉన్న వ్యక్తి మాట్లాడేటప్పుడు ,ఆ మాటలు యావత్ రాష్ట్రాన్ని ప్రభావితం చేస్తాయి. అనేది నిజం. గత టిఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు రెట్టింపు పథకాలు ఇస్తామని ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల నుండి రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ఎక్కడ అప్పు పుట్టడం లేదని చెప్పడం, చేతగాని తనానికి నిదర్శనం. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ చరిత్ర చూస్తే టిఆర్ఎస్ కంటే సుదీర్ఘమైనది.అనుభవపూర్వకమైనది. ప్రతిపక్ష హోదా నుండి అధికారపక్ష హోదాకు వచ్చిన పార్టీ గత పది సంవత్సరాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి పూర్తి అవగాహన ఉన్న వ్యక్తులు కేవలం అధికారం కోసమే ఉచిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి, చేయలేక అప్పులపాలని అప్పు పుట్టడం లేదని దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తున్నారు.ఎన్నికల్లో 2000 పింఛన్లు 4000 చేస్తామన్నప్పుడు, కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయల తో పాటు తులం బంగారం అన్నప్పుడు, మహిళలకు నెలకు 2500 ఆర్థిక సాయం అన్నప్పుడు, 2 లక్షల రుణమాఫీ రైతులకు అన్నప్పుడు, పేద విద్యార్థులకు ఉచిత స్కూటీ, కౌలు రైతులకు సంవత్సరానికి 10,000 ఈ విధంగా చెప్పుకుంటూ పోతే లెక్కకులేని, అక్కరకు రాని, ఎన్నో హామీలను ప్రకటించినప్పుడు, ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలియదా. లేకుంటే ప్రజలను మోసం చేసి అధికారం చేసి కించుకోవాలని ఆలోచన తప్ప మరేమీ, లేనట్లే కనిపిస్తుంది. అంతే కాకుండా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఉద్యోగ సంఘాలను ఉద్యమంలో తమ యొక్క అమూల్యమైన పాత్రను పోషించినటువంటి నాయకులను ఉద్యోగ సోదరులను కించపరిచినట్టు మాట్లాడ0 కడు శోచనీయం ఆక్షేపనియం. అసహనంతో తనను కోసిన రూపాయి రాదని, ఎక్కడ అప్పు పుట్టడం లేదని, ఢిల్లీలో తెలంగాణ నేతలను నాయకులను దొంగల్లా చూస్తున్నారని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పడం తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయటమే అవుతుంది. నెలకు వివిధ రూపాల్లో సుమారు 18 వేల కోట్ల రూపాయల ఆదాయం ఉన్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం దాని తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించుకొని, ఉచిత ఉచితలను క్రమబద్ధంగా తగ్గించుకుంటూ పాలనను గాడిలో పెట్టాల్సిందే. అంతేకాకుండా ముఖ్యంగా రాష్ట్రానికి ఆదాయ వనరుగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగాన్ని హైడ్రా పేరుతో ఉపగల్చడం తద్వారా ఎక్సైజ్ శాఖ ఆదాయం తగ్గి రాష్ట్ర ఆదాయానికి గండి పడ్డది. అనేది జగమెరిగిన సత్యం. కేవలం అధికారం కోసం అరుర్లు చాస్తూ అనవసరమైన పథకాలను సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని దివాళి తీసేది. నాయకులు వారి పదవుల కోసం మాత్రమే అది ఎవరికైనా ఏ పార్టీకైనా వర్తిస్తుంది. అంతేకాకుండా అవకాశం ఉన్న ప్రతి దగ్గర ప్రభుత్వం ఖర్చులు తగ్గించుకుంటూ కొన్ని పథకాలను కచ్చితంగా రద్దు చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఈ మధ్యనే సుప్రీంకోర్టులో టాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం న్ని దాఖలు చేయడం జరిగింది. దీని ప్రకారం ఏ ప్రభుత్వాలు అయినా ఉచిత పథకాలు ప్రకటించేటప్పుడు, అమలుపరిచినప్పుడు కచ్చితంగా ఉచితాలను పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రజలే ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నందున ఉచితం అనేది, లేకుండా భవిష్యత్తులో చేయాలనేది. సుప్రీంకోర్టు సూచన. దీన్ని అన్ని రాష్ట్రాలు అమలుపరుస్తూ ప్రజలకు కేవలం ఉచిత విద్య, వైద్యం అందిస్తే అన్ని అందించినట్లేనని భావిస్తూ ప్రజలే వీటి ద్వారానైతిక ,ఆర్థిక ,అభివృద్ధి జరుగుతుంది. ఇంకా మూడు సంవత్సరాల కాలం ఉన్న ప్రజా ప్రభుత్వం అప్పుడే అసహనాన్ని అసమర్థతను ప్రకటించకుండా జాగ్రత్తగా వ్యవహరిస్తూ సంపూర్ణ ఐదేళ్ల కాలం ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని మంచి పాలన చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని ఆకాంక్షిద్దాం. ముఖ్యమంత్రి అప్పు పుట్టడం లేదని, ఢిల్లీలో దొంగల్లా చూస్తున్నారని అనడం కాదు, ఆక్షేపణీయం అసందర్భం కూడా. ఎందుకంటే ముఖ్యమంత్రి స్థాయిలో గంభీరంగా వ్యవహరిస్తూ ప్రణాళిక బద్ధంగా ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూ, రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందిస్తూ, ముందుకు వెళ్లాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది. కేవలం ఎన్నికల ముందు హామీలు గుప్పిస్తూ, తర్వాత లోటు బడ్జెట్ అని రాష్ట్రం అప్పుల కుప్పలు అయిందని చెప్పడం తగదు. ఇట్లాంటి వ్యాఖ్యల వల్ల బ్యాంకర్లు గాని ,కేంద్ర సంస్థలు గాని ఫైనాన్స్ గాని, వెనక్కి తగ్గుతారు తప్ప మరి ఏ ఉపయోగముండదు .ఈ రాష్ట్ర అప్పుఅయినా,ఆదాయమైన ,చివరగా బాధ్యులు మోయాల్సింది. ప్రజలే పన్నుల రూపంలో వారు క ట్టి డబ్బులే ఆదాయాన్ని సమకూరుస్తాయి .అప్పులకు వడ్డీలు కానీ అప్పులు తీర్చడం కానీ జరుగుతుంది. దేశ విదేశాల నుండి వచ్చేటువంటి పెట్టుబడులు పెట్టే కంపెనీలు కూడా వెనుక పట్టు పడతాయి. విశ్లేషణ కూనూరు శ్రీనివాస్ గౌడ్.

## రాజీ మార్గం ద్వారా రాజీ పడదగ్గ కేసులను పరిష్కారం చేసుకోవాలి

### సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితా దేవి....

**జహీరాబాద్ వెలుతురు మే 06:**
జూన్ 14 న జరుగనున్న జాతీయ లోక్ అదాలత్ ను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవితా దేవి సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ కోర్టు కాంప్లెక్స్ లో మీడియావేశం నిర్వహించి వారు మాట్లాడారు. రాజీ మార్గం ద్వారా రాజీ పడదగ్గ కేసులను పరిష్కారం చేసుకోవాలని సూచించారు. మీడియా ప్రతినిధులందరు లోక్ అదాలత్ పై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసు రాజీ చేసుకోవడం ద్వారా సమయాన్ని, డబ్బును ఆదాచేసుకున్నవారవుతారని సూచించారు. బాధితులు,




కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. లోక్ ఆదాలత్ పై ఏ సమాచారం గురించి తెలుసుకోవాలనుకున్న స్థానిక తహసీల్దార్ కార్యాలయాలను గాని, న్యాయ వాదులను గాని, పోలీస్ ఉన్నతధికారులను గాని, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయంను గాని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రింట్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 6 :**
పట్టణ కేంద్రంలో ఉన్న లక్కారం క్యాంప్ ఆఫీస్ దగ్గర మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులు కు చౌటుప్పల్, తంగడపల్లి, లక్కారం, లింగోజిగూడెం, లింగారెడ్డిగూడెం, వారికి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరు అయినా 11 చెక్కులను కుటుంబ సభ్యులకు మంగళవారం రోజు చౌటుప్పల్ వ్యవసాయ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పబ్బు రాజు గౌడ్, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, నాయకులు మోగదాల రమేష్ గౌడ్, కాసర్ల శ్రీనివాసరెడ్డి, బొంగు జంగయ్య గౌడ్ కోయడ సైదులు గౌడ్, బాబా షరీఫ్, బత్తుల విప్లగౌడ్ అనుభయ్, కేతరాజు అచ్చయ్య, పందుల రాజేష్ గౌడ్, పూదరి నరసింహ, బండమీద వెంకటేష్, తదితర కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు .

## పల్లివాడ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ గంగా భవాని విగ్రహ ప్రతిష్ట

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 6**



కార్యక్రమం ప్రారంభం 6, 7, 8 తేదీలలో గంగమ్మ తల్లి హెూమం కార్యక్రమంలో భాగంగా పురోహితులకు చిట్యాల వెంకటేశం శాస్త్రి, చలమల్ల ధనుంజయ శాస్త్రి, బ్రహ్మానంద స్వామి, వారికి గంగ భవాని ఆలయ కమిటీ తరపున పట్టు వస్త్ర బహుకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ గంగాభవాని ఆలయ కమిటీ అధ్యక్షులు దూదిమెట్ల సైదులు యాదవ్, పెద్ద గొల్ల దండిగా పరమేష్ యాదవ్ ,సారి గొల్ల ఆవిరాల అంజయ్య యాదవ్, మాజీ ఉప సర్పంచ్ కల్లూరి నగేష్ యాదవ్, దండిగా పాండు యాదవ్, బైకాని నరసింహ యాదవ్, దూదిమెట్ల కృష్ణయ్య యాదవ్, కల్లూరి నరసింహ యాదవ్, దండిగ రమేష్ యాదవ్ మేకల మహేష్ యాదవ్, పావిరాల శివ యాదవ్, దండిగ నరసింహ యాదవ్, మేకల నరేష్ యాదవ్, పావిరల శివ యాదవ్, దండిగ మహేష్ యాదవ్, మరియు యాదవ కుల బంధువులు గంగాభవాన్ని భక్తులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో, పాల్గొనడం జరిగింది.



# రైల్వేలో ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలి

- రైల్వే స్టేషన్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి...
- ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి...
- కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేయాలి..
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్




**జహీరాబాద్ వెలుతురు మే 06:**
కేంద్ర బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానంలో భాగంగా రైల్వేలను కూడా ప్రైవేటుపరం చేస్తూ రైల్వే స్టేషన్లో సదుపాయాలను కల్పించాలని, ప్రయాణికుల భద్రతను పట్టించుకోవలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి, కాంట్రాక్టు వర్కర్లను పర్మినెంట్ చేయాలని తదితర డిమాండ్స్ చేస్తూ సోమవారం సిఐటియు జాతీయ కమిటీ పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జహీరాబాద్ రైల్వే స్టేషన్ ముందు నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రైవేటు వాళ్లకు అప్పగించే ప్రయత్నంలో భాగంగా రైల్వే ని కూడా ప్రైవేటుపరం చేస్తుందని ప్రయాణికుల భద్రతను గాలికి వదిలి కార్మికులను కూడా పట్టించుకునే స్థితిలో లేదని పూర్తిస్థాయిలో ఉద్యోగాలను భర్తీ చేయకుండా కాంట్రాక్టు కార్మికులతో పని చేయించుకుంటుందని తక్షణమే రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. రైల్వే ప్రమాదాలు ప్రయాణికులపై దృష్టి పెట్టాలని రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు మెరుగుపరచాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని,ప్రైవేటీకరణ పాపలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బక్కన్న లక్ష్మణ్ గుండప్ప మొగలయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం..

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 6**
33/11kv సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా నేడు బుధవారం ఉదయం 6:00 నుండి ఉదయం 9 గంటల వరకు రామన్నపేట,నీర్ణముల, దుబ్బాక,జనంపల్లి, గ్రామాలకు ఐ డి ఏ ఎల్ ఇండస్ట్రియల్ ఫీడర్ లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున వినియోగదారులు సహకరించగలరని, రామన్నపేట విద్యుత్ శాఖ ఏఈ ఎం. కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ముంచుతుంది

**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 6**



బి ఆర్ ఎస్ వి తెలంగాణ లో యువతను అధికారం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచు తుందని బిఆర్ ఎస్ వి నకిరేకల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు జెట్టి శివ ప్రసాద్ యాదవ్ మండిపడ్డారు. రాజీవ్ యువ వికాస్ అనే పథకం లో, అనేక ఆంక్షలు పెట్టి యువతను గందరగోళానికి గురించే స్తున్నారు. అన్నారు, రాజీవ్ యువ వికాసం పథకం రావాలంటే సిబిల్ స్కోర్ ఉండాలనే మెలిక పెట్టడాన్ని జెట్టి శివప్రసాద్ యాదవ్ తీవ్రంగా వ్యతిరేకంచారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి అసలు యువతకు ఎటువంటి ఆర్థిక సహాయం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు.

## రేపు కన్యకా పరమేశ్వరి జయంతి



**వెలుతురు నారాయణఖేడ్ మే 06 .**
సంగారెడ్డి జిల్లా తెలుగు రాష్ట్రాల్లోని హిందువులకు మరీ ముఖ్యంగా ఆర్యవైశ్యులకు 'శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి' అంటే ఎంతటి భక్తో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. వారి కులదైవం అయిన ఈ తల్లిని తలచుకోనిదే వారి జీవితం గడవదు. అలాంటి వాసవి మాత జయంతి సందర్భంగా అశ్వత్థ పత్రంపై అమ్మవారి చిత్రం ఒక చేతిలో కమలం మరో చేతిలో చిలుక చిత్రాలతో ప్రతి ఒకరికి కన్యకాపరమేశ్వరి మాత జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ గుండు శివ కుమార్ లీఫ్ ఆర్టిస్ట్ నారాయణఖేడ్.

## వెంకటేశ్వర స్వామి కళ్యాణం చూతము రారండి

### స్వామి వారి లగ్గానికి ఏర్పాట్లు పూర్తి ఐదు రోజులు సాగనున్న ఉత్సవాలు





**వెలుతురు నారాయణఖేడ్ మే 06 .**
సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని ఆకుల లింగాపూర్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ నిర్వాహకులు గ్రామ ప్రజలు తెలిపారు. ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించే కళ్యాణ మహోత్సవానికి నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు పొందాలని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.కళ్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం శ్రీ వెంకటేశ్వర స్వామికి భూదేవి శ్రీదేవి సహిత కళ్యాణం, రేణుక ఎల్లమ్మ వీధి నాటకం, ఆలయం చుట్టూ బండ్ల ప్రదక్షణ, లాజ హోమం రథోత్సవం, కుస్తీ పోటీల నిర్వహణ కార్యక్రమాలతో స్వామి వారి కళ్యాణ మహోత్సవం పూర్తి కానున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. దాతల, గ్రామస్తుల సహకారంతో ఐదు రోజులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## 7 గురు పేకాటరాయుళ్ల అరెస్ట్... నగదు స్వాధీనం

**వివరాలు వెల్లడించిన జహీరాబాద్ రూరల్ ప్రొబేషనరీ ఎస్ఐ డి. సుజిత్**




**జహీరాబాద్ వెలుతురు మే 06:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం హెూతి–కె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను జహీరాబాద్ రూరల్ ప్రొబేషనరీ ఎస్ఐ డి. సుజిత్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలు... హెూతి–కె గ్రామా శివారులోని ఇటుకల బట్టి ప్రక్కన గల ఖాళీ స్థలములోని ఒక వేపచెట్టు కింద కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి ఏడు మందిని స్పాట్లో అరెస్ట్ చేశామని తెలిపారు. పేకాట స్థావరం పై దాడిలో రూ.7,140 లు నగదు, 6 మోటార్ సైకిల్ లు,.7 మొబైలు ఫోన్ లు, 52 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకొని వారిపైన కేసు నమోదుచేసినట్లు వారు తెలిపారు.

## శ్రీ పద్మావతి హై స్కూల్ 10వ తరగతి లో ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించిన "కాట దంపతులు"



**అమీనపూర్ వెలుతురు మే 06:**
అమీనపూర్ గ్రామంలోని శ్రీ పద్మావతి హై స్కూల్లో 10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కాట శ్రీనివాస్ గౌడ్ గారు మరియు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ గారు ప్రత్యేకంగా అభినందించి, ఘనంగా సన్మానించారు. ఈ పరీక్షల్లో స్కూల్ ఫస్ట్‌గా 568 మార్కులతో బిందు, స్కూల్ సెకండ్‌గా 550 మార్కులతో దివ్య, దొరస్వామి, అలాగే ప్రీతి, సాయిరాం (535 మార్కులు) ప్రతిభ కనబరిచారు. 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులందరిని ప్రత్యేకంగా అభినందించి, వారికి ఉత్తమ భవిష్యత్తు కోసం శు భాకాంక్షలు తెలిపారు.

## కోతి రాంపూర్ వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మాసం గణేష్ వినతి..



**వెలుతురు కరీంనగర్ మే 06:**
కరీంనగర్ పట్టణం కోతిరాంపూర్ లోని సుజుకి షోరూం వద్ద గల యూటర్న్ వద్ద నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం రోజున 9వ డివిజన్ బిజెపి కాంటెస్టెడ్ కార్పొరేటర్ మాసం గణేష్ మున్సిపల్ కమిషనర్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాలపై గతంలో అనేక ఫిర్యాదులు చేస్తే అక్కడి ప్రాంతంలో జీబ్రా లైన్స్ వేశారు . కానీ రాత్రుళ్ళు అవి కనపడక స్పీడ్ గా వస్తున్న వాహనాల వల్ల యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని వివరించారు. ఇటీవల జరిగిన అక్కడ జరిగిన ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ప్రధానంగా ఈ ప్రాంతం మీదుగా హైదరాబాద్, వరంగల్ లకు అనునిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగుతాయని, అయితే వాహనాలు స్పీడ్ గా రావడం, యూటర్న్ వద్ద తగిన ప్రమాద నివారణ చర్యలు లేకపోవడంతో ఈ ప్రాంతం యాక్సిడెంట్ స్పాట్ గా మారిందన్నారు.. ముఖ్యంగా రాత్రి వేళలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే ఇక్కడి ప్రాంతంలో వాహనాల వేగాన్ని నియంత్రించడానికి, స్పీడ్ లిమిట్ పెట్టడంతోపాటు ప్రమాదా నివారణకు బ్లింకింగ్ లైట్స్ , స్టాపర్లు , స్పీడ్ బ్రేకర్లు , తగిన సూచికలు ఏర్పాటు చేయాలని కోతి రాంపూర్ తొమ్మిదవ డివిజన్ ప్రజల పక్షాన ఆయన కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు..

## "అక్రమ పాకిస్తానీలను, ఉగ్రవాదులను వెంటనే తరిమికొట్టండి"

- న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ డిమాండ్...



**జహీరాబాద్ వెలుతురు మే 06:**
జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని దృష్టిలో పెట్టుకొని మండలంలో ఎవరైనా పాకిస్తానీలు ఉంటే వెంటనే వారిని గుర్తించి దేశం నుంచి పంపించాలని సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండల బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక మండల డిప్యూటీ తహశీల్దార్ రాజిరెడ్డికి మెమోరండం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. మండలంలో ఎవరైనా అక్రమ పాకిస్థానీలు, ఉగ్రవాదులు ఉంటే వెంటనే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజులలో ఇక్కడ కూడ అలాంటి పరిస్థితి రావచ్చని అన్నారు.

## ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి: తపస్



**మెదక్ టౌన్ వెలుతురు మే 06:**
తపస్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి మెదక్ లో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు గౌరవ ముఖ్యమంత్రి ఉద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ముఖ్యమంత్రి నిన్న ఇంతకుమించి నేనేమీ చేయలేను అని చెప్పిన మాటలు తీవ్ర నిరాశకు గురిచేశాయని, ప్రభుత ఉద్యోగ,ఉపాధ్యాయులవి గొంతెమ్మ కోరికలు కాదని, ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కచ్చితంగా నెరవేర్చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు రాజేశ్వర్, మాధవరెడ్డి, నరేందర్,సిద్దు, ప్రభాకర్,లక్ష్మీనారాయణ,కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మత విద్వేషాలను రెచ్చగొట్టే మతోన్మాదులను ప్రతిఘటించండి.

- ఇందిరమ్మ ఇల్లు, డబల్ బెడ్ రూమ్ రాజు యువ వికాస్ పథకంలో లోపాల పైన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పిలుపు.
- డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




**హైదరాబాద్ వెలుతురు మే 06:**
మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల దౌర్జన్యాలలో యువతరం ప్రతిఘటించాలని పులి అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణ ఉద్యమాలు చేపట్టాలని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు మంగళవారం రాజ్ బౌదుర్గౌడ్ హాల్ లో దళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కే ఏసు రత్నం అధ్యక్షతన సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ పూలే అంబేద్కర్ లు తుది శ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించారని వారే మన ఆధునిక భారతావని నిర్మాతలని వారు చూపిన మార్గములో నేటితరం మనువాదంపై మహోద్యమమం చేపట్టాలన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కేవలం భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కొలుస్తూ ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తున్నారని చెప్పారు భూమి జాతీయకరణ జరగాలని పరిశ్రమలలో కార్మికులకు యాజమాన్య వాటా హక్కు ఉండాలని నాడే ఆయన రాష్ట్రాలు మైనార్టీలు అనే పుస్తకంలో ప్రస్తావించారని చెప్పారు మహిళా సమానత్వం కోసం హిందూ కోడ్ బిల్లు తీసుకొచ్చి నాటి ప్రభుత్వం అంగీకరించకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. నేడు కేంద్ర బీజేపీ సర్కార్ విధానాల వల్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందన్నారు. దేశంలో పౌరులందరికీ హక్కులు కల్పించిన రాజ్యాంగమే కనుమరుగ అయ్యే ప్రమాదం ఉందన్నారు ప్రజ స్వామ్య దేశాన్ని మతరాజ్యంగా మార్చే కుట్రలు చేస్తున్నారని దీంతో అట్టడుగు వర్గాలకు ఈపాటి హక్కులు ఉండవన్నారు భారత రాజ్యాంగం భారతదేశ ప్రజలందరికీ గుండెకాయ లాంటిదని దాన్ని రక్షించుకోవడం నేటి తరం కర్తవ్యం కావాలన్నారు. ప్రైవేట్ రంగం 85 శాతానికి పెరిగిందని అందులో రిజర్వేషన్స్ లేకుండా సామాజిక న్యాయం ఎలా సాధమన్నారు ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం మహా ఉద్యమం జరగాలన్నారు. సమావేశంలో తీర్మానం. మే 20న జరిగే దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుకు డి హెచ్ పి ఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ కార్మిక పిలుపులో భాగస్వామ్యం కావాలని నిర్ణయించుకోవడం జరిగింది. ఆపరేషన్ కాగాను తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సమావేశంలో తీర్మానం చేయడం జరిగింది. జూన్ చివరి వారం లో డి హెచ్ పి ఎస్ రాష్ట్ర రెండవ మహాసభలు వరంగల్ లో నిర్వహించాలని సమావేశాల్లో నిర్ణయించడం జరిగింది. మే 12న రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ రాజీవ్ యువ వికాస్ పథకంలో లోపాల పైన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పిలుపు .ఈ సమావేశంలో జాతీయ సమితి సభ్యులు బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, ఆఫీస్ బేరర్స్ కే సహదేవ్, ఏ రాజ్ కుమార్, జేరుపోతుల కుమారస్వామి, ఉషశ్రీ, సలిగంటి శ్రీనివాస్ శ్రీనివాస్, బి లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఓయులో తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎమ్ శ్రీకాంత్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు



**హైదరాబాద్ వెలుతురు మే 06:**
తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఎమ్ శ్రీకాంత్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు గ్యార నరేశ్, తెలంగాణ పొలిటికల్ జేఏసీ చైర్మన్ వలిగొండ నరసింహ,అంసా ఓయు అధ్యక్షుడు నామా సైదులు, బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు రవికిరణ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బూర శ్రీనివాస్ గౌడ్ బీజేవైఎం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## నూతన చీఫ్ సెక్రటరీ కే. రామకృష్ణారావు గారికి శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ నేత జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 06:**
నూతనంగా చీఫ్ సెక్రటరీగా నియమితులైన కే రామకృష్ణారావు గారిని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తెలిపారు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ మాల మహానాడు అధ్యక్షులు చంద్రమోహన్ రాయ్ డాక్టర్ కొమ్ము కిరణ్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి హెూదా రవీందర్ ఉన్నారు



## మంత్రి కొండా సురేఖమ్మ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్

**హైదరాబాద్ వెలుతురు మే 06:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజల హృదయాల్లో "అమ్మ"గా విశేషమైన గౌరవాన్ని పొందిన ఏకైక మంత్రివర్యులు కొండ సురేఖమ్మ గారినిలి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లిభీమ లక్ష్మణ్ మంగళవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసారు. ప్రజల సంక్షేమం పట్ల అమ్మ చూపిస్తున్న నిస్వార్థ సేవా భావం, అంకితభావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతిసారీ అమ్మను కలిసినప్పుడు కలిగే ఆనందం, సంతోషం మాటల్లో చెప్పలేనిది.

**అమ్మ అంటే ధైర్యం,**
**అమ్మ అంటే నమ్మకం.**
**జై కొండ! జై జై కొండ ఫ్యామిలీ!**
**జయహెూ సురేఖమ్మ గారు!**

## నూతన చీఫ్ సెక్రటరీగా నియమితులైన కే.రామకృష్ణారావు గారిని సచివాలయంలో కలిసి అభినందించిన బీసీ నేతలు

*పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిఎస్ గారికి విజ్ఞప్తి చేసిన బీసీ నేత జాజుల లింగంగౌడ్*



**హైదరాబాద్ వెలుతురు మే 06:**
మంగళవారం రోజున సచివాలయంలో నూతన ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన కే.రామకృష్ణారావు గారిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలిసి అభినందించినట్లు రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. అనంతరం ఫీజు బకాయిలన్నింటినీ విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్నటువంటి కాకతీయ,తెలంగాణ, పాలమూరు,మహాత్మా గాంధీ,శాతవాహన యూనివర్సిటీలలో కళాశాల యాజమాన్యాలు పరీక్షలను బహిష్కరించారని సకాలంలో పరీక్షలు జరగకపోతే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ నిధులన్నింటినీ విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని లింగంగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్ బీసీ విద్యార్థి సంఘం నాయకులు గోదా రవీందర్ పాల్గొన్నారు

# వక్ఫ్ చట్ట సవరణ జన జాగరన అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా కరీంనగర్లో బీజేవైఎం భారీ ర్యాలీ..

- ముస్లింలకు మేలు చేసే వక్ఫ్ పై కొందరిది అనవసర రాద్ధాంతం
- ఇన్నేళ్లు వక్ఫ్ బోర్డు ఎవరి సంక్షేమం , అభివృద్ధి కోసం పనిచేసింది.?
- వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం సమాజానికి ప్రయోజనం...
- మైనారిటీలోని అన్ని వర్గాలపేదల అభ్యున్నతి..
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...




**కరీంనగర్ వెలుతురు మే 06:**
వక్ఫ్ చట్ట సవరణ జన జాగరన అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్ లోని కోర్టు చౌరస్తా నుండి తెలంగాణ చౌక్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై కొందరు అపోహాతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం విచారకరమన్నారు. మరికొందరు వక్ఫ్ సవరణ బిల్లుపై పనిగట్టుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. అన్యాయానికి గురవుతున్న నిరుపేద ముస్లింలకు న్యాయం చేయడానికి మోడీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణలు చేపడితే ఆ విషయంలో కొంతమంది పనిగట్టుకొని ముస్లిం సమాజాన్ని తప్పుదారి పట్టిస్తూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి తప్ప , ఏలాంటి నష్టం లేదన్నారు. ముఖ్యంగా ముస్లింల ఆస్తులను దోచుకుని, వక్ఫ్ బోర్డు తో ఇన్నేళ్లు అన్ని విధాల ప్రయోజనం పొందిన వారికి సవరణ చట్టం మింగుడు పడటం లేదని , అందుకే సవరణ చట్టాన్నివ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. భారతదేశంలో డిఫెన్స్ కు18 లక్షల ఎకరాలు, రైల్వే కు 12 లక్షల ఎకరాలు, వక్ఫ్ కు ప్రస్తుత లెక్కల ప్రకారం 9.4 లక్షల ఎకరాల భూమి కలిగి ఉన్నాయన్నారు. ఆర్మీ, రైల్వే తర్వాత దేశంలోనే అతిపెద్ద మూడవ భూ యజమానిగా ఉన్న వక్ఫ్ బోర్డు , లక్షల కోట్ల ఆస్తి ,సంపద కలిగి ఉండి ఇన్నేళ్లు ఎవరి ప్రయోజనాల కోసం పనిచేసిందనే విషయాన్ని గ్రహించాలన్నారు. 1954, 1995, 2013లలో దేశానికి ప్రధానులుగా పని చేసిన నెహ్రూ, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ లు వక్ఫ్ కు సర్వ హక్కులు అధికారాలు కట్టబెట్టి , మత ఆస్తుల రక్షణ కోసం ఏకంగా ప్రత్యేక కోర్టును కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. నాడు కాంగ్రెస్ వక్ఫ్ కి సర్వక్కులు దార పోయడం నేడు శాపంగా మరి, అనేక సమస్యలకు మూలంగా నిలిచిందన్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం భూములు క్రయ, విక్రయాలు, గిఫ్ట్ డీడ్ లు చట్టబద్ధంగా జరగాలని చట్టం ఉంటే , వక్ఫ్ కు మాత్రం ఆ చట్టం వర్తించకుండా పోయిందన్నారు.
చట్టం, న్యాయం, ఒకే రాజ్యాంగం ఉండాల్సిన దేశంలో వక్ఫ్ విషయంలో లేకపోవడం దారుణమన్నారు. ఒకసారి వక్ఫ్ వక్ఫ్ బోర్డు తమదే భూమి అని డిక్లేర్ చేసిన, గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన ఆ స్థలం వక్ఫ్ బోర్డుకి చెందుతుందన్నారు. చట్టబద్ధమైన డాక్యుమెంట్లు కలిగిన భూ యజమాల ఆస్తిని కూడా వక్ఫ్ బోర్డు తీసుకునే అధికారాలు ఉన్నాయని, డాక్యుమెంట్తో పని లేకుండా చెవిలో చెప్పిన కూడా డాక్యుమెంట్ అయ్యేస్థితి వక్ఫ్ కు అధికారం కల్పించారని, దీన్నిబట్టి పరిస్థితి ఎంత దారణమో అనే విషయాన్ని గ్రహించాలన్నారు. ప్రపంచంలో ఉన్న ఏ ముస్లిం దేశంలో కూడా వక్ఫ్ లాంటి చట్టం లేదనీ , కానీ కాంగ్రెస్ మైనార్టీ ఓటు బ్యాంకు రాజకీయం కోసం వక్ఫ్ బోర్డుకు సూపర్ పవర్స్ ఇచ్చి దేశంలోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. దీంతో దేశంలో వక్ఫ్ ల్యాండ్ లు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రతి గ్రామంలో వక్ఫ్ భూములు ఉన్నాయని తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ వక్ఫ్ భూములు ఎవరి చేతిలో ఉన్నాయని విషయంపై, లక్షల కోట్ల విలువచేసే భూములు కలిగి , కోట్లాది రూపాయల ఆదాయం కలిగిన వక్ఫ్ బోర్డు వ్యవహారాలు సక్రమంగా లేకుండా, పాలన వ్యవస్థ బలహీనంగా ఉండి, ఎవరికి జవాబుదారీగా ఉండడం లేని కారణంగా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ వ్యవస్థను క్రమబద్ధీకరించడానికి వీలుగా వక్ఫ్ పై (సవరణ) చట్టం 2025 ప్రవేశపెట్టిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు ముస్లిం సమాజ ప్రయోజనాల కోసమేనని , సవరణ చట్టం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా అవినీతిపరుల నుంచి ఆస్తులను రక్షించేందుకు , పారదర్శకత, డిజిటలైజేషన్ , అవినీతికి అడ్డుకట్ట, అక్రమార్కులపై చర్యల తో పాటు సాధికారత అంశాలకు ప్రాధాన్యమిస్తూ మోడీ ప్రభుత్వం వక్ఫ్ పై సవరణ (సంస్కరణ)లు చేపట్టిందన్నారు. అందులో భాగంగా వక్ఫ్ కి చెందిన ప్రతి అంగుళాన్ని డిజిటలీకరణ చేసి పారదర్శకంగా బోర్డును నిర్వహించే వ్యవస్థ తీసుకువచ్చిందన్నారు. కబ్జాకు గురైన వక్ఫ్ ఆస్తులను రక్షిస్తూ, కబ్జాదారుల భరతం పట్టే పని చేసిందన్నారు. వక్ఫ్ బోర్డులో జరుగుతున్న దోపిడీని అడ్డుకట్ట వేయడానికి చర్యలు తీసుకుంటూనే, ముస్లిం మహిళలకు బోర్డులో ప్రాతినిధ్యం కల్పించారని, కుటుంబ వక్ఫ్ లలో వారసత్వ హక్కులు లభించే విధంగా చట్టంలో మార్పులు జరిగాయని తెలిపారు. వక్ఫ్ పై సవరణలు చేపట్టి ఎన్నో ఏళ్ల నిరీక్షణకు మోదీ సర్కార్ తెరదించిందన్నారు. ఇట్టి ప్రోగ్రాంలో వక్ఫ్ సవరణ జన జాగరణ అభియాన్ కన్వీనర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కో కన్వీనర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, యువ మోర్చ బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాముల శ్రీకాంత్, శశిధర్ రెడ్డి ,నాయకులు పుప్పాల రఘు, నాగసముద్రం ప్రవీణ్ , మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షులు సమీ పర్వేజ్ , బిజెపి, బీజేవైఎం నాయకులు అశోక్, సంపత్, అనిల్,సాయి,అజయ్,జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా అధికార ప్రతినిధులు రమేష్, ప్రసన్న, సాయి కృష్ణరెడ్డి, ప్రశాంత్, పొన్నాల రాం, అరుణ్, ప్రదీప్, శివారెడ్డి, బండి సాగర్, వినయ్, వంశీకృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు..

# సంజయ్ సారూ.... అప్పు పుడతలేదు...పిల్లనిస్తలేరు...

- మా గోస వర్ణణాతీతం....
- పంట దిగుబడి తగ్గింది.... అమ్ముకుందామంటే కొనే దిక్కేలేదు
- వానొస్తే టార్పాలిన్ కూడా ఇయ్యడం లేదు. క్వింటాలుకు 5 కిలోలు కోత పెడుతున్నారు
- రాజన్న జిల్లా నర్మాలలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎదుట భోరుమన్న రైతులు
- ఎల్లారెడ్డిపేటలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర మంత్రి
- వడ్ల పైసలన్నీ మిత్తీతోసహా కేంద్రమే ఇస్తోంది కదా?
- మరి వడ్ల కొనడానికి ఎందుకింత జాప్యం చేస్తున్నారు?
- 20 రోజులైనా వడ్ల పైసలియ్యక పోతే రైతులెట్లా బతకాలే?
- రైతుల కంట కన్నీరు కనబడటం లేదా?... గుండె రోదన వినబడటం లేదా?
- ప్రశ్నించిన రైతులపై కేసులు పెడతారా?
- వడ్ల కొనుగోలులోనూ రాజకీయ జోక్యం ఎక్కువైంది
- యుద్ధ ప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాల్సిందే
- తక్షణమే వడ్ల పైసలన్నీ రైతుల ఖాతాల్లో జమ చేయాలి
- అధికారులకు పూర్తి స్వేచ్ఛనిచ్చి కొనుగోళ్లు పూర్తి చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి చురకలంటించిన బండి సంజయ్
- గంభీరావుపేట మండలంలోని నర్మాలలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కమార్



**గంభీరావుపేట వెలుతురు మే 06:**
"సంజయ్ సారూ....మా బాధలు చూడటానికి ఈడకొచ్చిరు. ఎన్నని చెప్పమంటరు. మా గోస వర్ణణాతీతం. అప్పు పుడతలేదు...రైతు అని చెబితే పిల్లనిస్తలేరు... 32 క్వింటాలు రావాల్సిన పంట దిగుబడి తగ్గింది... ఈసారి 20 క్వింటాలలోపే దిగుబడి వచ్చింది. అవైనా అమ్ముకుందామని ఈడకొస్తే కొనే దిక్కేలేదు. వానొస్తే భయమైతది. గాలొస్తే భయమైతది. వడ్లపై కప్పుదామంటే నిన్నటిదాకా టార్పాలిన్ కూడా ఇయ్య లేదు...క్వింటాలుకు 5 కిలోలు కోత పెడుతున్నారు. ఇగ మమ్ముల్ని ఆదుకునేదెవరు?" రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎదుట రైతులు గోడు వెళ్లబోసుకున్న తీరిది. రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన బండి సంజయ్ కొద్దిసేపటి క్రితం ఐకేపీ సెంటర్ ను సందర్శించి వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సంజయ్ ను కలిసి తమ బాధలు చెప్పుకుంటూ వాపోయారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని తప్పుపట్టారు. వడ్ల పైసలన్ని కేంద్రమే చెల్లిస్తోందని, అయినా వడ్ల కొనుగోలును త్వరగా పూర్తి చేయకుండా జాప్యం చేయడమేందని ప్రశ్నించారు. రైతుల కన్నీళ్లు కనబడతలేవా? వాళ్ల గుండె రోదన వినబడటం లేదా? అని మండిపడ్డారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 500లకుపైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 45 రోజులు దాటినా ఇంతవరకు పూర్తిస్థాయిలో వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ రెండు జిల్లాల్లో 7 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం కూడా కొనలేదన్నారు. వడ్లను కొన్న తరువాత నెలరోజులైనా రైతుల ఖాతాల్లో పైసలు జమ చేయడం లేదని, ఇట్లయితే రైతులు బతికేదెలా? అని ప్రశ్నించారు. వడ్ల కొనుగోలులోనూ రాజకీయం జోక్యం ఎక్కువైందన్నారు. ప్రశ్నించిన వాళ్లపై కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతుంటే "నాతో ఏమీ కాదు... నా దగ్గర పైసల్లేవ్"అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. "అయినా వడ్ల కొనుగోలు పైసలన్నీ మిత్తీతోసహా కేంద్రమే చెల్లిస్తోంది. 10 ఏళ్లలో వడ్ల కొనుగోలు కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు చెల్లించింది. అయినా మీకు వచ్చిన ఇబ్బంది ఏంది? రైతులను ఎందుకు అరిగోస పెడుతున్నారు?"అని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలని, వెంట వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అట్లాగే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన వడ్లతోసహా ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కలిగించాలని కోరారు.



## చెట్ల కొమ్మలను వర్షాకాలం వచ్చే ముందే జాగ్రత్తగా తొలగించాలని డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మే 06:**
మంగళవారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ లోని దత్తానగర్, బగ్గీ ఖానా, వై యమ్ సి ఎ, మొదలైన ప్రాంతాలలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మేనేజర్ మహేశ్వరి తో కలిసి పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా వారు ఇక్కడైతే చెట్లు కొమ్మలు కింది ఉన్నాయో మరియు చెట్లు పడే అవకాశం ఉందో దాన్ని వర్షాకాలం వచ్చే ముందే ముందు జాగ్రత్తగా తొలగించాలని ఇట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ హాని కలగకుండా చూడాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, జైస్వాల్, జగదీష్, బిండియా, సుజాత అనూష కళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదివి రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థి ని సన్మానించి అభినందనలు తెలిపిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు వెలుతురు మే 06:**
రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ పరీక్షలో రాష్ట్రస్థాయి రెండవ ర్యాంకు సాధించిన మునుగోడు పట్టణానికి చెందిన జర్నలిస్టు దుబ్బ విజయభాస్కర్, రాద ల కుమారుడు దుబ్బ సాయి శ్రీ వర్షిత్.. దుబ్బ సాయి శ్రీ వర్షిత్ ను హైదరాబాదులోని తన నివాసంలో సన్మానించి అభినందనలు తెలిపిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

## తెలంగాణ కులగణను అనుసరించండి

- **మోడీకి ఖర్గే సుదీర్ఘ లేఖ**

**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
దేశవ్యాప్తంగా కులగణన జరపడానికి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అందరి అభిప్రాయాలతో ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ మేరకు ఆయన మోడీకి లేఖ రాశారు. దేశంలో మొట్టమొదటిసారిగా కులగణను తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ తెలంగాణ కులగణన నమూనాను అనుసరించాలని ఖర్గే లేఖలో మోడీ ప్రభుత్వాన్ని కోరారు. తుది కుల గణన నివేదికలో ఏదీ దాచిపెట్టవద్దని.. ప్రతి కులం యొక్క సామాజిక, ఆర్థిక డేటాను ప్రజలకు చేరువలో ఉంచాలి అని ఆయన మోడీ ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రిజర్వేషన్లకు సంబంధించిన విషయంపై కూడా ఖర్గే లేఖలో పేర్కొన్నారు. ఆగస్టు 1994 నుండి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడింది. అదే మాదిరిగా.. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలి అని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీ, ఓబిసి రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని కూడా రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించేందుకు కులగణన సర్వే ద్వారా స్పష్టమవుతుందని ఆయన లేఖలో తెలిపారు. ఈ కులగణన సర్వే ద్వారా ప్రైవేట్ విద్యా సంస్థల్లో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను అమలు చేయాల్సిన అవసరం నెలకొంటు–ంది అని ఖర్గే లేఖలో పేర్కొన్నారు. న్నత విద్యా శాఖకు గ్రాంట్ల డిమాండ్లపై మార్చి 25, 2025న సమర్పించిన 364వ నివేదికలో విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ– ఆర్టికల్ 15(5)ని అమలు చేయడానికి కొత్త చట్టాన్ని సిఫార్సు చేసిందని ఖర్గే పేర్కొన్నారు. సామాజిక న్యాయం అనే అంశాన్ని లేవనెత్తినందుకు ప్రధాని మోడీ, ఆయన సహచరులు కాంగ్రెస్‌పై దాడి చేశారు. అయినప్పటికీ మన రాజ్యాంగ ప్రవేశికలో ప్రతిజ్ఞ చేసినట్లు–గా ఆర్థిక న్యాయం, హోదా, అవకాశాల సమానత్వాన్ని నిర్ధారించడానికి కులగణన ఖచ్చితంగా అవసరం అని ఖర్గే నొక్కి చెప్పారు. మన సమాజంలో వెనుకబడిన అణగారిన వర్గాలకు వారి హక్కులను అందించే కులగణన వంటి పక్రియను నిర్వహించడం ఏవిధంగానూ విభజనగా పరిగణించకూడదు అని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

## మేం శాంతినే కోరుకుంటున్నాం

- **చర్చలు చేయాల్సి వస్తే ముందుకు వస్తాం**
- **కాదనుకుంటే యుద్ధానికైనా సిద్ధమే**
- **మరోమారు నోరు పారేసుకున్న బిలావల్**

**ఇస్లామాబాద్,మే6( వెలుతురు):**
పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకోవడంతో పాక్‌లో విమర్శ్వఎదురవుతున్నాయి. దీనిని తప్పించుకునేందుకు అక్కడి నేతలు రకరకాలగా వ్యాఖ్యలుచేస్తున్నారు. దీనిపై మొదట్లో నోరు పారేసుకున్న పాకిస్థాన్ విదేశాంగ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఇప్పుడుమాట మార్చారు. గతంలో సింధూనదిలో నీరు పారకుంటే రక్తం పారుతుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. తాజాగా ప్రతీకార చర్యలకు భారత్ సన్నద్ధమవుతున్న వేళ స్వరం మార్చిన ఆయన.. శాంతి చర్చలకు పాకిస్థాన్ సిద్ధంగానే ఉందని చెప్పాడు. అయితే, విధ్వంసం కావాలా? శాంతి కావాలో భారత్ నిర్ణయించుకోవాలంటూ మరోసారి విషం చిమ్మే ప్రయత్నమే చేశాడు. భారత్ శాంతి మార్గంలో వెళ్లాలని భావిస్తే.. పిడికిలి బిగించకుండా స్వేచ్ఛగా రానివ్వండి. కల్పితాలు కాకుండా వాస్తవాలతో రానివ్వండి. పొరుగువారిగా వారితో కూర్చొని నిజాలు మాట్లాడుదాం. అలా కాదనుకుంటే.. పాక్ ప్రజలను మోకరిల్లేలా చేయలేరని విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని బీరాలు పలికారు. పోరాటం చేసేందుకు పాక్ ప్రజలు సిద్ధమే. యుద్ధంపై ఇష్టంతో కాదు, స్వేచ్ఛపై ప్రేమతో మాత్రమేనని బిలావల్ భుట్టో పేర్కొన్నాడు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు, ఆర్థిక సాయం పాక్ అందించిందని పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలతో భుట్టో ఇటీవల ఏకీభవించాడు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనని అంగీకరించాడు. అయితే, అది ముగిసిన అధ్యాయమని.. అది తమ చరిత్రలో ఒక దురదృష్ట భాగమంటూ పేర్కొన్నాడు. ఉగ్రవాదానికి పాక్ బాధిత దేశమని, దాన్ని ఎన్నడూ ప్రోత్సహించలేదన్నాడు. మరోవైపు భారత్‌కు వ్యతిరేకంగా భద్రతా మండలిలో తీర్మానం చేయించాలన్న పాక్ యత్నాలు మరోసారి బెడిసికొట్టాయి. ఫలితంగా దాయాదికే సభ్య దేశాల నుంచి కఠిన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఉగ్రదాడికి పాల్పడిన వారు జవాబుదారీగా ఉండాలని తేల్చిచెప్పాయి. పహల్గాం దాడిలో లష్కరే తోయిబా పాత్రను ప్రశ్నించాయి. అంతేకాదు.. మతం ఆధారంగా అమాయకులను చంపడంపై ఆందోళన వ్యక్తంచేశాయి. భారత్‌తో ద్వైపాక్షిక చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించు కోవాలని పాకిస్థాన్‌కు చాలా దేశాలు ఇప్పటికే సలహా ఇచ్చాయి. అయితే వేటినీ ఖాతరు చేయకుండా యుద్ధ ప్రేలాపనలు పేలుతున్నారు.

# తుల్జా భవాని పండుగ భూక్యా రాధా రాజు నాయక్

## ఇందిరమ్మ కాలనీలో పాల్గొన్న కార్పొరేటర్ రవి నాయక్ రాజు నాయక్ మోహన్



**హనుమకొండ జిల్లా వెలుతురు మే 06:**
గోర్ బంజారా లు జరుపుకునే పండగలలో ఒకటైన తుల్జా భవాని పండుగ ప్రతి గోర్ బంజారా కుటుంబంలో ప్రతి సంవత్సరం వైశాఖ జేష్ట మాసంలో జరుపుకుంటారు మొదటగా తుల్జా భవానిని పాలతో శుద్ధి చేసి సాయంత్రం సమయంలో ముక్కులు చెల్లించుకుంటారు మరియు రాత్రంతా జాగారం చేసి ఆటపాటలతో తుల్జా భవానిని కొలుస్తారు ఇందులో భాగంగా హన్మకొండలోని గుండ్ల సింగారం ఇంద్రమ్మ కాలనీలో భూక్యా రాధా రాజు నాయక్ బిల్డర్ వారి ఇంటిలో ఈరోజు తుల్జా భవాని ఘనంగా జరుపుకున్నారు ఈ పండుగకు బంధువులు స్నేహితులను ఆహ్వానించి భోజనాలు వడ్డిస్తారు ఈ పండగ మన పూర్వీకుల నుండి సాంప్రదాయంగా జరుపుకుంటున్నారు గోరు బంజారాలు జరుపుకునే పండుగలలో అతి ముఖ్యమైన మైనదిగా భావిస్తారు తుల్జా భవాని దేవాలయము మరాఠీ అనే భవాని దేవతకు అంకితం చేయబడిన హిందూ దేవాలయం ఇది భారతదేశంలోని మహారాష్ట్రలోని ఉస్మానాబాద్ జిల్లాలోని తుల్జాపూర్ లో ఉంది ఇది 51వ శక్తి పీఠాలలో ఒకటిగా పరిగణించబడుతుంది ఇది సోలాపూర్ నుండి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది ఈ ఆలయానికి 11వ శతాబ్దం మరాఠీలోని బుద్ధ రుద్ర దేవాలయ నిర్మించిన ఆలయ పూజారి హక్కులను క్రమంగా మరాఠీ అయినా ది తుల్జా భవాని దేవిని వివిధ ప్రాంతాలలో తులజా త్వరిత ఏడుగురు అక్క చెల్లెల అవతారం పేర్లు తుల్జా మేరమా మరేమ అంబ కమలక్క అమలక అశోదర బలంగా ఈ ఏడుగురి లో ఒక అవతారంలో దూలంగా అని పిలుస్తారు ఈ దైవ కార్యక్రమానికి ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ క్రమశిక్షణ కమిటీ సభ్యులు లావుడియా పల్లవి రాజు నాయక్ రెండవ డివిజన్ కార్పొరేటర్ లావుడియా రవి భూక్యా సునీత మోహన్ నాయక్ భూక్యా మౌనిక మురళి మానస రవి బోడ బాలమణి రాజేందర్ మాలోతు అరుణ రవీందర్ ఝాన్సీ యాకుబ్ భద్రమ్మ రజిత కిరణ్ లకావత్ రాజ్ కుమార్ తిరుపతి నాయక్ సుమన్ నాయక్ బిక్షపతి మరియు కాలనీవాసులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు

# సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఆస్తులు వెల్లడి

## అత్యంత ధనవంతుడిగా ముందున్న జస్టిస్ విశ్వనాథన్




**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
సుప్రీం కోర్టు న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. ఈ మేరకు వెబ్‌సైట్‌లో తమ ఆస్తుల వివరాలను పొందుపరిచారు. రాజకీయనాయకులు ముఖ్యంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేయలేని పనిని వారు చేసి ఆదర్శంగా నిలిచారు. ఏప్రిల్ 1న జరిగిన సుప్రీంకోర్టు జడ్జెస్ ఫుల్ కోర్టు మీటింగ్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో న్యాయమూర్తులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించారు. సుప్రీం కోర్టులో మొత్తం 33 మంది న్యాయమూర్తులకు గాను 21 మంది జడ్జిలు తమ ఆస్తుల వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ క్రమంలో న్యాయమూర్తుల్లో అత్యంత ధనిక న్యాయమూర్తి జస్టిస్ కె.వి విశ్వనాథన్ అని లెక్కలు చెబుతున్నాయి. ఆయన తన ఆస్తుల వివరాలను సుప్రీం కోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. ఇంతకీ జస్టిస్ కెవి విశ్వనాథన్ ఆస్తులు ఎంత.. అలాగే మిగిలిన జస్టిస్‌ల ఆస్తుల వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ కె వి విశ్వనాథన్ సూపర్ రిచ్ అని తేలింది. సుదీర్ఘ కాలం న్యాయవాదిగా పనిచేసి అనంతరం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ విశ్వనాథన్ నియమితులయ్యారు. రూ.120 కోట్ల రూపాయలు పెట్టు–బడులు పెట్టడంతో పాటు గత పది ఏళ్లుగా రూ.91 కోట్ల రూపాయలు ఆదాయపన్ను చెల్లించారు జస్టిస్. సుప్రీంకోర్టులోని మొత్తం 33 మంది న్యాయమూర్తుల్లో నిన్న (సోమవారం) అర్ధరాత్రికి సుప్రీంకోర్టు వెబ్‌సైట్స్‌లో 21 మంది న్యాయమూర్తులు తమ తమ ఆస్తుల వివరాల వెల్లడించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ కన్నాకు బ్యాంక్ అకౌంట్లో రూ.55.75 లక్షల ఫిక్స్డ్ డిపాజిట్స్ , పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ. 1.06 కోట్లు– ఉన్నాయి. సౌత్ ఢిల్లీలో టూ బెడ్ రూమ్ డీడీఏ ఫ్లాట్‌తో పాటు– కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్ సంజీవ్ కన్నాకు ఉంది. కూతురితో కలిసి మరో ఫోర్ బెడ్ రూమ్ ఫ్లాట్లో 56శాతం వాటాదారుడుగా సంజీవ్ కన్నా ఉన్నారు.దతదుపరి సీజేఐ కానున్న జస్టిస్ గవాయ్‌కు బ్యాంక్ అకౌంట్లో రూ.19.63 లక్షలు, పీపీఎఫ్ అకౌంట్‌లో రూ.6.59 లక్షలు ఉన్నాయి. జస్టిస్ గవాయ్‌కు అమరావతి నాగపూర్‌లో వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతిలో వారసత్వంగా వచ్చిన ఇల్లుతో పాటు– ముంబై, ఢిల్లీలో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. అలాగే జస్టిస్ ఓకాకు పీపీఎఫ్‌లో రూ.92.35 లక్షలు, ఫిక్స్ డిపాజిట్ల రూపంలో రూ.21.76 లక్షలు ఉన్నాయి. జస్టిస్ ఓకాకు మారుతి బలేనో కారు ఉండగా దానిపై రూ.5.1 లక్షల రుణం ఉంది.

# సిబిఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్ కొనసాగింపు

- **మరో ఏడాది పదవీకాలం పొడిగింపు**

**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ చీఫ్‌గా ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ మరో ఏడాదిపాటు కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు డిఓపిటి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనుంది. ఈనెల 25తో ప్రవీణ్ సూద్ రెండేళ్ల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో ఆయన పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2023, మే 25న సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. కాగా నూతన డైరెక్టర్ నియామకంపై సెలెక్ట్ కమిటీ– సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. నూతన సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కుడిన సెలెక్ట్ కమిటీ సమావేశమైంది. తదుపరి డైరెక్టర్ కోసం పలువురు పేర్లతో డివోపిటి జాబితాను రూపొందించింది. ప్రతిపాదిత అధికారుల పేర్లపై సెలెక్ట్ కమిటీలో చర్చ జరిగింది. ఏకాభిప్రాయం





కుదరకపోవడంతో ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ– ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు– సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. సీబీఐ డైరెక్టర్ పదవీకాలం సాధారణంగా రెండేళ్లు ఉంటుంది. అయితే, ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని ఐదేళ్ల వరకు పొడిగించే వెసులుబాటు చట్టంలో ఉంది. కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్, గతంలో ఆ రాష్ట్ర డీజీపీగా పనిచేశారు. సుబోధ్ కుమార్ జైస్వాల్ స్థానంలో ఆయన 2023 మే నెలలో సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

# దేవాలయాల్లో వరుస ఘటనలు

- **భక్తులు ప్రశాంతంగా దర్శించుకునే ఏర్పాట్లు**
- **అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,మే6( వెలుతురు):**
ఇటీవలి వరుస ఘటనల నేపథ్యంలో సచివాలయంలో దేవాదాయ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు .వివిధ దేవాలయాల్లో జరిగిన దుర్ఘటనలపై చర్చించారు. భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనం, ఉత్సవాల సమయంలో రద్దీ నియంత్రణ ఏర్పాట్ల పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తిరుమల తిరుపతి, సింహాచలం సంఘటనలపై ఇప్పటికే అధికారులపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. సింహచలం ఘటనకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ఏడుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు– వేసింది. ఇటీవల విశాఖపట్నం జిల్లాలోని సింహాచలం వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అపశృతి చోటు–చేసుకున్న విషయం తెలిసిందే. ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా రూ.300 టికెట్ క్యూలైన్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోని సిమెంట్ గోడ కూలిపోయింది. ఈ దుర్ఘటనలో



ఎనిమిది మంది భక్తులు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీనికి బాధ్యులు ఎవరన్న దానిపై ఐఏఎస్ అధికారి సురేష్ కుమార్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. విచారించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో సింహాచలం ఘటనా స్థలంకు వెళ్లి పరిశీలించి త్రిసభ్య కమిటీ–.. మొత్తం 19 మందిని విచారించి ఈ ఘటనకు బాధ్యులెవరో తేల్చి.. మొత్తం ఆరు పేజీలతో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. వెంటనే యాక్షన్‌లోకి దిగిన ప్రభుత్వం ఏడుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు– వేసింది.

## అప్పు పుట్టడం లేదని సీఎం రేవంత్ మాట్లాడటం వెనుక

# అంతర్యం ఏంటి ?



(మొదటి పేజీ తరువాయి..)

- పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డికి అప్పు గురించి తెలియదా ?
- అధికారం కోసం అనేకమైన హామీలు ఇచ్చి... ఇప్పుడు హామీలు అమలు చేయలేక తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు
- చెడు చెవిలో చెప్పాలి.. మంచి నలుగురిలో చెప్పాలని అని చెప్పిన రేవంత్... రాష్ట్ర పరువు తీస్తున్నారు
- ప్రజలను ఉద్యోగస్తుల మీదకు ఎందుకు ఉసికోల్పోతున్నావు
- బి ట్యాక్స్ లు తీసుకొని బిల్లులు చెల్లిస్తున్నారు
- ప్రజల మధ్య భయాందోళనలు సృష్టిస్తున్నారు
- రేవంత్ రెడ్డి మాటల మతలబు మాకు తెలుసు
- ఖరీఫ్ లో ఇవ్వాల్సిన రైతుబంధు ఇవ్వలేదు
- యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి.. బడా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించారు
- ఉద్యోగస్తుల బిల్లులు ఎందుకు గుర్తుకు రావడం లేదు
- మహాలక్ష్మి పథకం ఎత్తేసేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది
- రేషన్ కార్డ్ లు ఎత్తేసే ప్రయత్నం చేస్తున్నారు
- ముఖ్యమంత్రి సింపతీ కోసం ప్రయత్నం చేస్తున్నారు
- ఫీజు రియాంబర్స్ మెంట్ సకాలంలో చెల్లించకపోవడం తో పరీక్షలు వాయిదా వేసే దుస్థితి నెలకొంది
- రబీ సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా అందలేదు

దివాళా తీసిందని మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అందరినీ భయపెడు తున్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది, ఉద్యోగుల వేతనాలకు కూడా అప్పులు చేయాల్సి వస్తోంది. కొత్త అప్పులు పుట్టడం కష్టంగా ఉంది, ఈ అప్పుల క్యాన్సరును బయట పెట్టకుండా ఇంకా ఎన్నాళ్లు కప్పిపుచ్చాలి అంటూ సీఎం రేవంత్ రెడ్డి గారు గతంలోనూ మాట్లాడారు. ఇపుడు తాజాగా అదే పాట పాడారు. సీఎం రేవంత్ రెడ్డి గారు ఇటీవల పలు సందర్భాల్లో వివిధ వేదికలపై అప్పులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడిన తీరునుబట్టి చూస్తే కొన్ని సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ సర్కార్ మంగళం పాడడం ఖాయమనిపిస్తోంది.

### 3. కొన్ని సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం డిసైడ్ అయిందా?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు, అప్పులు పుట్టడం లేదు, ఈ అప్పుల, ఆర్థిక సంక్షోభ క్యాన్సరును బయటపెట్టొద్దా అంటూ ముఖ్యమంత్రి గారు గతంలో కూడా మాట్లాడారు. ఇపుడు నన్ను కోసినా పెసల్లేవు అంటూ తమ బకాయిల కోసం డిమాండ్ చేస్తున్న ఉద్యోగులను భయపెట్టారు. ఉద్యోగులకు రూ.పది వేల కోట్ల బకాయిలు చెల్లించాలంటే ఉచిత కరెంటు, వృద్ధాప్య పింఛను వంటి ఏ పథకాలను ఎత్తివేయాలో చెప్పండంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం చూస్తుంటే, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన కొన్ని హామీలను ఎగ్గొట్టినట్టే అని స్పష్టమవుతోంది. వరుసగా రెండో బడ్జెటులో కూడా కొన్ని స్కీములకు నిధులు కేటాయించకపోవడం, మరి కొన్నింటికి అరకొర నిధులు కేటాయించడంతో ప్రభుత్వం ఆ స్కీములకు మంగళం పాడడం ఖాయమనిపిస్తోంది.

### 4. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టనున్న మేనిఫెస్టో హామీలోని సంక్షేమ పథకాలివేనా

1. మహాలక్ష్మీ– మహిళలకు నెలకు రెండున్నర వేల సాయం.
2. రైతు భరోసాలోని మూడు హామీలకు సరిపోను నిధుల్లేవు.. ఎకరానికి రూ12 వేల ఆర్థిక సాయం, రైతు కూలీలకు ఏటా రూ. 12వేలు, వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ అనే మూడు హామీలకు మంగళం పాడేస్తారేమో.
3. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇపుడు కేటాయించిన నిధులు సరిపోవు.. కాంగ్రెస్ క్యాడరుకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి మిగిలిన వారికి ఎగ్గొడుతారేమో
4. యువవికాసం – విద్యార్థులకు రూ.ఐదు లక్షల విద్యా భరోసా కార్డుకు నిధులేవీ.
5. చేయూత – పెన్షన్ల పెంపునకు నిధులేవీ. ఈ గ్యారంటీ కార్డు హామీలు కాకుండా ఇంకా నిరుద్యోగ భృతి, పది పంటలకు బోనస్, అంబేద్కర్ అభయ హస్తం వంటి పథకాలకు వరుసగా రెండో బడ్జెటులో కూడా నిధుల ప్రస్తావనే లేదు. ఆడపడుచులకు తులం బంగారం, స్కూటీలు, ఆటో డ్రైవర్లకు ఏటా రూ. 12 వేలు ఇస్తామన్న హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ విస్మరించింది. ఈ పథకాలన్నీ అమలు చేయకుండా ఎత్తేసేందుకే ముఖ్యమంత్రి గారు ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ మాట్లాడుతున్నారనే భయాందోళనలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

### 5. రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని తెలిసీ కూడా అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీనే దోషి, ద్రోహి.

రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందన్న విషయం తమకు ఆనాడు తెలియదని, ఆదాయం రూ.మూడు లక్షల కోట్లు. అప్పు కూడా రూ.మూడు లక్షల కోట్లు ఉందనకున్నామంటూ సీఎం రేవంత్ రెడ్డి నిన్న పోలీసులకు అవార్డు కార్యక్రమంలో మాట్లాడడం పచ్చి మోసం. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల పాలైందని ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ నేతలు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి సీనియర్ నేతలు తరచుగా ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు రూ.ఐదు లక్షల 29 వేల కోట్ల మేర అప్పులు చేసిందని పిసిసి చీఫ్ గా రేవంత్ రెడ్డి, సిఎల్పి నేతగా భట్టి విక్రమార్క 2023 ఫిబ్రవరి 15న హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఖమ్మం జిల్లా భద్రాచలం అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన కాంగ్రెస్ మీటింగులో ఆరోపించారు. అపుడు వీరిద్దరు కలిసి పాదయాత్ర చేశారు. అంటే రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిసీ కూడా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో అలవికాని హామీలు ఇచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి స్థాయి అవగాహన ఉండి అలవికాని హామీలు ఇచ్చి, ఇపుడు రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందంటూ, హామీలను అమలు చేయలేమంటూ మాట్లాడడం ముమ్మాటికీ మోసం చేయడమే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీయడానికి గత బీఆర్ఎస్ సర్కార్ ఎంత వరకు కారణమో, రాష్ట్రం అప్పుల పాలైందని తెలిసీ కూడా అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా దోషినే, ద్రోహినే. ఇది ఉద్దేశపూరిత దగా, ఇది కుట్రపూరితం. సామాన్యులను నమ్మించి గొంతు కోయడమే. ఈ వాస్తవాలు తెలిస్తే ప్రజలు కాంగ్రెస్ నేతలపై తిరగబడడం ఖాయం.

### 6. వివిధ వర్గాలకు రూ.వేల కోట్లు బాకీ పడిన బకాయిల సర్కారు

అన్నదాతలకు రైతు భరోసా, విద్యార్థుల ఫీజురీఎంబర్స్ మెంటు, రోగులు, ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ స్కీములతోపాటు .. ఉద్యోగులు, చిన్న కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కారు ఆ యా వర్గాలకు అన్యాయం చేస్తోంది. రబీ సీజను రైతు భరోసా సగం మందికి కూడా అందలేదు. దాంతో రైతులు పంటపెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. ఫీజు రీఎంబర్స్ మెంటు బకాయిలు చెల్లించకపోవడంతో డిగ్రీ, పిజీ వార్షిక పరీక్షలు సకాలంలో జరగకపోవడంతో ఇటు విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు ఇబ్బందుల పాలవుతున్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలను పెండింగులో పెట్టడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. కంట్రాక్టర్లు, మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతో వారంతా అప్పుల్లో కూరుకుపోతున్నారు.

### 7. బిల్లుల చెల్లింపులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

ఇలా రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన నిధులు రూ.వేల కోట్లలో ఉండడంతో, ఈ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం ఎలా తీర్చుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వివిధ వర్గాలకు ప్రభుత్వం ఎంత మేరకు బాకీ పడిందో శ్వేత పత్రం విడుదల చేస్తూ ఆ నిధులను ఎప్పటిలోగా చెల్లిస్తుందో స్పష్టత ఇవ్వాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే నాటికి ఎన్ని వేల కోట్ల పెండింగు బిల్లులు ఉన్నాయి. వాటిలో ఈ 15 నెలల కాలంలో చెల్లించిన బిల్లులు ఎన్ని, ఇప్పటి వరకు రాష్ట్ర సర్కారు బడా కాంట్రాక్టర్లకు ఎన్ని వేల కోట్లు చెల్లించిందో, ఎవరెవరికి ఎంత మొత్తంలో చెల్లించారో, అలాగే చిన్న కాంట్రాక్టర్లకు, మాజీ సర్పంచులు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగు బకాయిలు ఎన్ని ఉన్నాయి, కాంగ్రెస్ ఎంత చెల్లించింది. ఫీజురీ ఎంబర్స్ మెంటు, ఆరోగ్య శ్రీ వంటి పథకాలకు ఇవ్వాల్సిన బకాయిల వివరాలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి.

### 8. రబీ సీజను ముగుస్తున్నా రైతు భరోసా ఇవ్వరా

సీజనుకు ఎకరానికి రూ.ఆరు వేల చొప్పున అన్నదాతలకు పంటపెట్టబడి సాయం అందించేలా రైతుభరోసా స్కీమును ఖరారు చేస్తున్నట్లు, 2025 రిపబ్లిక్ డే నుంచి అమలు ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ సర్కారు ప్రకటించింది. మార్చి నెలాఖరు వరకు రైతుభరోసా డబ్బులు అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ముఖ్యమంత్రి, మంత్రులు నమ్మబలికారు. మార్చి నెల దాటింది. ఏప్రిల్ నెలాఖరు వచ్చింది. రబీ సీజను ముగుస్తోంది. మరి రైతుభరోసా డబ్బులు ఇప్పటి వరకు నాలుగు ఎకరాలకు వరకు మాత్రమే ఇచ్చారు. ఈ యాసంగి సీజనులో రైతుభరోసా కింద రూ.తొమ్మిది వేల కోట్లు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు సగం మందికి మాత్రమే రైతు భరోసా అందినట్లు సమాచారం. మరి మిగిలిన సగం రైతభరోసా డబ్బులు ఎప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమవుతాయో ప్రభుత్వ పెద్దలు స్పష్టత ఇవ్వకపోవడం దారుణం. గత ఖరీఫ్ సీజను రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ సర్కారు ఈ ఖరీఫ్ సీజను కూడా ఎగ్గొడుతుందేమో అనే అనుమానాలు అన్నదాతల్లో వ్యక్తమవుతున్నాయి.

### 9. రైతు భరోసా కోసం తెచ్చిన రూ.10వేల కోట్ల అప్పులో సగం బడా కాంట్రాక్టర్లకు చెల్లించారు

రైతు భరోసా స్కీములను అమలు చేసేందుకు ప్రభుత్వం వద్ద నిధులు లేకపోవడంతో హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూములను టీజీఐఐసీకి బదలాయించి, ఆ భూములను కుదువ పెట్టి, రూ.10 వేల కోట్లను సమీకరించింది. రబీ సీజన్‌లో రైతు భరోసాకు రూ.తొమ్మిది వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని .. మిగిలిన వెయ్యి కోట్లను ఇతర పనులకు ఖర్చు చేస్తామని ప్రభుత్వ పెద్దలే చెప్పారు. మరి రిపబ్లిక్ డే దాటి మూడు నెలలు గడిచినా ఇప్పటికీ నాలుగు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతుభరోసా జమ చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఇద్దరూ కలిసి రైతు భరోసా కోసం అప్పు తెచ్చిన రూ.పది వేల కోట్లలో సగానికిపైగా బడా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించారని సమాచారం. అంటే రైతుల పేరు చెప్పి చేసిన అప్పును కూడా సర్కారీ పెద్దలు బడా కాంట్రాక్టర్లకు దారపోశారు. మరి ఈ సర్కారును రైతు వ్యతిరేకి అనక మరేమనాలి.

### 10. రూ.వేల ఫీజు రీఎంబర్సుమెంటు బకాయిలు కోట్లు తక్షణమే చెల్లించాలి. విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు ఆటలాడుకోవడం సరికాదు

గత మూడేళ్లుగా ఫీజు ఎంబర్స్ మెంటును రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో ప్రైవేటు కాలేజీలకు చెల్లించకపోవడం ఆ బకాయిలు ఇపుడు రూ. ఏడు వేల కోట్లను దాటాయి. ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్ మెంటు బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలు వార్షిక పరీక్షలు నిర్వహించడానికి సహకరించడం లేదు. దాంతో కాకతీయ, మహాత్మాగాంధీ, తెలంగాణ, పాలమూరు వంటి యూనివర్శిటీల డిగ్రీ పరీక్షలను వాయిదా వేశారు. రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థులకు రూ. ఏడు వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించేందుకు తాత్సారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కక్కుర్తి కోసం బడా కాంట్రాక్టర్లకు మాత్రం వేల కోట్ల రూపాయల బిల్లులను చెల్లిస్తోంది.

### 11. విద్యాశాఖను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి ఫీజు రీఎంబర్స్ మెంటు సమస్యను పరిష్కరించలేకపోవడం సిగ్గుచేటు

తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు చాలా కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రాలు ఇచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వంనుంచి రాకపోవడంతో తాము కళాశాలలు నడిపించే పరిస్థితుల్లో లేమని వారు ప్రభుత్వానికి తమ ఆవేదనను గతంలోనే పలుసార్లు తెలిపారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం, సీఎం రేవంత్ రెడ్డి గారే విద్యాశాఖను చూస్తున్నప్పటికీ ఫీజు రీఎంబర్స్ మెంటు సమస్యను పరిష్కరించలేకపోవడం సిగ్గుచేటు. ఈ పరిస్థితిపై సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలి. ఫీజు రీఎంబర్స్ మెంటు బకాయిలను చెల్లించి, పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలి. కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల టీసీలు, మెమోలు జారీ చేయకుండా నిలిపివేసే పరిస్థితులు కూడా రానీయకుండా చూడాల్సిన బాధ్యత విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి గారిదే.

### 12. మాజీ సర్పంచుల బిల్లులు ఏడాది దాటినా ఇంకా పెండింగులోనే.. 20 శాతం కమిషన్లు ఇస్తేనా బిల్లులా

అసెంబ్లీకి ఎన్నికలు జరిగి బీఆర్ఎస్ సర్కారు పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 16 నెలలు దాటింది. సర్పంచుల పదవీకాలం ముగిసి ఏడాది దాటింది. అయినా మాజీ సర్పుంచులు చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇంకా విడుదల కాలేదు. తాము చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఏడాదికి పైగా ఇబ్బందులు పడుతున్న మాజీ సర్పంచులు పలు సందర్భాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. తమ బిల్లులను వెంటనే చెల్లించాలని సిఎం రేవంత్ రెడ్డి గారిని, గవర్నరు గారిని కూడా కలిసి వినతి పత్రమిచ్చినప్పటికీ ఫలితం లేకపోవడం బాధాకరం. ఇరవై శాతం కమిషన్లు ఇస్తే తప్ప ఆర్థిక శాఖ బిల్లులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. బహుశా ఈ మాజీ సర్పంచులు 20 శాతం కమిషన్లు ఇచ్చుకోలేకపోవడం వల్లే బిల్లులు విడుదల కావడం లేదేమో అనే అనుమానాలున్నాయి. వెయ్యి కోట్లకు పైగా ఉన్న పెండింగు బిల్లులను క్లియర్ చేసేందుకు 20 శాతం కమిషన్ అంటే రూ.200 కోట్లు ముడుపులు చెల్లించాలేమో.

### 13. ఏకంగా సెక్రటేరియటులోనే 20 శాతం కమిషన్లకు వ్యతిరేకంగా చిన్న కాంట్రాక్టర్ల నిరసన

రాష్ట్ర వ్యాప్తంగా R&B, పంచాయతీరాజ్ మున్సిపల్ తదితర శాఖల్లో 10 లక్షల లోపు పనులు చేసిన కాంట్రాక్టర్లు సుమారు ఆరు వేల మంది ఉన్నారు. ఈ కాంట్రాక్టర్లందరి బిల్లులు అన్నీ కలిపి రూ.500 కోట్లకు పైగా ఉంటాయి. తమ బిల్లులు చెల్లించాలని వీరంతా ఇదివరకే మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్కలను కలిసారు. సివిల్ కాంట్రాక్టు పనులు చేసి మూడేళ్లవుతున్నప్పటికీ బిల్లులు రాక అప్పుల పాలయ్యామని, వెంటనే బిల్లులు విడుదల చేయకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. గత మార్చి నెల 08న ఈ చిన్న కాంట్రాక్టర్లు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రం ఇద్దామని సెక్రటేరియటుకు వస్తే, భట్టి వారిని కలవకుండా తప్పించుకుని పారిపోయారు. దాంతో వారంతా సెక్రటేరియటులో బిల్లులను రిలీజ్ చేయడానికి 20 శాతం కమిషన్లు తీసుకుంటోందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ప్రభుత్వం కమిషన్ల కక్కుర్తితో బడా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించి చిన్న కాంట్రాక్టర్లకు అన్యాయం చేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

గత 2025 జనవరి 09న GHMC ప్రధాన కార్యాలయం వద్ద GHMC పరిధిలో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లు కాంట్రాక్టర్లు వారికి రావాల్సిన రూ.1100 కోట్ల బిల్లుల బకాయిలు చెల్లించాలని నిరసన ప్రదర్శన చేసారు. అందులో ఇద్దరు ఇంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారు. తోటి కాంట్రాక్టర్లు అప్రమత్తవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఏడాదిగా రూ.1100 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయంపై మాట్లాడేందుకూ కమిషనర్ సమయమివ్వడం లేదని ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు ఆరోపించారు.

### 14. ఉద్యోగులకు వేల కోట్లు బాకీ పడిన సర్కార్ ... చెల్లించేది ఎప్పుడో మరి?

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను 2025 మార్చి ఏడో తేదీన కలిసి తమకు రావాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని నిలదీశారు. ఉద్యోగుల జీపీఎఫ్, లీవ్ సరెండర్, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్, ఆర్జిత సెలవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీజీఎల్ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ లాంటి బిల్లులు కలిపి మొత్తం రూ.8 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయి. ఇవి కాకుండా సీపీఎస్ ఉద్యోగులకు సంబంధించిన మరో రూ.2 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెండింగ్ డీఏలు, డీఆర్‌లు ఇవ్వకుండా ఎన్నాళ్లు కాలయాపన చేస్తారని పెన్షనర్లు (రిటైర్డు ఉద్యోగులు) కాంగ్రెస్ సర్కారుని ప్రశ్నిస్తున్నారు.

(ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు10%, యూపీఎస్ ఉద్యోగులకు 14%వాటాను కూడా చెల్లించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3.6లక్షల మంది ప్రభుత్వఉద్యోగులున్నారు. వీరంతా పెండింగ్ బిల్లుల బాధితులే. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో జిల్లా పరిషత్ టీచర్ల జీపీఎఫ్ రూపాయి కూడా విడుదల కాలేదు. గతంలో పెండింగ్ బిల్లులను ట్రెజరీలో సమర్పించిన 24 గంటల్లోనే ఆ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేది. కానీ, ఇప్పుడు కండ్లు కాయలు కాసేలా వేచిచూడాల్సి వస్తున్నది.)

### 15. ప్రతినెలా విధిగా ఆరోగ్య శ్రీ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వ హామీ ... దాంతో సేవలందిస్తున్న నెట్ వర్క్ ఆసుపత్రులు.

తెలంగాణ వ్యాప్తంగా 2025 జనవరి 10 నుంచి పది రోజుల పాటు నిలిచిపోయిన రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు ఆ తర్వాత జనవరి 20 నుంచి పునఃప్రారంభ మయ్యాయి. ప్రతినెలా విధిగా ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, ఐదారు నెలల్లో బకాయులను పూర్తిగా చెల్లిస్తామని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, హామీ ఇవ్వడంతో ఆసుపత్రుల యాజమాన్యాలు దిగివచ్చాయి. దంత వైద్యశాలలకు సంబంధించి పెండింగులో ఉన్న 18 నెలల బకాయిలను కూడా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇచ్చిన హామీ మేరకు జూన్ నెలాఖరు నాటికి ఆరోగ్య శ్రీ బకాయిలను పూర్తిగా చెల్లించకపోతే మళ్లీ ఆసుపత్రులు తమ సేవలను నిలిపివేసే ప్రమాదముంది.

### 16. వివిధ వర్గాల బకాయిలేమో పెండింగులో పెడతారా, కమిషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లులేమో వెంటనే చెల్లిస్తారా

అన్నదాతలకు రైతుభరోసా రూ.ఐదు వేల కోట్లు ... విద్యార్థుల ఫీజురీఎంబర్స్ మెంటు రూ. ఏడు వేల కోట్లు ... ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ. 10వేల కోట్లు ... చిన్నకాంట్రాక్టర్లకు రూ. 15 వందల కోట్లు మాజీ సర్పంచులకు రూ.వెయ్యి కోట్లు ... ఇంకా ఆరోగ్యశ్రీ స్కీము బకాయిలు ఇలా వివిధ వర్గాలకు ఇవ్వాల్సన నిధులను కాంగ్రెస్ సర్కారు సకాలంలో ఇవ్వకపోవడంతో సంబంధిత వర్గాలన్నీ తీవ్ర ఇబ్బందులకు, ఆర్థిక ఇక్కట్లకు గురువు తున్నాయి. ఇలాంటి వర్గాలను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ సర్కారు బాధ్యతలను విస్మరించి 20 నుంచి 30 శాతం కమిషన్ల కక్కుర్తి కోసం బడా కాంట్రాక్టర్లు రూ.వేల కోట్ల బిల్లులను విడుదల చేస్తుండడం సిగ్గుచేటు. కాకులను కొట్టి గద్దలకు పెట్టే విధానాన్ని కాంగ్రెస్ సర్కారు విడనాడాలి. తక్షణమే వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయాలి.

### 17. ఆర్థిక ఎమర్జెన్సీ విధించడం ద్వారా హామీలను ఎగ్గొట్టాలనుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి

ఉద్యోగులు ఎవరి మీద యుద్ధం ప్రకటిస్తారు, తమకు జీతాలు చెల్లిస్తున్న ప్రజల మీదనా, ప్రభుత్వంలో ఉద్యోగులు భాగం కాదా అని మాట్లాడడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి గారే ఉద్యోగులపై యుద్ధం ప్రకటించారు. ఉద్యోగులు ఇపుడు సమయస్ఫూర్తితో వ్యవహరించాలని సమరం చేయడం కాదన్న సీఎం రేవంత్ రెడ్డి గారే, ఉద్యోగులతో సమరం చేయకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించాలి. సీఎం రేవంత్ రెడ్డి బెదిరింపు ధోరణిలో మాట్లాడిన తీరు చూస్తుంటే రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ విధించాలని చూస్తున్నట్టుగా ఉంది. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టడానికి ఆర్థిక ఎమర్జెన్సీ విధించడం ఒక్కటే పరిష్కారమన్నట్టుగా కాంగ్రెస్ సర్కారు ఆలోచనలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇందిరమ్మ పాలన అంటే ప్రజలు సంక్షేమ పథకాలు అమలు చేస్తారేమో అని భ్రమపడ్డారు. కానీ ఇందిరాగాంధీ పేటెంట్ అయిన ఎమర్జెన్సీని తెలంగాణలో విధించడం ద్వారా ఇందిరమ్మ పాలన తెస్తారని ప్రజలు కలలో కూడా ఊహించలేదు.

### 18. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఇచ్చేందుకు రూ.వేల కోట్ల నిధులు ఉంటాయి, కానీ ఇచ్చిన హామీలకు నిధులు ఉండవీ సీఎం గారు

ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి తన సొంత పాలమూరు జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఇలా మొత్తం కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మీటింగులు జరుగుతాయంటున్నారు. పాలమూరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ అసెంబ్లీ సెగ్మెంట్లలో అభివృద్ధి పనులు అడిగితే వారికి ఎటా రూ.100 కోట్ల చొప్పున వచ్చే మూడేళ్లు ఇస్తానని మాటిచ్చారట. అంటే ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న 83 మంది ఎమ్మెల్యేలకు ఏటా రూ.8,300 కోట్లు ఇవ్వడానికి ఉన్న నిధులు మరి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి ఎందుకులేవు. అంటే రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలకు ఇవ్వకుండా ప్రభుత్వ ధనాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కమిషన్ల రూపంలో దోచిపెట్టాలనేది సీఎం రేవంత్ రెడ్డి గారి అసలు అజెండా అని అర్థమవుతోంది. అందుకే రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నదని దివాళా పాట పాడుతున్నారు సీఎం గారు.

### 19. పాలన చేతకాకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలే కానీ, ఇచ్చిన హామీలను ఎగ్గొడితే జనం తిరగబడడం ఖాయం.

రాష్ట్రం ఆర్థికంగా దెబ్బతిన్నదని, కొత్తగా అప్పులు పుట్టడం లేదంటూ ఇంకా సీఎం రేవంత్ రెడ్డి దివాళా పాటలు పాడడం సరికాదు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని వివిధ వర్గాలకు ఇవ్వాల్సిన బకాయిలను ఎగ్గొట్టేందుకు ఆర్థిక ఎమర్జెన్సీ విధిస్తామంటే సహించేది లేదు. పాలన చేతకాకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేసి తాజాగా ప్రజాతీర్పును కోరాలి. ఇలా సిఎం రేవంత్ రెడ్డి పదే పదే ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిందని మాట్లాడుతూ అన్ని లెక్కలు ప్రజలకు వివరిస్తానంటున్న సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే అసెంబ్లీని సమావేశపరిచి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై లోతుగా చర్చించాలి. ఆదాయం, అప్పులు, బకాయిలు, అమలు చేయదలిచిన పథకాలు, ఎగ్గొట్టదలచుకున్న స్కీముల వివరాలతో కాంగ్రెస్ సర్కారు తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రైతుభరోసా అందరికీ ఇవ్వకపోయినా,

## రేవంత్ రెడ్డిని కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి



**హైదరాబాద్,మే6( వెలుతురు):**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని స్విట్జర్లాండ్ రాయబారి శ్రీమతి మాయా తిస్సాఫీ మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన ఆమె సిఎను ఆయన నివాసంలో కలిసారు. ఈసందర్భంగా సిఎం ఆమెకు శాలువా కప్పి మెమెంటో బహుకరించారు. ఇక్కడ అందాల పోటీలు నిర్వహించడంపై అభినందించారు.

## భారత్-బ్రిటన్ మధ్య వాణిజ్య ఒప్పందం

- చారిత్రాత్మక ఒప్పందపై మోడీ హర్షం



**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
భారత్-బ్రిటన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఇరు దేశాలు ఎంతో కాలంగా ఎదురుచూస్తోన్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఎట్టకేలకు కుదిరింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాలు సంతకం చేశాయి. ఈ విషయాన్ని ప్రధాని మోడీ స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసిన మోడీ.. భారత్-బ్రిటన్ మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదరడంపై హర్షం వ్యక్తం చేశారు. భారత్-బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విజయవంతంగా కుదిరింది. ఈ అగ్రిమెంట్ రెండు దేశాలకు లాభదాయకం. బ్రిటన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం చారిత్రాత్మక మైలురాయి. ఇది మా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పెంచుతుంది. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టు-బడి, వృద్ధి, ఉద్యోగ సృష్టి, ఆవిష్కరణలను ఉత్ప్రేరకపరుస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## మనీలాండరింగ్ కేసులో భారతీయ బిలియనీర్‌కు ఐదేళ్ల జైలు




**దుబాయ్,మే6( వెలుతురు):**
మనీలాండరింగ్ కేసులో దుబాయ్‌లో నివసిస్తున్న భారతీయ బిలియనీర్ బల్విందర్ సింగ్ సాహ్నికి అక్కడి కోర్టు ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించింది. షెల్ కంపెనీల నెట్‌వర్క్ ద్వారా మిలియన్ దిర్హామ్‌లను లాండరింగ్, అనుమానస్పద లావాదేవీలకు పాల్పడినందకు బల్విందర్‌కు ఈ శిక్షపడింది. అంతేకాక.. ఈ ప్రముఖ వ్యాపారవేత్తకు 5లక్షల ఆఊఉ (రూ.1.14 కోట్లు-)తో పాటు- 150 మిలియన్ ఆఊఉ(రూ.344 కోట్లు-) జరిమానా విధించింది. ఈ శిక్షా కాలం పూర్తయిన తర్వాత దేశం వదిలి పోవాలని కోర్టు ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో సాహ్నితో పాటు-.. అతని కొడుకుతో కలిపి మరో 32 మంది ఉన్నట్లు- తెలుస్తోంది. ఇందులో కొందరు తప్పించుకుని తిరుగుతున్నట్లు- సమాచారం.

## బలూచిలో భారీ పేలుడు

- ఏడుగురు పాక్ జవాన్ల మృతి

**ఇస్లామాబాద్,మే6( వెలుతురు):**



పాకిస్థాన్ లోని బలూచిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. దక్షిణ బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పాకిస్తాన్ ఆర్మీ వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని దుండగులు భారీ ఐఈడీ బాంబ్‌ను పేల్చారు. ఈ ఘటనలో ఏడుగురు పాక్ జవాన్లు మృతి చెందగా.. మరికొందరు సైనికులు తీవ్రంగా గాయపడ్డారని వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. ఈ దాడికి ఇంకా ఏ సంస్థ బాధ్యత వహించలేదు. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు మొదలుపెట్టారు. ఏప్రిల్ 15న బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో పోలీసు ట్రక్కును లక్ష్యంగా చేసుకుని భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడులో పేలుడులో ముగ్గురు వ్యక్తులు మరణించగా, 19 మంది గాయపడ్డారు. ఈ ఘటన మురవకముందే మరోసారి ఆర్మీ వాహనమే లక్ష్యంగా అలాంటి తరహా దాడే జరిగింది. ఈ ఘటనపై పాక్ ఆర్మీ విచారణ మొదలుపెట్టింది. కాగా, బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ గత కొంతకాలంగా పాకిస్తాన్ నుంచి బలూచిస్తాన్ స్వాతంత్ర్యం పోరాడుతోన్న విషయం తెలిసిందే. గతంలో పాకిస్తాన్ ఆర్మీ సిబ్బంది, భద్రతా దళాలను లక్షియంగా చేసుకుని బీఎల్‌ఏ ఇటు-వంటి దాడులను చేసింది. 2025, మార్చిలో బలూచిస్తాన్‌లో ఏకంగా జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను బీఎల్‌ఏ వేర్పాటు-వాదులు హైజాక్ చేయడం సంచలనం రేపింది. పాకిస్తాన్ ఆర్మీ, భద్రతా దళాలను టార్గెట్ చేసుకుని దాడి చేయడం బీఎల్‌ఏకు అలవాటే కావడంతో.. తాజాగా జరిగిన దాడి వెనక కూడా వీరి హస్తమే ఉన్నట్లు- అధికారులు అనుమానిస్తున్నారు.

# సిఆర్‌డిఏ సమావేంలో కీలక నిర్ణయాలు

- మంత్రుల కమిటీలోనూ పలు అంశాలపైచర్చ
- ఆయా సంస్థలకు భూ కేటాయింపులకు నిర్ణయం
- వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ

**అమరావతి,మే6( వెలుతురు):**



అమరావతిలో ఇప్పటి వరకు 1050 ఎకరాల మేర వివిధ సంస్థలకు భూకేటాయింపులు జరిగాయని మంత్రి నారాయణ తెలిపారు. సీఆర్డీఏ 47వ సమావేశానికి ముందు మంత్రుల కమిటీ- సమావేశమై భూకేటాయింపులపై నిర్ణయం తీసుకున్నదని అన్నారు. ఆ నిర్ణయాలను మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. లా యూనివర్సిటీకి 50 ఎకరాలు, క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవ తారకం ఆస్పత్రికి అదనంగా మెడికల్ కాలేజీకి 6 ఎకరాలు, ఆదాయపు పన్ను శాఖకు 0.78 ఎకరాలు, రెడ్‌క్రాస్ సొసైటీకి 0.78 ఎకరాలు, కోస్టల్ బ్యాంక్‌కు 0.40 ఎకరాలు, ఐఆర్‌సీటీసీకి ఎకరం భూమిని కేటాయిస్తూ మంత్రుల కమిటీ- నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. ఏపీ కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో జరిగిన కీలక నిర్ణయాలను మంత్రి నారాయణ వెల్లడించారు. సీఆర్డీఏ 47వ ఆథారిటీతో పాటు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం కూడా జరిగిందన్నారు. 2014- 19లో గెజిటెడ్ ఆఫీసర్స్ క్వార్టర్స్ కు సంబంధించి రూ. 514 కోట్ల టెండర్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.. నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల క్వార్టర్లకు సంబంధించిన టెండర్లకు సైతం సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.. సీడ్ యాక్సిస్ రోడ్ లో అదనపు రోడ్ల టెండర్లకు కూడా సీఆర్డీఏ ఆమోదించింది.. అలాగే, నాన్ గెజిటెడ్ 9 టవర్లకు 506.67 కోట్ల రూపాయలు.. మరో 12 టవర్లకు రూ. 517 కోట్లకు సీఆర్డీఏ ఆమోదం తెలిపగా.. మొత్తం రూ. 1732.31 కోట్ల టెండర్లకు సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక, మంత్రివర్గ ఉపసంఘం లా యూనివర్సిటీకి 55 ఎకరాల భూ కేటాయింపులు చేసినట్లు నారాయణ చెప్పారు. క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు, బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ కళాశాల కోసం 15 ఎకరాలకు అదనంగా మరో 6 ఎకరాలు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అలాగే, కోస్టల్ బ్యాంక్ కు 0.4 ఎకరాలు, ఐఆర్సీటీసీకి ఎకరం, ఇన్కమ్ టాక్స్ కి 0.78 ఎకరాల భూమి కేటాయించినట్లు- పేర్కొన్నారు. అయితే, మొత్తం 7 సంస్థలకు మంగళవారం స్థలాల కేటాయింపు చేశామన్నారు. అంతకు ముందు 64 సంస్థలకు కేటాయింపులు చేయగా.. మొత్తం 71 సంస్థలకు 1050 ఎకరాల భూమి ఇవ్వడం జరిగిందని మంత్రి నారాయణ వెల్లడించారు. గెజిటెడ్ అధికారుల నివాస భవనాలను రూ. 514 కోట్లతో నిర్మాణం చేపడతామని నారాయణ వెల్లడించారు. వాటిలో అదనపు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 194 కోట్లు- మంజూరు చేసేందుకు సీఆర్డీఏ అనుమతి ఇచ్చిందన్నారు. తొమ్మిది టవర్లలో నాన్ గెజిటెడ్ అధికారుల నివాసాలు, మౌలిక సదుపాయాలకు అనుమతి సైతం ఇచ్చిందని తెలిపారు. మంగళవారం జరిగిన సీఆర్డీయే 47వ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అంతకు ముందు జీవోఎం కూడా సమావేశమై.. రాజధానిలో భూ కేటాయింపులపై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందుకు సంబంధించిన వివరాలను మంత్రి నారాయణ వెల్లడించారు. రూ. 517 కోట్లతో టెండర్లకు అనుమతి ఇచ్చిందని చెప్పారు. మొత్తంగా రూ. 1732. 31 కోట్లకు అనుమతి ఇచ్చినట్లు- తెలిపారు. అలాగే 190 ఎంఎల్డీల వాటర్ ట్రీటెమెంట్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 568. 57 కోట్లతో టెండర్ పిలిచామన్నారు. 15 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు- చెప్పారు. అందుకు రూ. 494 కోట్లతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఇక 3. 5 కిలోమీటర్ల ఈ3 రోడ్డు ఎలివేటెడ్ రోడ్డుకు సైతం అనుమతి ఇచ్చిందని ఆయన వివరించారు. ఈ 15,13 రహదారులను జాతీయ రహదారికి అనుసంధానం చేసేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. వీటిని రూ.70, రూ.387 కోట్లలో చేపట్టేందుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. జీవోఎంలోనూ వివిధ సంస్థలకు భూ కేటాయింపులు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. గతంలో 64 సంస్థలకు భూ కేటాయింపులు జరిగాయని చెప్పారు. ఇప్పటి వరకూ రాజధాని ప్రాంతంలో 1050 ఎకరాల మేర భూ కేటాయింపులు జరిగాయని మంత్రి పి.నారాయణ వివరించారు.

# కార్గో ఎయిర్‌పోర్టుతో విధ్వంసం

- ఆందోళనకు దిగిన ప్రజాసంఘాలు

**శ్రీకాకుళం,మే6( వెలుతురు):**




పచ్చటి ఉద్దానంలో విధ్వంసకర ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలను చేపట్టవద్దని రైతు, మహిళా, విద్యార్థి, యువజన ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. రాంపురం, భేతాళపురం, చీపురుపల్లి పంచాయతీలోని గ్రామాల రైతులకు సంఘీభావాన్ని ప్రకటించారు. గ్రామాలను పర్యటించి ఆందోళనలో ఉన్న బాధిత ప్రజలకు మద్దతును తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి చపర వెంకట రమణ, సీపీఎం కార్యదర్శి డి.గోవిందు, సీపీఐ ఎమ్మెల్ న్యూ డిమాక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్, ఉపకార్యదర్శి వంకల మాధవ రావు, వంశధార సాధన కమిటీ- సభ్యులు కొర్ల హేమారావు , నల్ల అడ్డి మాస్టర్, జీడీ రైతాంగ జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్, పిడిఎస్ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ వినోద్ మాట్లాడుతూ ఏ అభివృద్ధి పనులను చేపట్టినా ప్రజలకు ప్రయోజనం, వారి ఆమోదం పరిగణనలోకి తీసుకుని పాలకులు ఆలోచన చేయాలని, ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని ప్రజలు తమ నిరసనలు తెలుపుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గమనించాలని వారు కోరారు. మందస మండలం రాంపురం, గంగువాడ గ్రామాలలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ- అధ్యక్షుడు కొమర వాసు పిలుపు మేరకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సోర్ర రామారావు, ప్రజా కళ మండలి జిల్లా అధ్యక్షుడు రాపాక చిరంజీవి, రంగం కళాకారులు కొనారి సూధన్ ఆధ్వర్యంలో కళజాతర కార్యక్రమం నిర్వహించి బాధిత రైతులకు బాసటగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లాలోని పలాస అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల సముద్రతీర ప్రాంతాలలోని సుమారు 13 గ్రామాల ప్రజల భూభాగంలో గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను నిలుపుదల చేయాలని వారు కోరారు. మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరంలోని ఈ ప్రాంతంలో ఎయిర్పోర్ట్ నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేసి సుమారు 14 వందల ఎకరాల ప్రజల జీవనాధార భూముల్ని ప్రజల నుంచి కొనుగోలు చేసే యత్నాలకు పూనుకుంటు-న్నారనే సమాచారాన్ని తెలుసుకున్న ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రజల ఆమోదం లేకుండా ఈ కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణ చర్యలను చేపట్టడం సరైందికాదని వారు విమర్శించారు. ఉద్దానంలోని రైతులు, ప్రజలు తమ జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఈ ఎయిర్పోర్ట్ నిర్మాణం వద్దని వ్యతిరేకిస్తూ పోరాట బాటను పట్టారని తెలిపారు . ప్రజల భూములకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి బదులు ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేస్తున్నామనే స్పృహతో ప్రభుత్వం వ్యవహరించాలని సూచన చేశారు. ప్రజల ఆమోదంలేని ఇటు-వంటి నిర్మాణాలను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు-కు ప్రయత్నాలను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాందోళన ఉధృతం కాకముందే ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఇప్పటికే సంబంధిత గ్రామాల ప్రజలు ఉద్యమబాట పట్టిన వైనాన్ని గమనించే ప్రజా సంఘాలుగా మేము వచ్చామని వారన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు నాయకులు జోగి అప్పారావు, చిత్త.గున్నయ్య, ఎన్.పరుశు రాం, మర్ల. సంతోష్, డా.వై.యస్.ఆర్.ఉద్యానవన యూనివర్సిటీ- బోర్డు మెంబెర్ బత్తిని లక్ష్మణ్, గుంటు- .లోకనాథం, గుంటు- రామస్వామి, జోగి రాజు, ఎల్.నారాయణతో పాటు- పెద్ద ఎత్తున గ్రామాల రైతులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డుల జారీకి నేటి నుంచి దరఖాస్తులు

**క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డుల జారీ**

**మార్పులు,చేర్పులకు కూడా అవకాశం: నాదెండ్ల**

**అమరావతి,మే 6( వెలుతురు):**




రాష్ట్రంలో మే 7నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీకి దరఖాస్తులు స్వీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కొత్త కార్డులు జారీ, రేషన్‌కార్డు స్ప్లిట్, కొత్త సభ్యుల చేరిక, చిరునామా మార్పులు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం 3.28లక్షల దరఖాస్తులు వచ్చాయన్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్‌కార్డును జారీ చేస్తామని చెప్పారు. ఇందులో కుటుంబసభ్యుల పేర్లు చక్కగా కనిపించేలా ఉంటుందని అన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే గడిచిన ఆరు నెలలుగా తీసుకున్న రేషన్ వివరాలు కనిపిస్తాయని చెప్పారు. దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. నెలరోజులపాటు ఈ రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పౌరులు తమ వివరాలు తెలుసుకోవచ్చు. జూన్ నుంచే స్మార్ట్ కార్డులు జారీ అవుతాయి. ప్రస్తుతం 95 శాతం మేర ఈ కేవైసీ పూర్తి అయింది. ఈకేవైసీ పూర్తి అయిన వారు కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ నెల 12 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అకాల వర్షంతో నష్టపోయిన రైతులందరికీ పంట నష్ట పరిహారం అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు 1.50 కోట్ల మందికి దీపం పథకం ద్వారా లబ్ధి కలిగిందన్నారు. పాఠశాలలకు 25 కేజీల ఫైన్ క్వాలిటీ రైస్ ఈ ఏడాది నుంచి సరఫరా చేయబోతున్నామని వెల్లడించారు. రేషన్ కార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు అవకాశం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వేరే ప్రాంతానికి వలస వెళితే రేషన్ కార్డులను సరెండర్ చేయొచ్చని సూచించారు. ఇక, కొత్త రేషన్ కార్డులని స్మార్ట్ కార్డు తరహాలో ఇస్తున్నాం అని తేల్చి చెప్పారు. కొత్త డిజైన్ చేసి రేషన్ కార్డు ఇస్తున్నాం.. అని మనోహర్ పేర్కొన్నారు.అయితే, గ్రామ వార్డ్ సచివాలయంలో కొత్త రేషన్ కార్డు కోసం వివరాలు నమోదు చేసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల చెప్పారు. జూన్ లో అందరికి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తడిసిన ధాన్యం ఖచ్చితంగా కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇచ్చామని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.

## రోడ్డుప్రమాద బాధితులకు ఊరట

- ఆస్పత్రుల్లో లక్షన్నర వరకు ఉచిత వైద్యం
- ఉత్తర్వులు జారీచేసిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి, వారి కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రమాదంలో గాయపడ్డ వెంటనే నగదు రహిత చికిత్స అందించేలా ప్రవేశపెట్టనున్న కొత్త పథకం ఉపశమనం కలిగించనుంది. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకాన్ని ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ పథకం కింద బాధితుడు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఏదైనా గుర్తింపు పొందిన ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందవచ్చు. ఈ పథకం మే 5సోమవారం నుంచే అమల్లోకి వచ్చినట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ పథకానికి 'క్యాష్‌లెస్ ట్రీ-ట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీం-2025' గా కేంద్ర ప్రభుత్వం నామకరణం చేసింది. రోడ్డు రవాణా,



రహదారుల మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఎవరైనా మోటారు వాహనం వల్ల రోడ్డు ప్రమాదానికి గురైతే, ఈ పథకం కింద దేశంలోని ఏ ప్రాంతంలోనైనా వారికి ఉచిత చికిత్స లభిస్తుంది . ప్రమాద బాధితుడు ప్రభుత్వ లేదా నియమిత ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స పొందవచ్చు. డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.ఈ పథకం కింద, బాధితుడికి ప్రమాదం జరిగిన తేదీ నుంచి తదుపరి ఏడు రోజుల వరకూ గరిష్ఠంగా రూ. 1,50,000 వరకు ఉచిత చికిత్స అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

## కర్నాటక షూటింగ్ ముగించిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో ఫుల్ బిజీగా గడిపేస్తున్నాడు. కర్ణాటకలో మొన్నటి వరకు షూటింగ్ నిర్వహించారు. షూటింగ్ సెట్స్ నుంచి తాజాగా ఎన్టీఆర్ హైదరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్ట్ వద్ద ఎన్టీఆర్ స్టైలిష్ లుక్ లో కనిపించారు. చూస్తుంటే చాలా రగ్గుడ్ లుక్ లో ఉన్నారు. కాస్త బక్కగా మారిపోయిన ఎన్టీఆర్.. గుబురు గడ్డంతో కొత్త లుక్ లోకి మారిపోయాడు. ఇందుకు సంబంధించిన పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జూనియర్ ఎన్టీఆర్ ఇలాంటి లుక్ లో గతంలో కనిపించాడు. మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నాడు. ఓ వైపు వార్-2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అది ఇంకా రిలీజ్ కాకముందే ప్రశాంత్ నీల్ మూవీని సెట్స్ మీదకు తీసుకెళ్లాడు. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. 2026 జూన్ 25న రిలీజ్ చేస్తున్నట్టు- ఇప్పటికే ప్రకటించారు. త్వరలోనే విదేశాల్లో షూటింగ్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ప్రశాంత్ నీల్ మూవీ అంటే కచ్చితంగా ఎలివేషన్లు ఉండాల్సిందే. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ కు ఎలాంటి ఎలివేషన్లు ఉంటాయో చూడాలి. ఈ మూవీలో ఇంకా నటీ-నటు-లను తీసుకుంటూనే ఉన్నారు.



## క్యాథరిన్ థ్రెసాకు బంపర్ ఆఫర్

టాలీవుడ్‌లో అందం అభినయంతో ఆకట్టుకొనే గ్లామర్ హీరోయిన్ లో క్యాథరిన్ త్రెసా ఒకరు. 'చమ్మక్ చలో' మూవీతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ- ఇచ్చి నానితో 'పైసా', అల్లు అర్జున్‌తో 'ఇద్దరు అమ్మాయిలతో', 'రుద్రమదేవి', 'సరైనోడు' వంటి చిత్రాల్లో నటించింది. వరుస విజయాలతో దూసుకెళ్లిన క్యాథరిన్ తెరపై కనిపించి చాలాకాలం అవుతుంది. అవకాశాలు తగ్గడంతో సైలెంట్ అయిపోయింది. సోషల్ మీడియాలో కూడా కనిపించడం లేదు. ఇక తాజాగా ఈ అమ్మడు బంపర్ ఆఫర్ కొట్టేసింది.. మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబోలో మంచి ఫ్యామిలీ మూవీ తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మే లాస్ట్ వీక్ లో ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమాలు, ఓపెనింగ్ అయిపోయింది కాబట్టి నేరుగా సెట్స్ లోకి వెళ్ళిపోతారు. ఇక ముందు నుంచి వైరల్ అవుతున్నట్లు-గా మెయిన్ హీరోయిన్‌గా నయనతార ఒకే అయిన విషయం తెలిసిందే. ఇక రెండో కథానాయికగా క్యాథరిన్ త్రెస్సా ఓకే అయ్యిందట. సెకండ్ హీరోయిన్ అయినప్పటికి చిరుతో ఒకటి రెండు పాటలు ఉండడోతున్నయట. అయితే ఇక్కడ క్యాథరిన్ చిరుకి సంబందించి ఓ వార్త వైరల్ అవుతుంది.. ఏంటీ- అంటే.. చిరంజీతో నటించే అవకాశం క్యాథరిన్ కు 2017లోనే వచ్చిందట. 'ఖైదీ నెంబర్ 150' కోసం వివి వినాయక్ తొలుత ఆమెనే అనుకున్నారట. కానీ సుష్మితతో వచ్చిన విభేధాల కారణంగా క్యాథరిన్‌ని తప్పించి కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారట. ఇక కట్ చేస్తే తొమ్మిది సంవత్సరాల తర్వాత క్యాథరిన్ తిరిగి ఆ ఛాన్స్ దక్కించుకోవడం విశేషం.



## ఎట్టకేలకు క్షమాపణలు చెప్పేసిన సోనూ నిగమ్





కొన్ని రోజులుగా సింగర్ సోనూనిగమ్ పేరు వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన కర్ణాటక ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పారు. బెంగళూరులో జరిగిన కాన్సర్ట్‌లో ఆయన చేసిన కామెంట్స్‌పై 'కర్ణాటక రక్షణ వేదిక' బెంగళూరు సిటీ యూనిట్ అధ్యక్షుడు ధర్మరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఈ మొత్తం వ్యవహారంపై సోనూనిగమ్ క్షమాపణలు చెప్పారు. మొదట తన కామెంట్స్‌పై పూర్తి వివరణ ఇచ్చిన ఆయన.. తాజాగా మరో పోస్ట్‌లో కన్నడ ప్రేక్షకులకు క్షమాపణలు చెప్పారు. సారీ కర్ణాటక.. నాకున్న అహం కంటే మీపై ఉన్న ప్రేమే ఎక్కువ అని పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. ఇక ఈ వ్యవహారంపై వారంలోగా ఇన్వెస్టిగేషన్‌కు హాజరుకావాలంటూ బెంగళూరు పోలీసులు గాయకుడికి నోటీ-సులు జారీ చేశారు. మరోవైపు, సోనూపై 'కర్ణాటక ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్' బ్యాన్ విధించినట్టు- సమాచారం. ఏప్రిల్ 26న సోనూనిగమ్ బెంగళూరులో ఓ కాన్సర్ట్ నిర్వహించారు. ఆ వేదికపై ఆయన పాటలు పాడుతున్న సమయంలో ఓ అభిమాని కన్నడలోనే పాడాలంటూ డిమాండ్ చేశాడు. దీంతో, సహనం కోల్పోయిన సోనూ పాడడం ఆపేసి కన్నడ ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడారు. భాషపై తనకు కూడా అభిమానం ఉందన్నారు. కన్నడ భాషను తాను గౌరవిస్తానని చెప్పిన ఆయన.. ఆ అభిమాని తనను బెదిరించినట్లు- మాట్లాడటం నొప్పించిందన్నారు. పహల్గాం విషాదాన్ని ప్రస్తావించారు. 'పహల్గాంలో ఏం జరిగిందో దానికి ఇదే కారణం. కచ్చితంగా ఇదే.. ఇప్పుడు మీరు ఏం చేశారో అలాంటి కారణంగా ఆ దాడి జరిగింది. డిమాండ్ చేసే ముందు కనీసం మీ ముందు ఎవరున్నారో చూడండి' అని ఘాటుగా స్పందించారు.



## తండ్రి కాబోతున్న వరుణ్ తేజ్

ప్రేమ పెళ్లి చేసుకున్ని మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి అందరికి షాక్ ఇచ్చారు. చాలా కాలంగా లవ్‌లో ఉన్నఈ జంట తమ బంధాన్ని సీక్రెట్ గా ఉంచారు. వరుణ్ తేజ్ - లావణ్య మధ్య ఏదో నడుస్తోందని మీడియా కోడై కూసింది. మెగా కాంపౌండ్‌లో లావణ్య త్రిపాఠి ఎక్కుగా కనిపిస్తుండటం.. మెగా -అల్లు కుటుంబాలలో ఏ శుభకార్యం జరిగినా పాల్గొనడంతో ఈ అనుమానాలకు తావిచ్చింది. ఇద్దరూ ఈ గాసిప్స్‌పై మౌనంగానే ఉన్నారు. కానీ మొత్తనికి తమ రిలేషన్‌పై మౌనం వీడిన వరుణ్ - లావణ్య పెద్దల అంగీకారంతో ఒకటయ్యారు. ఇక తాజాగా ఈ యంగ్ కపుల్స్ కు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ జంట త్వరలో తల్లిదంద్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని స్వయంగా వరుణ్ తేజ్, లావణ్య అఫీషియల్ గా ప్రకటించేసారు. ఒక బ్యూటిఫుల్ పిక్ ని షేర్ చేసుకొని తాము అతి త్వరలోనే తల్లిదంద్రులు కాబోతున్నట్టుగా రివీల్ చేశారు. వరుణ్ కూడా 'జీవితంలో అత్యంత అందమైన పాత్ర పోషించనున్నాను' అని క్యాప్షన్ పెట్టేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండగా సినీ ప్రముఖులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మొత్తనికి వరుణ్ తండ్రి కాబోతున్నాడు. మెగా ఫ్యామిలి లోకి మరో వారసుడు రాబోతున్నారు. మొన్నటి వరకు వైరల్ అవుతున్న ఈ వార్త కన్ఫర్మ్ అయ్యింది.





## అనసూయకు ఫ్యామిలీ సపోర్ట్

అనసూయ భరద్వాజ్.. ఈ పేరుకు పరిచయం అక్కర్లేదు. బుల్లి తేరపై జబర్దస్త్ షో ద్వారా యాంకర్‌గా ఎంట్రీ- ఇచ్చి సెన్సేషన్ క్రియేట్ చేసింది. తన అందం, అభినయంతో చెరగని ముద్ర వేసుకుని, తనకంటూ స్పెషల్ ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఈ ఇమేజ్ కాస్త తనకు వరుస సినిమా అవకాశాలు కూడా తెచ్చి పెట్టింది. ఇప్పటి వరకు 'క్షణం', 'రంగస్థలం', 'పుష్ప', 'ఖిలాడీ' వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా పుష్ప 2, రాజాకార్ వంటి చిత్రాల్లో నటించింది. నెక్స్ట్ పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు : పార్ట్ 1' చిత్రంతో అలరించబోతోంది. అలాగే వీటితో పాటు-గా 'ఫ్లాష్ బ్యాక్', 'వోల్ఫ్' అనే చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఇక మూవీస్ విషయం పక్కన పెడితే వ్యక్తి గతంగా అనసూయ చాలా స్ట్రాంగ్ అని చెప్పాలి. ఆమె వస్త్రధారణ పై ఎన్నో ట్రోల్స్ వస్తున్న ఎదుర్కొంటూ వారికి తగిన సమాధానం ఇస్తూ ఉంటుంది. అయితే తాజాగా ఈ అమ్మడు కెరీర్ విషయంలో తన ఫ్యామిలీ సపోర్ట్ గురించి ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకుంది..ఇలాంటి బట్టలు వేసుకుంటే ఇంట్లో వారు ఆమెను ఏం అనడం లేదా? అని కొన్ని ప్రశ్నలు సోషల్ మీడియా వినిపిస్తున్నాయి వాటి మీద మీ అభిప్రాయం ఏంటని ప్రశ్నించగా.. అనసూయ మాట్లాడుతూ.. 'ఇంట్లో భార్యగా, కోడలిగా, తల్లిగా, ఒక మహిళగా నా బాధ్యతలు నిర్వర్తిస్తూనే ఉన్నాను. అందుకే నా కుటుంబం మొత్తం నా వృత్తికి ఎంతో సహకరిస్తారు. నా భర్త సుశాంక్ భరద్వాజ్ తో తెరపై 15 ఏళ్ల వరకు నా కెరీయర్ ఉంటుందని ముందే పర్మిషన్ తీసుకున్నా. అనుమతి తీసుకున్న తర్వాతే టెలివిజన్ రంగంలో అడుగు పెట్టాను. ఇక డ్రెస్సింగ్ విషయంలో నేను నా ఫ్యామిలీ క్లారిటీగా ఉన్నాం' అంటూ చెప్పుకొచ్చింది.





# సిఎంగా కొనసాగే హక్కు లేదు

- రేవంత్ తక్షణమే తప్పుకోవాలి: జగదీశ్ రెడ్డి



**సూర్యాపేట,మే6( వెలుతురు):**
రేవంత్ రెడ్డి ఒక్క క్షణం కూడా సీఎంగా కొనసాగేందుకు అర్హత లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ఆయన తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ తొలి నుంచీ చెబుతోన్న విషయం నేడు నిజమవుతుందన్నదని స్పష్టమైందన్నారు. ఓనమాలు రాని వాడిలా పదో తరగతి చదివినట్లున్నది రేవంత్ తీరని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి ఎటువంటి ముప్పు లేదని, కానీ రేవంత్ పరిపాలనకు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో అప్పులనుంచి తెలంగాణ రాష్ట్రానికి రెండున్నర లక్షల కోట్ల ఆదాయం వచ్చిందని, కానీ రేవంత్ పాలనలో రాష్ట్ర ఆదాయం తగ్గిపోగా, మంత్రుల ఆదాయం మాత్రం పెరిగిందని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు మోస్తున్నారు. సీఎం పదవి కోసం మంత్రులు పోటీ- పడి సంపాదనలో మునిగిపోతున్నారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి హామీలను తప్పించుకునేందుకు దొంగ ఏడుపులు ఏడుస్తున్నారని తీవ్రంగా దుయ్యబట్టారు. సీఎం మాట్లాడిన ప్రతి అక్షరం అబద్ధమని, ఇది ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే అని అన్నారు. మాది వందేళ్ళ చరిత్ర, అపార పరిపాలనా అనుభవం. ఒక్క సంవత్సరం మంత్రులు కడుపు కట్టు- కుంటే అన్ని హామీలు అమలయ్యేవని సూచించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ పరువు బజార్లో పెట్టారని ఆరోపిస్తూ, రాష్ట్ర మానాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ వాసికి ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో మరింత వేడి పెరిగే అవకాశం కనిపిస్తోంది.

## అక్రమార్కుల కేసుల్లో ప్రత్యేక కోర్టులు : లక్ష్మీనారాయణ

**హైదరాబాద్,మే6( వెలుతురు):**
అనంతపురం జిల్లా ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో హైదరాబాద్ సీబీఐ కోర్టు ఇచ్చిన తుది తీర్పును సీబీఐ పూర్వ జేడీ వీవీ లక్ష్మీనారాయణ స్వాగతించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారికి శిక్షలు పడితేనే మిగతా వారిలో భయం కలుగుతుందన్నారు. ఈ తరహా ఘటనల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వ్యవహారంలో రూ.840 కోట్ల విలువైన ఖనిజాన్ని అక్రమంగా తరలించారు. అక్రమాలకు శిక్ష పడితే మిగతా వారిలో భయం కలుగుతుంది. శిక్షలు పడకపోతే భూగర్భ సంపదను విచ్చలవిడిగా దోచేసే ప్రమాదం ఉంది. త్వరలో ఈడీ దర్యాప్తు కూడా కొనసాగవచ్చని, సీబీఐ కోర్టు తీర్పుపై కొందరు హైకోర్టుకు వెళ్లవచ్చని, అందువల్ల ఇలాంటి ఘటనల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు.

# సిఎం వ్యాఖ్యల్లో నిజాయితీ ఉంది


- బిఆర్ఎస్ లాగా బుకాచిచడం రాదు
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎదురుదాడి



**హైదరాబాద్,మే6( వెలుతురు):**
తెలంగాణ ఆర్థిక పరిస్థితిని నిజాయితీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. ఈటల హాఫ్ బిజెపి.. హాఫ్ బిఆర్ఎస్ అని దయాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్ చేసిన అప్పులకు నెలకు రూ.7 వేల కోట్లు- కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. తెలంగాణను దోచుకున్న దొంగలు బిఆర్ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీ నిర్మించుకున్నారని అన్నారు. కెసిఆర్ గుణం ఇంకా మారలేదని విమర్శించారు. కెటిఆర్ కాలు విరిగినా ఆయనే ప్రెస్ మీట్ పెట్టాలా? అని అద్దంకి ప్రశ్నించారు. కెటిఆర్ ను పైకి తేవడానికి పద్ధతి ప్రకారం కెసిఆర్ ప్లాన్ చేస్తున్నారని, బిఆర్ఎస్ రజతోత్సవ సభలో హరీష్ రావు ఫొటో కూడా లేదని ఎద్దేవా చేశారు. హరీష్ రావును కరివేపాకులా పక్కన పెట్టారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

# 8న బాధిత జర్నలిస్టులకు చెక్కుల పంపిణీ

- మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మే 6( వెలుతురు):**
వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పనిచేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయ కార్యక్రమం మే 9న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరుగనుంది. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా వచ్చి చెక్కులను అందచేస్తారని తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్, కే శ్రీనివాస్ రెడ్డి తెలియచేశారు. ఇటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు, ప్రతి కుటుంబానికి నెలకు మూడు వేల రూపాయల పెన్షన్ ఎల్కేజీ నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ 2000 ట్యూషన్ ఫీజు, జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు అకాడమీ ఛైర్మన్ వెల్లడించారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున, మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా, మీడియా. అకాడమీ వెబ్‌సైట్‌ను, జర్నలిస్ట్ ల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురిచిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

# రైలుబోగీలోసీటు దక్కిన వారు మరొకరిని రానివ్వరు

- భారత్‌లో రిజర్వేషన్లు కూడా అంతే
- రిజర్వేషన్లపై జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మే6( వెలుతురు):**
రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఓబీసీ రిజర్వేషన్లపై వాదనల సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరిగిన వాదనల సందర్భంగా పలు వ్యాఖ్యలు చేశారు. సామాజికంగా, రాజకీయంగా వెనకబడిన వర్గాల (ఓబీసీ) రిజర్వేషన్ల గురించి సీనియర్ అడ్వకేట్ గోపాల్ శంకరనారాయణనన్ వాదిస్తున్న సందర్భంలో జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రిజర్వేషన్లు రైలు భోగీ లాంటివి. సీట్లు దొరికించుకున్న వాళ్లు మరొకరిని రానివ్వరని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మహారాష్ట్రలో రాజకీయంగా వెనకబడ్డారా లేదా నిర్ధారించకుండా బంతియా కమిషన్ ఓబీసీలకు రిజర్వేషన్ ఇచ్చిందని అడ్వకేట్ శంకరనారాయణన్ వాదించారు. ఈ సందర్భంగా.. రైలు భోగీలో సీటు- దొరికిన వారు మరొకరికి సీటు ఇవ్వడానికి ఇష్టపడరని, ఇండియాలో కూడా రిజర్వేషన్ సిస్టం ఇలాగే ఉందని అన్నారు. జస్టిస్ సూర్యకాంత్ నవంబర్ 24 నుంచి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మే 14 నుంచి జస్టిస్ గవాయ్ సీజేఐ గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీ విరమణ తర్వాత జస్టిస్ సూర్యకాంత్ తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్నారు. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికలు 2016-17 నుంచి ఇప్పటి వరకు జరగలేదు. కారణం ఓబీసీ కోటా రిజర్వేషన్లపై కేసు నడుస్తుండటమే. అయితే మహారాష్ట్రలో ఓబీసీ కోటాను 27 శాతం అమలు చేయాలని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై కమిషన్ వేయాలని, రిజర్వన్ల కోటా 50 శాతం మించరాదని అప్పట్లో సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో ప్రభుత్వం అమలు చేయాలనుకున్న 27 శాతం రిజర్వేషన్ల అంశం వాయిదా పడింది. ఓబీసీ కోటా అంశం తేలకపోవడంతో అప్పటి నుంచి స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ వివాదంపై మంగళవారం విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

# పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లెక్కా

- ఇప్పుడు న్యాయం నన్ను నిర్దోషిగా నిలిపింది
- ఓబులాపురం కేసులో నిర్దోషిత్వంపై సబిత



**హైదరాబాద్,మే 6( వెలుతురు):**
ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సీబీఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు. ఈ తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధ పడ్డాను. న్యాయ వ్యవస్థ ద్వారా తనకు న్యాయం జరుగుతుందని నమ్మాను. ఈరోజు అదే జరిగింది. కానీ, ఇన్నేళ్లుగా నేను పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. అలా ప్రచారం చేసినా నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణంగా విశ్వాసం ఉంచారు. ఎవరెన్ని మాట్లాడినా నమ్మకుండా నన్ను గెలిపిస్తూ వచ్చారు. ఇన్నేళ్లుగా నాతో పాటు ఉండి ధైర్యం చెప్పిన అందరికీ కృతజ్ఞతలని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన ఓబులాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఏ2గా ఉన్న కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అతడితో పాటు- మరో నలుగురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నాంపల్లి కోర్టు క్లీన్ చిట్ ఇచ్చింది. 2004 నుంచి 2009 మధ్య వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్లో సబితా గనుల శాఖ మంత్రిగా పని చేశారు. సబితా హాయాంలోనే ఓబులాపురం మైనింగ్ స్కామ్ వెలుగు చూడటంతో సీబీఐ అధికారులు ఆమెను కూడా కేసులో నిందితురాలిగా చేర్చారు.

# మెట్టు మార్గంలో మరిన్ని సౌకర్యాలు

- టోకెన్లు ఇచ్చే కౌంటర్లు పెంచుతాం
- టిటిడి ఇవో శ్యామలరావు వెల్లడి



**తిరుమల,మే6( వెలుతురు):**
తిరుమల శ్రీవారి దర్శనార్థం కాలినడకన వచ్చే భక్తులకు శ్రీవారి మెట్టు మార్గంలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో జె. శ్యామలరావు తెలిపారు. కాలినడకన వెళ్లే మార్గంలో టోకెన్లు పొందేందుకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే విషయందృష్టికి వచ్చిన నేపథ్యంలో.. తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం కాలినడక మార్గంలో పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి మెట్టు మార్గంలో దర్శనానికి సంబంధించి టోకెన్లు పొందడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఆటోవాలాల నుంచి సరైన సహకారం లేదనే విషయం బోర్డు దృష్టికి వచ్చిందన్నారు. తితిదే కల్పిస్తోన్న సౌకర్యాలను ఆటోవాలాలు తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారని, భక్తుల నుంచి విచ్చలవిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు- ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపించే దిశగా చర్యలు తీసుకుంటామని ఈవో తెలిపారు. శ్రీవారి మెట్టు- మార్గంలో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమీక్షించి.. మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. తిరుపతి నుంచి శ్రీవారి మెట్టు మార్గం వరకు బస్సుల సంఖ్య పెంచడం, టోకెన్ల జారీ కౌంటర్లను పెంచే అంశాలను పరిశీలిస్తామన్నారు. భక్తుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇదిలావుంటే తిరుమలలో బుధవారం తితిదే పాలకమండలి అత్యవసరంగా సమావేశం కానుంది. ఉదయం 11గంటలకు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించి బోర్డు తీర్మానాలు చేయనుంది.

# మెట్రో ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం

- నష్టాల నుంచి అధిగమించేందుకు చర్యలు



**హైదరాబాద్,మే6( వెలుతురు):**
హైదరాబాద్ మెట్రో రైలు ఛార్జీలను పెంచే అవకాశాలపై తాజాగా సంకేతాలు వెలువడ్డాయి. మెట్రో వర్గాల సమాచారం ప్రకారం, మే రెండో వారంలో సవరించిన టికెట్ రేట్లు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎల్ అండ్ టీ- గ్రూప్ ఛైర్మన్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన భారత్‌కు చేరిన తర్వాతే ఛార్జీల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో సంస్థ ఈ టారిఫ్ సవరణలతో వార్షికంగా అదనంగా రూ.150 కోట్ల వరకు ఆదాయం పొందాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఛార్జీలు పెంచే అంశంపై ఇప్పటికే సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖల ద్వారా సమాచారం ఇచ్చింది. ప్రస్తుతం మెట్రోలో కనిష్ఠ టికెట్ ఛార్జీ రూ.10 కాగా, గరిష్ఠ ఛార్జీ రూ.60గా ఉంది. ఈ గరిష్ఠ ధరను రూ.75 వరకు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవలి నివేదికల ప్రకారం, మెట్రో రైలు సేవలతో పాటు ప్రకటనలు, షాపింగ్ మాల్స్ అద్దె లాంటి ఇతర మార్గాల ద్వారా మెట్రో సంస్థ ఏటా సుమారు రూ.1500 కోట్ల ఆదాయాన్ని నమోదు చేస్తోంది. అయితే మెట్రో నిర్వహణ, ఉద్యోగుల జీతాలు, బ్యాంకు రుణాల వడ్డీలు వంటి ఖర్చులతో కలిపి సంస్థకు వార్షికంగా సుమారు రూ.2000 కోట్ల వ్యయం జరుగుతోందని వర్గాలు తెలిపాయి.

# నేటి ఎపి ఐసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

**అమరావతి,మే6( వెలుతురు):**
బుదవారం జరగనున్న ఏపీ ఐసెట్ పరీక్షకు సర్వం సిద్ధమైంది. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 7న రెండు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 37,572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్ష కోసం హైదరాబాద్‌లో ఒక కేంద్రం సహా మొత్తం 93 కేంద్రాలను ఏర్పాటు- చేసినట్లు ఏయూ వీసీ రాజశేఖర్ వెల్లడించారు. విద్యార్థులు గంటన్నర ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని.. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష హాల్‌కు అనుమతించబోమన్నారు. ఐసెట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు సహకారంతో బందోబస్తు ఏర్పాటు- చేస్తున్నట్లు- తెలిపారు.

## నేడు వైకాపా పార్లమెంటరీ పార్టీ సమావేశం

**అమరావతి,మే6( వెలుతురు):**
బుధవారం ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిలోని వైఎస్ఆర్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం కానున్నారు. అలాగే, ఈ మీటింగ్ కి రీజనల్ కో- ఆర్డినేటర్లు కూడా హాజరు కానున్నారు. అయితే, పార్టీ నేతలకు, సభ్యులకు జగన్ రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించే అంశాలతో పాటు- కూటమి ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని మాజీ సీఎం వైఎస్ జగన్ దిశానిర్ధేశర చేయనున్నారు.

# లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

- కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిల పేర్లు

**అమరావతి,మే6( వెలుతురు):**
ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ33గా గోవిందప్ప బాలాజీలను సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల, అరెస్ట్ అయిన కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్యాల రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ చేర్చింది. ఈ ముగ్గురి ఆదేశాలతోనే అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల దగ్గరకు చేరాయని విచారణలో తెలిపారు నిందితులు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వీళ్ల పేర్లు చేర్చినట్లు- మెమోలో సిట్ పేర్కొంది. ఈ నేపథ్యంలోనే అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని సోమవారం నాడు సుప్రీం కోర్టుకు ఈ ముగ్గురు వెళ్లారు. కానీ, వీరికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏపీ హైకోర్టులోనే ఈ కేసును తేల్చుకోవాలని స్పష్టం చేసింది. కాగా, ఏపీ హైకోర్టులో ఈ కేసుకు సంబంధించి తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డితో పాటు- గోవిందప్ప పిటిషన్ దాఖలు చేయగా.. అందుకు హైకోర్టు నిరాకరించింది. దీంతో ఈ ముగ్గురు పేర్లను ఈ కేసులో చేర్చుతూ సిట్ మెమో దాఖలు చేసింది. ఈ మెమోను న్యాయస్థానం తమ పరిగణలోకి తీసుకుంటే.. ఈ ముగ్గురిని ఏపీ లిక్కర్ కుంభకోణంలో నిందితులుగా చేర్చినట్టు- అవుతుంది.

# టిడిపి సీనియర్ నేత పాలకొండరాయుడు కన్నుమూత

- ఎంపిగా, ఎమ్మెల్యేగా ప్రజల్లో సుస్థిర స్థానం
- రాయుడు మృతికి మంత్రుల సంతాపం

**అన్నమయ్య,మే6( వెలుతురు):**
అన్నమయ్య జిల్లా రాయచోటిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండరాయుడు కన్నుమూశారు.. 80 ఏళ్ల పాలకొండరాయుడు.. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రాణాలు విడిచారు.. రెండు రోజుల క్రితం అనారోగ్యపాలైన సుగవాసి పాలకొండరాయుడును బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు.. ఒకసారి రాజంపేట ఎంపీగా, నాలుగుసార్లు రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొందిన సుగవాసి పాలకొండరాయుడు.. రాజకీయాలలో తనకంటూ ఓ స్థానం దక్కించుకున్నారు.. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఎంపీ, ఎమ్మెల్యే గా పనిచేశారు.. పాలకొండరాయుడు మృతి విషయం తెలుసుకుని టీడీపీ శ్రేణుల, ఆయన అభిమానులు దిగ్భ్రాంతికి గురయ్యారు. దీంతో, రాయచోటి నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి.. మరోవైపు, సుగవాసి పాలకొండరాయుడు మృతి పట్ల మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్థన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.. పాలకొండ రాయుడు మరణం పై తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేసిన మంత్రులు... పాలకొండ రాయుడు మృతి ఆయన కుటుంబానికి, రాయచోటి నియోజకవర్గ ప్రజలకు, టిడిపి కార్యకర్తలకు తీరని లోటని పేర్కొన్నారు.. రాయచోటి ఎమ్మెల్యేగా నాలుగు సార్లు, రాజంపేట ఎంపీగా ఒకసారి గెలిచిన పాలకొండ రాయుడుకు రాయచోటి ప్రజలతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, దేవుని ప్రార్థిస్తున్నట్లు- రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు..



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com